ఎమెస్కో బాలభారతి ప్రచురణలు

ఎమెస్కో ఆర్షభారతి

॥అందరికీ వేదవిజ్ఞానము॥

ఎమెస్కో బొమ్మల భాగవతం



ఎమెస్కో

బొమ్మల భాగవతము



భాషాప్రవీణ

నారాయణాచార్య

EMESCO BOMMALA BHAGAVATAMU
Retold by
'Bhasha Praveena' Narayana Charya

Reprint
January 2002
May 2004

Publishers :
EMESCO ARSHA BHARATHI
Eluru Road, VIJAYAWADA - 2
Phone 0866-2575281 2577498

Illustrations
Chidambaram, Bali

D T P & Cover Design
Kumar

Printing **VAASU OFFSET,** VJA-2 **Ph 2438324,**

Price **Rs. 35-00**

ఎమెస్కో బొమ్మల భాగవతము

కరారవిందేన పదారవిందం
వరనారవిందేవినివేశయంతం
వటస్య పత్రస్య పుటేశయానం
బాలం ముకుందం మనసాస్మరామి!

సకల పాపములను పోగొట్టు దేవతా రూపమయిన సరస్వతి నది! నదీ తీరాన వ్యాసుని ఆశ్రమము ఉంది. వైశంపాయనుడు, సుమంతుడు, జైమినీ వంటి మహాఋషులు సమావేశం అయ్యారు. వారు లోక కళ్యాణం ఎలా జరుగుతుంది అని ఆలోచిస్తున్నారు.

ఈ ప్రపంచం ఎలా పుట్టిందీ ఎలా పోషించబడుతోంది. ఎలా లయం అవుతుందీ అంతా భగవంతుని లీల! అని చెప్పుకుంటున్నారు. వారందరికీ గురువుగారైన వ్యాసమహర్షులకు అర్థంకాని అనేక విషయాలు బోధించటం ఆనవాయితీ.

అయితే ఈ రోజు ఇలా పరధ్యానంగా ఉండటం వారికి ఆశ్చర్యంతోపాటు బాధనుకూడా కలిగించింది. ఏకాంత సమాధిలో ఉన్నారు కాబట్టి దానిని భంగపరచటం అంటే వారికి భయం.


ఎవరి చర్చలలో వారు మునిగిపోయిఉన్నారు. అలాంటి సమయంలో దేవతలకు ప్రేమపాత్రుడు అయిన దేవ ఋషి నారదుడు అక్కడకు వచ్చాడు. జైమినీ మొదలగు ఋషులు మహాజ్ఞాని అయిన నారదుడికి స్వాగతం చెప్పారు. అర్ఘ్యము, పాద్యము ఇచ్చి సన్మానించి ఉన్నత ఆసనం మీద కూర్చోమని కోరారు.

భాగవత కథా సుధ

నారదమహర్షి విష్ణుమూర్తికి భక్తుడు. ఎదురుగా వ్యాసభగవానుడు ఉన్నాడు. చుట్టూ కూర్చున్నవారు జ్ఞాన సంపన్నులు అయిన మహామునులు. వారి అందరి మధ్య కొద్ది కాలం నిశ్శబ్దం నెలకొని ఉంది. వ్యాసుడు అంత మౌనంగా ఉన్న కారణం ఏమిటి అని నారదునికి అనుమానం వచ్చింది. మనసులో అనుమానం కలిగాక నారదుడు తీర్చుకోకుండా ఉండలేడు. ముందుగా వ్యాసమహర్షిని తనే ఈ విధంగా అడిగాడు.

''ఓ వేదమూర్తీ! నీవు వేదములను నాలుగు విభాగములుగా విభజించావు. ఎంతో విజ్ఞానము కలవాడవు. నీ ఈ విషాదానికి కారణము ఏమిటీ?

అందుకు వ్యాసుడు ఇలా బదులు చెప్పాడు. ''నారద మహర్షీ! నేను వేదాలను విభజించాను. జయము అనే పేరుతో మహాభారతాన్ని రచించాను. ఆధ్యాత్మ రామాయణం అనే గొప్ప గ్రంధాన్ని కూడా రచించాను. పద్దెనిమిది పురాణాలు వ్రాశాను. అయినా నాకు తృప్తి లేదు. మనసుకు శాంతి లేదు. అక్షర దాహం ఇంకా తీరలేదు.




మహర్షీ! ఏమి చేస్తే నా మనసుకు తృప్తి కలుగుతుందో దేవ ఋషి, త్రిలోక సంచారి అయిన మీరే చెప్పాలి. నా జీవితం సార్థకం అయ్యే మార్గం ఏమిటి దేవ ఋషీ?''

నారదుడు వ్యాసుని మాటలు విని చిరునవ్వు నవ్వాడు.

''నాయనా! నీవు చేసిన రచనలు అసాధారణమైనవి. వేదాలను విభజించడానికి ఎంతో విజ్ఞానం కావాలి. భారతాన్ని రచించటానికి ఎంతో విజ్ఞత కావాలి. ''పురాణాలు చెప్పటానికి అపారమైన భక్తి, తత్త్వ జ్ఞానం ఉండాలి. నీవు చేసిన సాహిత్య సేవ చాలా అద్భుతమైనది. కాని సామాన్యులను అర్థమయ్యేలాగా మహాభాగవతాన్ని చెప్పిన నాడు నీ మనసులోని కొరత తీరుతుంది.

పూర్తి మనశ్శాంతి కలుగుతుంది. ప్రజలకు భావితరాల వారికి మహాభాగవతం కళ్యాణదాయకం అవుతుంది. శుభమస్తు'' అని వ్యాసునికి హితవు చెప్పి ఆశీర్వదించి నారదుడు వెళ్ళిపోయాడు.

వ్యాస భగవానుడు మంచి ముహూర్తం చూచుకుని భాగవత రచన మొదలుపెట్టాడు. దానిని పూర్తి చేసిన తరువాత ముందుగా తన కుమారుడైన శుక మహర్షికి వినిపించాడు.



ఆ తరువాత చాలా కాలానికి శుకుడు భాగవతాన్ని పరీక్షిత్తు మహారాజుకు ఒక వారం రోజులలో చెప్పాడు. దీనిని చెప్పిన వారు విన్నవారు తరించారు.

మహా భాగవతం పన్నెండు భాగాలు. ఒక్కో భాగాన్ని స్కంధము అంటారు. ఈ సృష్టి ఎలా జరిగినది?! కాలం ఎలా నడుస్తుంది? అనే విషయాలతో పాటు భగవంతుని దశావతారాలు సగర చరిత్ర, భగీరథుడి కథలు మొదటి తొమ్మిది స్కంధాలు వివరిస్తాయి. పదవ స్కంధము శ్రీకృష్ణుని అద్భుత లీలలు కథలూ ఉంటాయి. మిగలిన రెండు స్కంధాలలో యదువంశం అంతరించి పోవడం కలి ప్రవేశం లాంటి మరికొన్ని వివరాలు ఉంటాయి.

ఈ భాగవతంలో వ్యాసుడు రచించిన శ్లోకాలు పద్దెనిమిది వేలు. ఇది భక్తికి, ముక్తికి కేంద్రం అయి విరాజిల్లింది. ఎన్నో వేదాంత రహస్యాలు దీనిలో అందరికీ అర్థమయ్యేలా సులభంగా చెప్పాడు.

ఎందరో భక్తుల కథలను వ్యాసుడు కమనీయంగా వర్ణించాడు. మొదటి స్కంధంలో శుక మహర్షి, పరీక్షిత్తు మహారాజుల సంభాషణ ఉంది. భగవంతుని సాక్షాత్కారానికి చక్కని భక్తి, వైరాగ్య, జ్ఞాన మార్గాలను వ్యాసుడు చెప్పాడు. రెండవ స్కంధంలో యోగం ఎలా వుంటుందో, స్వర్గం ఎలా దొరుకుతుందో బ్రహ్మ, నారదుల సంభాషణలో వర్ణించాడు.



మూడవ స్కంధంలో ప్రళయం వచ్చినప్పుడు భగవంతుడు ఎలా ఉంటాడో, వరాహావతారం ఏమిటో జయవిజయులు, హిరణ్యాక్ష హిరణ్యకశ్యపుల కథలు, కపిల చరిత్ర వివరించాడు. నాల్గవ స్కంధములో ప్రజాపతులు, దక్షుడు, ధృవుడు, పృథువు మొదలైన వారి గురించి వ్రాశాడు. పంచమ స్కంధంలో ప్రకృతి, భూమి మీద విచిత్రాలు, ఆకాశ చక్రము, స్వర్గ నరకాలు వర్ణించాడు. ఆరవ స్కంధంలో వృత్రాసుర ఉపాఖ్యానం ముఖ్యమైనవి.

ఏడవ స్కంధం ప్రహ్లాదుని కథ ఎనిమిదవ స్కంధం గజేంద్రమోక్షం నించి క్షీరసాగర మథనం వరకూ అన్నీ అద్భుత కథలే సాగాయి.


తొమ్మిదవ స్కంధంలో రాముడు, పరుశురాముడు, రాజులలో సూర్య చంద్ర వంశాల వారి చరిత్రలు విపులీకరించాడు. దశమ స్కంధంలో లీలా కృష్ణుని బాల క్రీడలు, రాసలీల, కంసుని చంపడం, కృష్ణుని వివాహం వంటి దివ్య కథలు వున్నాయి. పదకొండవ స్కంధంలో యదువంశం అంతరించిపోవడం, ఉద్ధవుడు కథ, శ్రీ కృష్ణ నిర్యాణం ఉన్నాయి. పన్నెండవ స్కంధములో సృష్టి జరగడం ప్రళయంలో వినాశనం, త్రిపురాసురుడు మార్కండేయుడి కథ, సూర్యగోళం వివరాలు వున్నాయి.

ఈ విధంగా భక్తి, జ్ఞాన వైరాగ్యాలతో నిండిన ఈ భాగవతం మామిడి చెట్టులా ఎంతో ముచ్చట గొలుపుతుంది. చవులూరిస్తుంది. ఈ భాగవతాన్ని వ్యాసభగవానుకు సంస్కృత భాషలో రచించాడు. ఎంతో వినయమూ, వైరాగ్యమూ, భక్తీ కలిగిన బమ్మెర పోతన్న గారు తేనియలో కలాన్ని అద్ది తీయతెలుగు పద్యాలలోకి అనువదించి అందించారు.

పోతన గారి ఆంధ్ర భాగవత రచనకు సాక్షాత్తు శ్రీరామ చంద్రుడే ప్రేరణ ఇచ్చాడు. ఈ భాగవతంలోని భక్తి ఆంధ్రుల హృదయాలలో చిరస్థాయిగా నిలచిపోయింది. చైతన్యుడు, సూరదాసు వంటి ఎందరో భక్తులు ఈ కథ మీద కవిత్వాలు రచించారు. భాగవతం అంతా కలిపితే విష్ణుమూర్తి వైభవం తెలుస్తుంది. శ్రీకృష్ణుడు భాగవతంలో కథానాయకుడు అని చెప్పుకోవచ్చు. ఇది ఆంధ్రుల జీవితంలోకి ఎంతగా చొచ్చుకుపోయిందీ మన అందరికీ తెలుసు. మంచి చెడులను వేరు పరచి చెప్పాలంటే భాగవత కథలను సంఘటనలను దానిలోని పాత్రలను ఉదాహరణగా ఇవ్వడం అందరికీ అలవాటు.

భాగవతం ప్రతిరోజు చదవాలి. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఎందరో భాగవతాన్ని తమకు నచ్చిన రీతిలో, తమకు నచ్చిన భాషలో చెప్పి పుణ్యమూర్తులయ్యారు. అలాంటిదే ఈ ఎమెస్కో బొమ్మల భాగవతం. ఇది కేవలం భాగవతం మీద వెలిగించిన చిరుదీపం మాత్రమే. కథను బాగా అర్థం చేసుకోవాడానికి చిత్రాలను జోడించడం జరిగింది.

కథా ప్రారంభము



పూర్వం అడవులలో మునులు యజ్ఞయాగాలు చేసేవారు. అలాంటి వాటిలో సత్రయాగం ఒకటి. నైమిశ అనే అరణ్యంలో శౌనకాది మహర్షులు ఈ సత్ర యాగాన్ని చేశారు.

ఆ సమయంలో వారికి సూతమహర్షి పురాణ కథలు వినిపించేవాడు. పురాణాలన్నింటిలోకి తలమానికం అయిన శ్రీమహద్భాగవతం కూడా అలా చెప్పిందే!

భారతీయులు విద్యలను గురువుల నుంచి సంపాదించి తిరిగి వాటిని శిష్యులకు అందిస్తారు. ఈ విధంగా ఈ భాగవతం లాంటి పవిత్రమైన కథలను భావితరాలకు అందించారు. మొదటిసారి భాగవతాన్ని వ్యాసుడు శుకమహర్షికి చెప్పాడు. శుక్రుడు పరీక్షిత్తుకు, ఆ తరువాత సూత మహర్షి శౌనకాది మహర్షులకు ఈ పురాణాన్ని వివరించారు.

కథకు అంకురము

కురుక్షేత్ర యుద్ధం అయిపోయింది. పాండవులు జయించారు. అర్జునుని కుమారుడు అభిమన్యుడు. అతని భార్య ఉత్తర. వారి కుమారుడు పరీక్షిత్తు మహారాజు అయ్యాడు. పాండవులు మహాప్రస్థానం చేశారు. పరీక్షిత్తు మహారాజుకు ఉత్తరుడు అనగా విరాట దేశపు యువరాజు మేనమామ.

ఉత్తరుని కుమార్తె ఐరావతి. ఆమెనే పరీక్షిత్ పెళ్ళి చేసుకొన్నాడు. అతడు మంచిరాజు. ఎంతో భక్తిపరుడు. యజ్ఞయాగాలు చేసాడు. ప్రజలను కన్నబిడ్డలలాగా పరిపాలించాడు. అతని పాలనలో ప్రజలు ఎంతో సుఖించారు.

ఈతి బాధలు లేవు. ధర్మం నాలుగు పాదాల మీద నడిచింది. సమాజంలో కట్టుబాట్లు ఎంతో చక్కగా వర్ధిల్లినాయి. ప్రజలందరూ పరీక్షిత్‌ను ధర్మప్రభువు అని, దయామూర్తి అని కీర్తించారు. విధివశాన ఒకరోజు ఆయనకు అరణ్యానికి వెళ్ళి వేటాడాలనే కోరిక కలిగినది. వెంటనే బయలు దేరాడు. అలసట కలిగేంతవరకు క్రూర జంతువులను చీల్చి చెండాడాడు. కొంతసేపు అయ్యాక అలసట వల్ల దాహం అనిపించింది.

తిరిగి తిరిగి ఒక ముని ఆశ్రమం చేరుకొన్నాడు.

కథ వికాసం

అది శమీక మహర్షి ఆశ్రమం. ఎంతో నిశ్శబ్దంగా ప్రశాంతంగా, పవిత్రంగా ఉంది. ఎటుచూచినా ఎవ్వరూ కనిపించలేదు. దూరంగా ఒక చెట్టు నీడలో అరుగు మీద పులి చర్మం పరచుకొని కూర్చుని ఉన్నాడు.

ఆయనే శమీకుడు. తపస్సులో మునిగి ప్రపంచాన్ని మరచిపోయి ఉన్నాడు. ఆయన ఏకాంతాన్ని భంగపరచటం మంచిదికాదని పరీక్షిత్ ఆశ్రమంతా వెతికాడు. మంచినీరు కనిపించలేదు. శమీకుడు అది గమనించను లేదు. విధి లేక పరీక్షిత్ మహర్షి దగ్గరకు వచ్చి మంచి నీటి కోసం అర్థించాడు. ఆయనకు వినిపించలేదు.

మహారాజు పరి పరి విధాలుగా ప్రాధేయపడి అడిగాడు. అయినా శమీకుడు తపస్సమాధి చాలించలేదు. దాంతో విసుగు చెందాడు. దాహం అయినందువల్ల కలిగిన బాధతో, కోపం ప్రకోపించింది. ఆ దగ్గరలో చూడగా పరీక్షిత్‌కు చనిపోయిన పాము కళేబరం కనిపించింది.

వెంటనే వింటి కొనతో ఆ చనిపోయిన పామును మహర్షి మెడలో వేశాడు. తరువాత తన రాజధానికి మరిలిపోయాడు. ఈ జరిగినదంతా శమీక మహర్షికి తెలియదు. ఆయన, సమాధిలో నుంచి బయటకు రాలేదు.

కొంతసేపయ్యాక ఆయన కుమారుడు శృంగి ఆశ్రమములోనికి వచ్చాడు. రాజు వచ్చిన సమయంలో సమిధిల కోసం వెళ్ళాడు. పవిత్రంగా నిశ్చలంగా తపోదీక్షలో ఉన్న తండ్రి మెడలో చనిపోయిన పామును చూచి కన్నెర్ర చేశాడు..వరికి ఎన్నడు హాని తలపెట్టని తండ్రి పలకడు. శృంగి తన దివ్య దృష్టితో చూశాడు. జరిగినదంతా కనిపించింది. పరీక్షిత్తు మంచిరాజు అయి ఉండి కూడా చీమలకైనా అపకారం చేయని తన తండ్రిని అవమానించటం తీవ్రమైన కోపాన్ని కలిగించింది.

శాపము - శాప ఫలం

అహింసా మూర్తి అయిన నా తండ్రిని యిలా అవమానించిన వాడు ఎంత గొప్ప వాడైన ఏడు రోజులలోగా పాము కాటుకు గురి అయి చనిపోవుగాక! అని శపించాడు శృంగి.

ఆ తరువాత ఆశ్రమములో దిన చర్యలలో మునిగిపోయాడు. శమీకుడు తపస్సు చాలించాడు. జరిగిన ఉదంతం అంతా తెలుసుకొన్నాడు. ఆయనకు ఎంతో బాధ కలిగింది. మంచిరాజు అయిన పరీక్షిత్ చిన్నతప్పు చేసి ప్రాణాపాయమైన శాపానికి గురికావడం మనసును కలచింది. కాని శృంగి శాపాన్ని తాను మరలించలేడు.

కనుక ఒక బ్రహ్మచారిని పిలిచి ఈ విషయాన్ని ముందుగా రాజుకు చెప్పి రమ్మని పంపించాడు. ఇది విన్న రాజు తాను చేసిన చిన్న పొరపాటు ఆవేశంతో చేసిందే అయిన ప్రాణాంతకమైన శాపానికి దారి తీసిందని గుర్తించాడు. ఎంతో బాధకలిగింది. మంత్రులను పురోహితులను పిలిపించాడు. వారి ముందు తాను చేసిన తప్పిదాన్ని అంగీకరించి ఈ సమస్యనుంచి బయటపడే మార్గం సెలవివ్వమని కోరాడు.

వారు చాలా సేపు చర్చించుకొన్నారు. మంతనాలు పూర్తి అయిన తరువాత యిలా చెప్పారు.

''మహారాజా! గంగానదిలో ఒకే స్తంభం కలగిన మేడను కట్టించి దానిలో నివాసం ఉండాలి. తక్షకుడు శాపాన్ని సఫలం చేయడానికి రాలేడు''.

వారిచ్చిన సూచన మేరకు వెంటనే ఒంటి స్థంభం మేడ గంగానది మధ్యలో వెలిసింది. పరీక్షిత్తు మహారాజు పరివారంతో కలసి దానిలోకి ప్రవేశించాడు. అయినా ముందు జాగ్రత్త కోసం ఆయన పురోహితులు ఇలా చెప్పారు.

''మునుల వచనం వృధా పోదు. శమీకుడు పెట్టిన శాపం ఫలించితీరుతుంది. వారు తపస్సంపన్నులు కాబట్టి జరిగితీరుతాయి. తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పటికి ఏదో ఒక పద్ధతిలో తక్షకుడు ప్రవేశిస్తాడు. కాబట్టి ఈ ఏడు రోజులు ఏదో ఒక మహత్తరమైన పుణ్యకార్యం చేయాలి. భాగవత కథను వినటం ఎంతో పుణ్యఫలాన్ని అందిస్తుంది. ఎన్నో క్రతువులు చేసిన ఫలితం నీకు దక్కుతుంది. దాన్ని వ్యాస భగవానుడు ముందుగా తన కుమారుడు అయిన శుక మహర్షికి చెప్పాడు ఆయన ద్వారానే భాగవతాన్ని మీరు వినాలి.

ఈ పురోహితుల మాటలు పరీక్షిత్తుకు నచ్చాయి. వెంటనే ఆయన శుక మహర్షిని తీసుకువచ్చేందుకు గొప్పవారిని పంపించాడు. ఈ విషయమంతా విని శుకమహర్షి వెనువెంటనే బయలు దేరి వచ్చాడు. ఏడురోజుల భాగవత కథా శ్రవణం మొదలు అయింది. శుకమహర్షి తన పవిత్రమైన మాటలలో భాగవతాన్ని చెప్పగా పరీక్షిత్తు విన్నాడు. బ్రాహ్మణుడు రాజుగారి కోసం ఒక ఫలాన్ని కానుకగా యివ్వాలని వచ్చాడు. దానిలో దూరి లోనికి ప్రవేశించాడు తక్షకుడు. రాజుగారు అందుకున్నారు. వెంటనే దానిలో క్రిమిరూపంలో ఉన్న తక్షకుడు అనే మహాసర్పం వెలుపలకు వచ్చింది. కాటు వేసింది. శృంగి శాపం ఆ విధంగా ఫలించి పరీక్షిత్తు మహారాజు ప్రాణం విడిచాడు. ఆయన పవిత్ర జీవితం గడిపి భాగవతం విని చనిపోయాడు. కనుక విష్ణువు యొక్క సన్నిధిని చేరాడు. అంతటి మహానీయమయిన భాగవత కథ ఎమిటి?

లోక రక్షణ దీక్ష

ప్రపంచంలో ధర్మాన్ని కాపాడేందుకు విష్ణుమూర్తి అనేకసార్లు భూమి మీద జన్మించాడు. ముందు మహా రుషులుగా పుట్టి సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు మొదలయిన పేర్లలో ఎన్నో మహానీయమయిన పనులు సాధించాడు.

తపోదీక్షలో ఎంత విజ్ఞానం లభిస్తుందో ప్రపంచానికి చాటి చెప్పాడు. ఈ ప్రపంచం ఎలా నడుచుకుంటే లోకంలో సుఖము శాంతి వర్ధిల్లుతాయో వారు బోధించారు. భూమిని కాపాడేందుకు వరాహమూర్తి అయ్యాడు. నారద మహామునిగా పుట్టి పాంచ రాత్ర ఆగమాన్ని

ప్రచారం చేశాడు. దత్తాత్రేయుడు విష్ణువే! కపిలుడు నారాయణుడే! నరనారాయణులు ఆయన రూపమే!

ఋష్యభుడు యజుడుగా పుట్టి మన్వంతర కాలాలను రక్షించి, భూమిని కాపాడి, చక్కగా పాలించేందుకు పృథు చక్రవర్తిగా పుట్టాడు. మత్స్యావతారం, కూర్మావతారం, జగన్మోహిని అవతారం, నరసింహావతారం, వామనావతారం ఇవన్నీ భూమిని రక్షించటానికే!

భార్గవరాముడిగా పుట్టి రాజుల అహంకారాన్ని అదిమి వేశాడు. శ్రీరామ చంద్రుడై అవతరించి ఆదర్శ మహా పురుషుడిగా లోకానికి వెలుగుదారులు చూపించాడు. మునుల యాగాలను ధర్మాన్ని రక్షించాడు. శ్రీరామావతారంలోని అర్థం ఆదర్శ మానవుడు ఎలా నడుచుకోవాలి అని చెప్పడమే! ఆ తరువాత వ్యాసుడుగా పుట్టి ఎంతో విజ్ఞానాన్ని ప్రజలకు అందించాడు. వేదాలను విభజించడం, మహాభారత భాగవతాలను రచించడం, అష్టాదశ పురాణాలు చెప్పడం అన్నీ కూడా ప్రపంచానికి విజ్ఞానం అందించటానికే చేశాడు.

ఈ లోకం కళ్యాణదాయకంగా ఉండాలని ప్రజలు జ్ఞానవంతులై చక్కగా జీవించాలని భగవానుని సంకల్పం. ఇంక కృష్ణావతారంలో ఆయన ఎన్నో అర్థవంతమైన కొంటె పనులు చేసాడు. వెన్న దొంగిలించటంతో పాటు కురుక్షేత్రమంతటి గొప్ప యుద్ధాన్ని నడిపించి ధర్మం జయించేలా చేశాడు. గోప భామల చీరలు దొంగిలించిన వాడే నిండు సభలో ద్రౌపదికి వలువలు ఇచ్చి మానం కాపాడాడు. అది లీలారూపం! బుద్ధుడుగా అవతరించి నాస్తికులకు బుద్ధి చెప్పాడు. కలియుగంలో కూడా ఆయన పుడతాడని చెప్పాడు శుకమహర్షి!

ఎన్నో అవతారాలు ధరించాడు. వాటిలో రామావతారం ఆదర్శమూర్తి. ఈ కృష్ణావతారం పరిపూర్ణ అవతారం! మనిషి తెలుసుకోదగిన అంశాలన్నీ కృష్ణావతారంలో ఉన్నాయి. ఆ అవతార విశేషాలను ఎంతో చక్కగా వివరించి చెప్పేందుకే వ్యాసభగవానుడు భాగవతాన్ని రచించాడు.

సృష్టి అంతా విష్ణు రూపమే!

ఈ సృష్టిలో ఏ అణువులో చూచినా విష్ణుమూర్తి నిండి వుంటాడు. పంచ భూతాలు అంటే అయిదు ముఖ్యమయిన పదార్థాలు భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం!

ఈ అయిదు పదార్థాలతో సృష్టి అంతా ఏర్పడుతుంది. విష్ణువులోనే పాతాళం నుంచి పై లోకాలు అన్నీ ఇమిడి ఉన్నాయి. ఆయన రూపాన్ని వర్ణించటం వేయితలలు కలిగిన ఆది

శేషువుకి అయినా అసాధ్యం. ఏడు క్రింది లోకాలు పాతాళం, రసాతలం, తలాతలం, మహాతలం, అతలం, వితలం, సుతలం అనే పేర్లుతో ఉంటాయి. అవి ఆయన అవయవాలే.

ఈ భూలోకం విష్ణువు పొట్టలో వుంది. ఆకాశం అంతా ఆయన నాభి!. వక్షస్థలంలో స్వర్గం వుంది! కంఠంలో మహర్లోకం ఉంది. జనోలోకంలో ముఖం, నుదురు తపోలోకం! సత్యలోకం అంటే ఆయన శిరస్సు! విష్ణువు అంగాలలో దేవతలున్నారు. చెవులలో అష్టదిక్కులు ఇమిడి ఉన్నాయి. నాశిరా రంధ్రంలో అశ్వినీదేవతలున్నారు. ముఖంలో అగ్నిదేవుడున్నాడు. సూర్యచంద్రులు ఆయన కన్నులు.

ఆ మూల పురుషుడు కన్నులు విప్పితే పగలు, కన్నులు మూస్తే రాత్రి! రెప్పలే కాలం అన్నమాట! పలువరుసలో మైత్రీ భావం ఉందట. అది విశేషం. చిరునవ్వులో అనంతమైన మాయ వుంది. సముద్రాలు ఆయన పొట్టలో ఉన్నాయి. ధర్మం ముందు ఉన్నది. అధర్మం ఆయన వెనుకభాగం. ఆయన శరీరంలో రోమాలన్నీ చెట్లే! ఉచ్చ్వాస నిశ్వాసాలలో పెనుగాలులు వున్నాయి. మేఘాలను ఆయన జుట్టుగా ధరించాడు.

సంధ్యాకాలాలు ఆయన కట్టుకునే బట్టలు! హృదయం అవ్యక్తం అంటే అర్థం కానిది! అహంకారం పెచ్చుమీరితే ఆయన రుద్రుడు. అంతటి మహారూపం ఎక్కడుందో వ్యాసభగవానుడు వివరించాడు.

ఆయన నివాస స్థానం మానవ హృదయాలేనట! సమాజం అంతా ఐకమత్యంతో కలిసి చక్కగా అయితే అదే విశ్వరూపం! దేవతలు ఆయన గానం! రాక్షసులు ఆయనలో భాగమే!! సృష్టిలోని మంచి చెడ్డ అంతా ఆయనే అన్నమాట!

విశ్వ రూపమే వేదం

విష్ణువు సంకల్పం అంటే మనసులో అనుకోగానే సృష్టి అంతా జరిగింది. అనేక రూపాలుగా వికసించింది. ఈ సృష్టి వికాసాన్ని మనకు అర్థమయ్యేలా వివరించేది విశ్వరూపం! దీనిలో ఉన్నదంటా ప్రకృతి రహస్యమే! ప్రకృతి అంటే విష్ణువు కల్పించిన మాయ. అతడు దాన్ని ఎలా కల్పించాడు ? ప్రారంభం ఎలా జరిగింది? మొదట అంతా . శబ్దమే ఉండేది! దానికి ఆదారం ఆకాశం శబ్దంలోంచి సృష్టి అంతా వికసించింది. శబ్దం లోంచి స్పర్శ, దానిలోంచి రూపం, రసం, గంధం ఏర్పడ్డాయి. వాటిలోంచి పైన చెప్పుకున్న పంచభూతాలు కూడా పుట్టాయి. అయితే వాటికి చైతన్యం లేదు.

కొన్ని లక్షల సంవత్సరాలు ప్రాణం లేకుండా అవి అలా పడి ఉన్నాయి. సృష్టిని వికసింపచేయాలని కోరుకున్న నారాయణుడు వాటికి జీవశక్తిని ఇచ్చాడు. చైతన్యం ఏర్పడింది. పంచభూతాలు సృష్టిలో మనం చూస్తున్న అనేకానేక వస్తువులు ప్రాణులుగా మారాయి. ప్రకృతికి సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా అంతా విశ్వరూపమే! విశ్వరూపమే విష్ణువు. విష్ణువే విశ్వరూపం అని తెలుసుకుంటే ఇటు సృష్టి అటు భగవంతుడు అర్థమయినట్లే! విశ్వరూపం అంటే ప్రకృతికి అద్దం!

ప్రకృతి పరిణామాలు

ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రకృతి ఎన్నో మార్పులకు గురి అయింది. పంచభూతాలలో మొదటిది భూమి దాని కంటే పదిరెట్లు నీరు, ఇంకా పదిరెట్లు అగ్ని, ఇంకా పదిరెట్లు గాలి, దానికి పదిరెట్లు ఆకాసం ఉంటాయి. ఒకదానికన్నా మరొకటి పదిరెట్లు ఎక్కువగా ప్రకృతి పదార్థాలతో సృష్టి ఏర్పడింది.

పదార్థాలు జీవం వచ్చాక ఇంకా అద్భుతమయిన మార్పులకు ఎలా గురి అయ్యాయో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ముందు మహత్వం! ప్రాణం లేని స్థితి ఇది. రెండు అహంకారం! నేను అనే ఉనికి ఏర్పడింది. జ్ఞానేంద్రియాలు వచ్చాయి. మూడు భూత స్వర్గంలో ఇంద్రియాలకు అంతరంగిక లక్షణాలు వచ్చాయి. నాలుగు ఇంద్రియ వికాసం! వాటిని ఉపయోగించటం... నేర్చుకున్నాయి. అయిదు అధిష్ఠాన సృష్టి! అంటే ఇంద్రియాల అధికార శక్తులు పుట్టినాయి. అలా కావాలనుకున్నప్పుడు వాటిని వినియోగించడం కావాలనుకున్నప్పుడు నిరోధించగల శక్తి ఏర్పడింది.

ఆరు అనిద్రా సృష్టి ఆశపడటం మోహించడం, వశమై పోవడం అకాల లక్షణాలు వచ్చాయి. ఏడు స్థావర ప్రాణాలు, చెట్లు, చేమలు వంటి అర్ధ ప్రాణులు అచేతనాలు. రాళ్ళు రప్పలు వంటి విభాగం గుర్తింపును పొంది, వేరుపడినాయి. ఎనిమిది పశు సృష్టి దాని వల్ల ప్రాణం వున్నవి లేనివి అనే విభాగంతో పాటు ప్రాణులలోనే బుద్ధి జీవులు కానివి అనే విభాగం వచ్చింది. తొమ్మిది మనుష్య సృష్టి! చింతనాపరుడు పూర్తిగా బుద్ధి వికాసం కలిగిన వాడు అవతరించాడు. దైవిక సృష్టి పదవది అది ఇంకా రాలేదు. ఎప్పుడో వస్తుంది. సంకల్పంతోనే అన్నిటిని పొందగలిగిన మహోన్నత మానవుడు వస్తాడు. ఇకముందు కాలంలో సాధనాలు, యంత్రాలు సహాయం లేకుండా అన్నీ తీర్చుకోగల విశేష శక్తిశాలి మానవుడు అవుతాడు! రిగ్గులు వెయ్యకుండా గాస్ తియ్యగలడు. విమానం లేకుండా విదేశాలకు పోగలడు!

ఈ విధంగా భాగవతం మనిషి పరిణామక్రమంలో జరిగిన దానిని చివర వున్న దానిని వర్ణించింది. ఇది కల్పనలాగా అన్పించదు. ఎంతో విజ్ఞాన దాయకంగా హేతుబద్ధంగా ఉంటుంది. వ్యాస భగవానుడు ఆనాడే సృష్టి పరిణామాన్ని ఎలా వర్ణించారో?! ఎంత విజ్ఞానం ఇది! చూడండి ఎంత చక్కగా చెప్పాడో!

కోటానుకోట్ల సంవత్సరాలకు పూర్వం ఎక్కడా ఏమీ లేదు. దానిలో శబ్దం పుట్టింది. శబ్దంలోంచి ఆకాశం పుట్టింది. ఆకాశంలోంచి మేఘం పుట్టింది. మేఘంలోంచి గ్రహాలు, పాలపుంతలు పుట్టాయి. వాటిలోంచి సౌరకుటుంబం పుట్టింది.

దానిలో భూమి వేరుపడింది. దానిమీద సముద్రాలు వచ్చాయి. సముద్రంలో ఏక కణజీవి పుట్టింది. అది బహుకణ జీవిగా మారింది. వాటిలోంచి ప్రాణులు అవతరించాయి. ముందు చేపలు సముద్ర జంతువులు తరువాత నీటిలో భూమిమీద నడిచే ఉభయచరాలు తాబేలు లాంటివి. తరువాత ఆకాశంలో ఎగిరే పక్షులు, భూమి మీద తిరిగే ప్రాణులు భూమి మీద తిరుగుతూ ఆకాశంలో కూడా ఎగిరేవి. వీటన్నిటి మధ్య మహామేధావి అయిన మానవుడు పుట్టాడు! ఎలాంటి అవగాహన ఇచ్చారు? ఈ భాగవతం భక్తి, ముక్తిగాక ఎంతో విజ్ఞానాన్ని అందించింది.

కాలానికి వంతెన

నేను ఉన్నాను అని తెలియపర్చుతూ ఏ ఒక్కరికి ఏనాడు కన్పించని వస్తువు ఏదైనా ఉన్నది అంటే అది కాలమే కదా! కాలమే భగవంతుని రూపం! భాగవతం నిర్వచనం ఇది! కన్పించకుండా కదిలిపోయే అద్భుతమే కాలం!

కణద మహర్షి రచించిన అణు శాస్త్రానికి కాలానికి కూడా సంబంధం ఉంది. అణువుల ద్వారానే కాలాన్ని కొలవడం ప్రారంభించారు.

అన్నింటికన్నా చిన్నది పరమాణువు.

రెండు పరమాణువులు కలిస్తే ఒక అణువు

మూడు అణువులు కలిస్తే దాని పేరు త్రసరేణువు.

సూర్యకిరణం ఆ త్రసరేణువు దూరాన్ని దాటటానికి పట్టే కాలం పేరు త్రుటి కాలం.

ఇలాంటి త్రుటికాలాలు వంద అయితే అది వేధ.

మూడు వేధదలు కలిస్తే లవ కాలం.

మూడు లవాలు ఒక నిమేషం (నిముషం కాదు)

మూడు నిమేషాలు ఒక క్షణం.

ఐదు క్షణాలు కలిసే కాలం పేరు కాష్ఠం.

'కాష్ఠానాం మధ్యే నిహతి శరీరం' అని దేవేంద్రుడన్నాడు. అంటే రెండు కాష్ఠాకాలాల మధ్య కాలంతో పాతశరీరం నశించి క్రొత్త శరీరం పుడుతుంది.

చావు పుట్టుక ఒకసారే మనిషి అనుభవిస్తాడని అనుకుంటారు. కాని చావు పుట్టుకల మధ్య ఎన్ని కోట్ల సార్లు మనిషి క్రొత్త జీవితం పొందుతాడో గమనించాలి.

అది అర్థం చేసుకున్నారు. కాబట్టే ఋషులకు చావుపుట్టుకలంటే భయం లేకుండా పోయింది.

15 కాష్ఠాలు కలిస్తే ఒక లఘువు.

15 లఘువులు ఒక నాడి.

2 నాడులు ఒక ముహూర్తం. ముహూర్తాలనేవి అంత కొద్ది కాలంలో పూర్తి చేయగలగాలి. అప్పుడే ఫలితం. ఏడు నాడులు ఒక ప్రవహం. యామం అంటే ప్రహరమే. పగలు లేక రాత్రి కాలంలో యామం అనేది నాలుగోవంతు. యం మం అన్నా ఝాము అన్నా ఒక్కటే.

ఎనిమిది ఝాములు ఒక దినము 15 దినములు ఒక పక్షం.

30 దినాలు ఒక మాసము.


2 మాసాలు ఒక ఋతువు! మూడు ఋతువులు ఒక ఆయనం.

ఆరు ఋతువులు లేక రెండు ఆయనాలు ఒక వర్షం. సంవత్సరం. అటువంటి నూరు సంవత్సరాలు ఒక మనిషి జీవితం కాలానికి సంకేతం సూర్యుడు. సౌరమానంలో ప్రతి అణువుకణాన్ని అతని కిరణాలు తాకుతాయి. కృతయుగానికి పదిహేడు లక్షల ఇరవై ఎనిమిది వేల సంవత్సరాలు! త్రేతాయుగానికి పన్నెండు లక్షల తొంభైఆరు వేల యాభై సంవత్సరాలు. ద్వాపర యుగం మూడవది దాని నిడివి ఎనిమిది లక్షల అరవై నాలుగు వేల సంవత్సరాలు. ఈ మూడు యుగాలు ఇప్పటికే ముగిసాయి. ఇప్పుడు నడుస్తోంది కలియుగంలో ప్రథమ పాదం. దీని పొడవు నాలుగు లక్షల ముప్పై రెండు వేల సంవత్సరాలు. ఈ నాలుగు యుగాలు కలిస్తే ఒక మహాయుగం. మన్వంతరం అంటే అటువంటి డబ్బైఒక్క మహాయుగాలు ఇప్పటి

మన్వంతరం ఏడవది.. ఆరు మన్వంతరాలు అయిపోయాయి. ఇది మానవులు కాలం తాలూకు కాలమానం. ఇక బ్రహ్మ కాలమానం దేవతల కాలమానం వేరు. మహాయుగం అంటే ఏమిటో మనం చూచాం. అటువంటి వేయి మహాయుగాలైతే బ్రహ్మకు ఒక పగలు బ్రహ్మకు ఒక పగలు ఒక రాత్రి అయితే మనకు అది ఒక మహాకల్పం! ఇప్పుడు నడుస్తోంది శ్వేతవరాహ కల్పం. ఆ రోజులను సంవత్సరాలుగా గుణించితే బ్రహ్మ ఆయుర్దాయం నూరు సంవత్సరాలు! మొదటి సగం పూర్తయ్యింది. రెండవ సగం నడుస్తోంది. రెండవ సగం నడుస్తోంది. దాన్ని పరార్ధకాలం అంటారు. బ్రహ్మ దేవుడు విష్ణువునకు పుత్రుడే! విష్ణుమూర్తి నాభిలోంచి ఓ కమలం పుట్టింది. దానిలోంచి నాలుగు తలల బ్రహ్మ పుట్టాడు! అందుకే బ్రహ్మ పద్మ సంభవుడు అంటారు. బ్రహ్మ జీవించే కాలాన్ని పద్మ కల్పం అని కూడా అంటారు.

అయితే కాలం బ్రహ్మ దగ్గర జరిగే సృష్టి అంతటికి అంటే పరమాణువునుంచి బ్రహ్మ వరకు అని ప్రాణులు ప్రాణం లేని వస్తువులకు వర్తిస్తుంది.

విష్ణుమూర్తి కాలస్వరూపుడు. కాలానికి నారాయణ దేవుడు నియంత! అందువల్ల ఆయనకి కాలనియమం వర్తించదు. ఆయన ఉంటాడు! అంతే ఇంతకాలం అని ఉండదు. ఎప్పుడు ఉంటాడు. కాలాన్ని తనే సృష్టించి అందులోంచి ప్రకృతిని సృష్టించి మళ్ళీ తనలో కలిపేసుకుంటూ వుంటాడు. అది విష్ణులీల! విష్ణుమాయ! అలాంటి విష్ణుమూర్తి కథలు గల భాగవత సారాన్ని మనం చదువుతున్నాం.



వేదాలను ఉద్ధరించాడు

కల్పాలు గతించాయి. మన్వంతరాలు పోయాయి! సృష్టి ప్రారంభమయి ఎంతో కాలం గడచిపోయి శ్వేతవరాహకల్పం ప్రారంభమైన సమయంలో కథ ఇది!

విష్ణువు నాభిలోంచి పుట్టిన బ్రహ్మదేవుడు కమలాసనం మీద కూర్చున్నాడు. విష్ణువు ఆదేశానుసారం మాయను అంటే సృష్టిని కల్పించాలి! ఆ పని ఎలా చేయాలో అని ఆలోచనలో ఉన్నాడు బ్రహ్మ. బ్రహ్మ దేవునికి ''క'' అనే పేరుంది! సృష్టి ఎలా చేయాలని ఆలోచిస్తున్న సమయంలో ఆయన శరీరం రెండు భాగాలైంది. రెండవ భాగయం ''య'' అయింది! కాయం అంటే శరీరం! శరీరంలో ఒక భాగం పురుషుడు, రెండవ భాగం స్త్రీ! స్త్రీ పురుషుల శరీరాలు రెండు కలిస్తే సృష్టి చేయగల బ్రహ్మ శరీరం అవుతుంది! వేరు వేరుగా వున్నప్పుడు స్త్రీ పురుషులు (అర్ధకాయులు) సగం శరీరం కలిగినవారు మాత్రమే అవుతారు. బ్రహ్మ చేత ఆ విధంగా పుట్టిన మొదటి పురుషుడు స్వయంభువుడు. అతనికి మనువు పదవి ఇచ్చారు. స్వయంభువ మనువు అయ్యాడు. మిగిలిన సగభాగం అయిన స్త్రీ పేరు శాత్నత! ఈ సృష్టిలో అది స్త్రీ పురుషులు వారే! ప్రథమ దాంపత్యం వారిదే! ఆ దాంపత్య ఫలాలుగా వారికి ఇద్దరు కొడుకులు ముగ్గురు కుమార్తెలు పుట్టారు. కొడుకులు ప్రియ వ్రతుడు, ఉత్తానపాదుడు. కుమార్తెలు ఆహుతి, దేనహుతి, ప్రసూతి అనే వారు.

ఈ భూమి మీద నివసించే మనం మన పూర్వులు అంతా వీరి యొక్క సంతానమే. మానవ సంతతికి ప్రపితామహులకు తాతలు వారవే! అప్పటికి ఈ భూగోళం అంతా సముద్రంలో మునిగిపోయి ఉంది. సంతతి అయితే పుట్టుకొచ్చారు. కాని వారంతా బ్రతకడానికి చోటు ఎక్కడుంది?


తన సంతతి వారంతా చోటు లేక పడుతున్న కష్టాలను చూచి సహించలేక పోయాడు మనువు. వెంటనే బ్రహ్మను గురించి తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై నీ కోరిక ఏమిటి? అని ప్రశ్నించాడు. ''తండ్రీ! నాకు సంతానం పెరిగింది వారంతా చాలమంది అయ్యారు నివసించేందుకు చోటు చాలకుండా ఉంది. భూమి అంతానేమో సముద్రంలో మునిగిపోయి ఉంది. ఎలాగైనా భూమిని పైకి వచ్చేలా చెయ్యి దానిమీద నా సంతతి నివాసముంటారు.

వారు సామాజికులుగా సభ్య జనులుగా రూపొందించే పద్ధతి ఏమిటో అది నేను ఆలోచించుకుంటాను. మనుషుల సంతతి నిరంతర వృద్ధి చెందాలి కదా! అందుకు తగిన

చోటు భూమి! ఈ వరాన్ని ఇచ్చి పుణ్యం కట్టుకో'' అని అడిగాడు. ''తథాస్తు'' అన్నాడు బ్రహ్మ!

కాని ఎలా? సముద్రం నుంచి భూమిని వెలికి తీయటం మాటలు కాదు గదా తీయకపోతే మానవ సంతతి అంతా ఏం కావాలి? ఎంత ఆలోచించినా ఏమి పాలుపోలేదు. బ్రహ్మ ఒక నిట్టూర్పు విడిచాడు! ఆ నిట్టూర్పులోంచి బొటన వ్రేలు అంత ఆకారం కలిగిన 'వరాహం' జన్మించింది. అది పుట్టినప్పుడు అన్ని శుభ శకునాలే కన్పించాయి. చూస్తూ వుండగానే బ్రొటన వ్రేలు అంత వరాహం ఏనుగు అంత పెద్దదిగా అయ్యింది. అనుక్షణం పెరుగుతూనే వుంది.

అది విష్ణుమాయ! అతడే శ్రీహరి! భూమిని ఉద్ధరించడానికి వరాహరూపంలో నారాయణుడు అవతరించాడని అందరూ గుర్తించారు. పాటలు పాడి మ్రొక్కులు మ్రొక్కి పూజలు చేసారు. ఆ ప్రాణికి తెల్లని కోరలు ఉన్నాయి. శరీరం మీద రోమాలు నిక్కపొడుచుకొని ఆయుధాలులాగ ఉన్నాయి. కళ్ళనుంచి సూర్యచంద్రులు తొంగి చూస్తున్నారు. అది ఏదో చేయాలని ఎంతో తీవ్రంగా ప్రయత్నిస్తుంది. కన్పించిన ప్రతి చోటుని కొమ్ముతో కోరాడుతూ అట్టహాసం చేస్తుంది. ఆకాశమంతా తిరిగింది. చివరకు సముద్రంలోకి ఉరికింది వరాహం.



భూమికి గంధవతి అనే పేరు ఉంది. వరాహం వాసన చూచి వస్తువులను గుర్తించగల శక్తి గలది! ఆ విధంగా మార్గం సుగమం అయ్యింది. ఆకాశంలో చేరిన విధంగానే శ్వేత వరాహమూర్తి సముద్రంలో కూడా అల్లకల్లోలం చేసాడు. సముద్రాన్ని కలచి వేసాడు. కోరలతో సముద్రం అడుగు పొరల్ని చీరాడు. తోకతో నీటిని కొట్టాడు! కన్పించిన ప్రతి వస్తువుని గోళ్ళతో చీరి పారేసాడు. ఎంతో కాలం సముద్రాన్ని కలచిన తరువాత రసాతలంలో భూమి కన్పించింది. వెంటనే మూతి మీద ఉన్న భయంకరమైన కొమ్ముతో దాన్ని పైకి లేపాడు!

మొత్తం భూమిని ముట్టెమీద నిలబెట్టాడు! తిరిగి ప్రయాణమయ్యాడు! అయితే ఆయన శక్తి ఏమిటో అక్కడ దాగి వున్న రాక్షసుడికి తెలియదు పాపం! ఆ రాక్షసుడి పేరు హిరణాక్షుడు . సముద్రం అడుగున వుండే లోకాన్ని పాలించే రాజు తన క్రింద పడి వున్న భూమిని ఎత్తుకు పోతూ వుంటే చూచి సహించలేకపోయాడు.

శత్రువు ఎంతటి శక్తి మంతుడు అని చూడలేదు. సముద్రం మధ్యములోనే వరాహమూర్తితో తలపడ్డాడు! ''భూమిని ఎవరూ తీసుకుపోవడానికి వీలుకాదు'' అని సింహగర్జన చేసాడు. అది విని ఆ వంకకు తిరిగాడు. యజ్ఞమూర్తి అయిన వరాహస్వామి. ముందు ఇద్దరు గదలతో యుద్ధం చేసారు. బలాబలాలు తేలలేదు. గదలు విరిగాయి. వరాహస్వామి కోరల మీద నున్న భూగోళాన్ని పిడికిట పట్టాలని హిరణ్యాక్షుడు ప్రయత్నించాడు. అతడు ఆ ప్రయత్నంలో ఉండగానే ఒడిసిపట్టుకున్నాడు. గోళ్ళతో బాధించాడు. రకరకాల చిత్ర హింసలకు గురి చేసాడు. తన శరీరం మీద వజ్రాయుధాల వంటి రోమాలు ఉన్నాయి.

వాటిని ఆయుధాలుగా ఉపయోగించి హిరణ్యాక్షుడు ప్రాణాలు పోయినదాక యుద్ధం చేసాడు. అతని శరీరం నేల మీద పడింది. కొండలా సముద్రంలో మునిగిపోయింది. అతని ఆత్మ వెలుపలకు వచ్చి వరాహమూర్తిలో ఐక్యం అయిపోయింది. ఆ విధంగా స్వామి భూమిని సముద్రం మీదకు తెచ్చాడు. మనువులు ప్రజాపతులు దేవతలు మహర్షులు ఆయనను ప్రార్థించారు.


వరాహస్వామి కోపం తగ్గి ప్రసన్నం అయ్యాడు. వారు ఆయన్ని ఓ వరం కోరారు. ''ఓయీ! విష్ణుమూర్తి! నీవు లోకకళ్యాణం కోసం భూమిని సముద్రం మీదకు తెచ్చావు. ఇది ఎప్పటికి ఇలాగే ఉండేలా వరమివ్వు. ఇంకెప్పుడు సముద్రుడు చెలియల కట్టలు దాటి భూమి మీదకు రాకుండా శాసించు. ఆ విధంగా జరిగితే మానవులు నివసించగలుగుతారు. భూమి మనుషులకు ఆధారంగా ఉండేలాగ వరమివ్వు'' అని వారు ప్రార్థించారు.

స్వామి మానవులకు భూమి నివాసయోగ్యం అవుతుందని అనుగ్రహించాడు. భూమిపై పంటలు పండాలని ప్రజలందరు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశీర్వదించాడు. ఆయన ఆశీస్సులు విని భూమి తల్లి పులకించింది. యక్ష గాంధర్వ దేవగణాలు వరాహమూర్తి ఘనతను పొగిడాయి. వారు వేదాలతో ఆయనను పూజించారు. భూమిపై సృష్టి ప్రారంభమైంది. నవజీవనం సాగింది. ఈ యజ్ఞ వరాహస్వామి కథను చదివినా, వినినా, వ్రాసినా ఆపదలన్నీ తొలిగి శుభాలు జరుగుతాయని పెద్దలు చెప్పారు.

ద్వార పాలకులు

ఎన్నో యుగాల నాటి కథ ఇది. నారాయణుడు ఆదిలక్ష్మి పాలసముద్రంలో ఉన్నారు. వారి మనసులు ఉల్లాసంగా ఉన్నాయి.

శ్రీలక్ష్మి స్వామికి ఏకాంతసేవలందిస్తోంది. ఆ సమయంలో సింహద్వారం దగ్గర ఇద్దరు ద్వారపాలకులు ఉన్నారు. వారు లక్ష్మీనారాయణుల ఏకాంతానికి భంగం వాటిల్లకుండా కాపలా కాస్తున్నారు. ఆ ఇద్దరు ఆది దంపతులకు ఎంతో ప్రేమపాత్రులు. వారికి కూడా విష్ణుమూర్తి అన్నా, లక్ష్మీ దేవి అన్నా ఎంతో భక్తి. ఒక్క క్షణం కూడా వారు ఆ దంపతుల సేవను విడిచి వుండలేరు. స్వామి సన్నిధిలోనే ఉండాలని కోరుకుంటారు. అలాంటి సమయంలో మహాపురుషులైన సనకసనందనాదులు విష్ణుమూర్తిని చూడాలని వైకుంఠానికి వచ్చారు.



కాని ద్వారపాలకులుగా ఉన్న జయ విజయులు అనుమతి లేనిదే లోనికి వెళ్ళకూడదు.

విష్ణుమూర్తి లక్ష్మీదేవితో ఏకాంతంగా ఉన్నారు. కాబట్టి జయవిజయులు మునులను లోనికి వెళ్ళేందుకు అనుమతించలేదు. వారికి కోపం వచ్చింది. ''మీరు ఈ వైకుంఠానికి ఆ లక్ష్మీనారాయణులకు దూరమైపోదురుగాక'' అని శపించారు. ఈ శాపాన్ని భరించలేని జయ విజయులు విష్ణుమూర్తికి చెప్పుకున్నారు. తమ శోకాన్ని వెళ్ళబోసుకున్నారు. దేవదేవుడు వారి మీద దయ కలిగి శాపవిమోచన చెప్పాడు.

''ద్వారపాలకులారా! మునులు శక్తివంతులు, వారి మాటలు వృధా కావు. వారిచ్చినది శాపమే అయినా దానిలో ఒక లోక కళ్యాణకారకం వుంది. నేను మిమ్ములను ఒక ప్రశ్న అడుగుతాను సరిగా ఆలోచించుకొని సమాధానం చెప్పండి. మిత్రులుగా మసలుకొని ఆరు జన్మలలో నన్ను చేరటం ఒక పద్ధతి.

శత్రువులుగా ఉండి నాతో యుద్ధం చేసి మరణించిన తరువాత మూడు జన్మలలో నన్ను చేరు కొనడం మరో పద్ధతి. ఈ రెంటిలో మీరు ఏది కావాలో నిర్ణయించుకొనండి జయ విజయులు విష్ణుమూర్తికి ఇలా విన్నవించారు.

''దేవదేవా! ఆరుజన్మల కాలం ఎడబాటు మేము భరించలేము. మూడు జన్మలలో శత్రువులుగా ఉండైనా సరే నిన్ను చేరుకోవాలి. ఈ వరం మాకు ప్రసాదించు'' విష్ణుమూర్తి ''అలాగే! ఆ సమయం వచ్చినప్పుడు మీరు రాక్షసులుగా పుడతారు. నాతో వైరం తెచ్చుకొంటారు. నేను భూమి మీద అవతరించి మీకు ముక్తిని ఇస్తాను'' అని ఓదార్చాడు.


దాంతో ద్వారపాలకులు శాప విమోచనకు సులభమైన మార్గం దొరికింది. వారు సంతోషంగా వెళ్ళిపోయారు. ఆ తరువాత దక్షుడు జన్మించాడు.

దైవ విరోధం

దక్షుడు ఒక ప్రజాపతి. అతనికి దితి అను ఒక కుమార్తె కలదు. ఆమెను కశ్యపుడు అనే మహర్షికి ఇచ్చి పెళ్ళి చేసాడు. కాని కశ్యపునికి సంతానం లేదు.

మిగిలిన దక్షుని కుమార్తెలందరికీ పిల్లలు కలిగారు. ఆ లోటును దితి భరింతరానిదిగా భావించింది. తాను తల్లిని కాలేదని ఎంతగానో దిగులు పడింది. భర్త అయిన కశ్యపుడు యజ్ఞం చేస్తున్నాడు! ఆ దీక్షలో ఉండగా అతని దగ్గరకు వెళ్ళి నాకు పుత్ర భిక్ష పెట్టమని ప్రార్థించింది. భార్య కోరిక విని కశ్యప ప్రజాపతి ఆకాశం వంక చూశాడు.

మనోహరి! ఇది సూర్యుడు అస్తమించే సంధ్యాసమయం. ఈ సమయంలో భార్యాభర్తలు దాంపత్యక్రియ చేయకూడదు. పైగా నేను యజ్ఞదీక్ష లో వున్నాను. ఈ సమయంలో ఈ కోరిక తగదు అని భార్యకు చెప్పాడు. అయినా దితి భర్త మాటలను వినలేదు. దాంపత్య ధర్మాన్ని అనుసరించి భార్య కోరినప్పుడు భర్త ఆమెకు



సుఖాన్ని ప్రసాదించాలి. కశ్యప ప్రజాపతి ఆ పని చేశాడు. అసుర సంధ్య వేళలో భర్తతో కలిసిన దితి వెంటనే గర్భవతి అయినది. సదాచారాలకు దైవధర్మాలకు వ్యతిరేకమైన గర్భం అది.

కశ్యపుడు ''సుందరీ! నీకు అసుర సంధ్య వేళలో కలిగిన ఈ గర్భం వలన ఇద్దరు దుర్మార్గులైన పిల్లలు పుడతారు'' అని చెప్పాడు. దితి తపస్సు చేసిన శక్తిమంతురాలు. తన తపోమహిమ చేత ఆమె ఆ గర్భాన్ని నూరు సంవత్సరాలు మోసింది. ఆ సమయంలో తన కుమారులు బలవంతులుగా రూపొందడానికి కావలసిన ప్రయత్నాలు అన్నీ చేసిందామె. తపశ్శక్తి కలిగిన స్త్రీ అవడం చేత తన కోర్కెను నెరవేర్చుకున్నది.

ఆమెకు ఇద్దరు బిడ్డలు కలిగారు. వారికి సూర్యచంద్రులంతటి తేజస్సు కలిగింది. అష్ట దిక్పాలకులు అంతటి బలమొచ్చింది. ఇంద్రుడు మొదలైన దేవతల బలం, పరాక్రమం వారిలో చేరాయి. శిశువులు పుట్టడానికి ముందే అవకాశం కోసం ఎదురు చూస్తున్న జయ

విజయులు ఆమె గర్భంలోకి ప్రవేశించారు. ఇద్దరు శిశువులకు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు అనే పేర్లు పెట్టారు. ఆ పుట్టిన వేళ ఎటువంటిదో కాని చాలా అపశకునాలు కన్పించాయి. సముద్రాలు ఘోష పెట్టాయి. దశదిశలు వివర్ణం అయినాయి.

ఆకాశం నుండి చుక్కలు రాలి పడ్డాయి. గాడిదలు ఓండ్ర పెట్టాయి. నక్కలు ఊళలు వేసాయి. దితి శిశువులిద్దరిని భర్త పాదాల మీద ఉంచింది. ''స్వామి! మన బిడ్డలను ఆశీర్వదించండి. వీరికి ఉత్తమ గతులు కలిగేలా వరమివ్వండి'' అని వేడుకుంది. ఆమె మొర విని కశ్యప ప్రజాపతి కరిగిపోయాడు. వెంటనే భార్యతో ఇలా అన్నాడు. ''అసుర సంధ్యలో దంపతులు ఏకం కారాదని నేను చెప్తే నీవు వినలేదు. ఆ కారణంగా పుట్టిన ఈ బిడ్డలు దేవతలను బ్రాహ్మణులను మంచి వారిని యజ్ఞాలు చేయు మునులను ద్వేషిస్తారు. వారికి అపకారం చేస్తారు. బలవంతులు కనుక మరింత పెచ్చుమీరి సాక్షాత్తు శ్రీ మహావిష్ణువుకే శత్రువులు అవుతారు.

చివరకు ఆ వైకుంఠ వాసుని చేతిలో మరణించి వైకుంఠం చేరుకుంటారు. ఈ మాటలు దితికి దుఃఖాన్ని కలిగించాయి. శక్తివంతులు కాగలరన్న విషయం సంతోషాన్ని కలిగించింది. హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు శక్తివంతులుగా ఎదిగారుడ. అయితే వారికి తండ్రి చెప్పిన విధంగా మునుల మీద దైవజనుల మీద ద్వేషం ఏర్పడినది. ఆ ఇద్దరిలో ఒకడైన హిరణ్యాక్షుడు భూమిని కాపాడే సమయంలో యజ్ఞ వరాహమూర్తిని ఎదురించి ఆయనచేతిలో చనిపోయాడు. ఇక మిగిలి వున్నవాడు హిరణ్యకశిపుడు.

శత్రుశేషం

అన్నగారు చనిపోయిన తరువాత దైవనిందా దైవ ద్వేషం తమ్మునిలో మరింత పెరిగాయి. దానికి ఫలితం అతడు అనుభవించి తీరాలి. అతడు కూడా వైకుంఠవాసుని చేతిలో మరణిస్తే జయవిజుయుల ఒక జన్మ కథ పూర్తి అవుతుంది. కాని హిరణ్యకశిపుడు అనే శత్రు శేషం మిగిలివుంది.

రెండవ జన్మలో రావణ కుంభకర్ణులుగా వారు విష్ణు దేవునికి శత్రువులయ్యారు. మూడవ జన్మలో శిశుపాలుడు, దంతవక్త్రుడుగా పుట్టి శ్రీకృష్ణుని అవతారాన్ని ఎదిరించి మరణించారు.

ఈ మూడు జన్మల తర్వాత జయ విజయులకు శాప విముక్తి కలిగింది. వారు తాము కోరుకున్న విధంగా వైకుంఠం చేరుకున్నారు.

యోగమూర్తి

ఈ భూమిని పాలించిన మనువు కుమారులలో మరువలేని మహనీయులు ఇద్దరున్నారు. వారు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు. మనువుకు ఒక కుమార్తె కూడా వుంది. ఆమె పేరు దేవహూతి అసాధారణ సౌందర్యరాశి. సద్గుణాలు కలిగిన ఆమెను ఎంతో వైభవం కలిగిన రాజుకు యిచ్చి పెండ్లి చేసారు. ఆయన పేరు కర్దముడు.

కర్దముడు కూడా ఒక ప్రజాపతి. బహుసంతానాన్ని సృష్టించిన తరువాత అతడు గొప్ప తపస్సు చేసాడు. విష్ణు భక్తులలో పేరెన్నిక గలవాడు. బ్రహ్మ యిచ్చిన సలహా మేరకు పదివేల సంవత్సరాలు తపస్సు చేసి విష్ణుమూర్తిని ప్రత్యక్షం చేసుకున్నాడు. ''ఓ దేవదేవా నాకు నీ అంతటి గొప్పవాడు పుత్రుడుగా ఉదయించాలి'' అని వరం కోరుకున్నాడు. విష్ణుమూర్తి చిరునవ్వు నవ్వి యిలా చెప్పాడు. ''ఓయీ! శతరూప! స్వాయంభువుల దేవహూతి వల్ల నీకు తొమ్మిది మంది ఆడపిల్లలు పుడతారు. మరీచి వంటి మహనీయులను పెండ్లి చేసు కొంటారు. ఈ ఆడపిల్లలు తొమ్మండుగురు నీ వంశాన్ని చాలా వృద్ధిలోకి నడుపుతారు. యిక నేను నీ వలన దేవహూతి గర్భంలో పుట్టి లోకానికి కళ్యాణం చేస్తాను''

ఆ తరువాత కర్దముడు దేవహూతితో తిరిగి దాంపత్య సుఖాన్ని అనుభ వించాడు. బ్రహ్మ వర్తము అనే దేశానికి వారు వెళ్ళి పోయారు. దానికి రాజధాని 'బర్హిష్మతీ నగరం'



అది వరాహస్వామి భూమిని ఉద్ధరించినప్పుడు ఒక కారణంగా వెలుగులోకి వచ్చిన చోటు హిరణ్యాక్షుని చంపివేసిన తరువాత యజ్ఞ వరాహ స్వామి శరీరాన్ని దులుపుకొన్నారు. కొన్ని రోమాలు రాలిపడి వాటిలోంచి దర్భలు మొలిచాయి.

యజ్ఞయాగాలు చేసుకొనే ఋషులు ఆదర్భలను తీసుకొన్నారు. అందువల్ల ఆ నగరానికి బర్హిష్మతీ నగరం అనే పేరు వచ్చింది. భార్య కోరికను మన్నించి కర్దముడు బ్రహ్మావర్త దేశాన్ని ఎంతో చక్కగా పరిపాలించాడు. అతడు పదివేల సంవత్సరాలు తపస్సు చేసిన మహానుభావుడు. ఆ శక్తితో అద్భుతమైన ఒక విమానాన్ని సృష్టించుకున్నాడు.

దంపతులు దానిలో సంతోషంగా విహరించారు. దేవహూతి తృప్తిని పొందలేదు. ఆమెను సరస్వతీ నది ఒడ్డుకు విమానంలో తీసుకువెళ్లి కొంతసేపు విహరించాడు. ఆ తీరంలోనే బిందు సరోవరం అనే సరస్సు వుంది. దానిలో స్నానం చేయమని కర్దముడు దేవహూతిని కోరాడు. ఆమె అలా చేసింది.

వెంటనే ఒక దివ్యమైన భవనం వారి ముందు ప్రత్యక్షమైంది. భర్తకు అంతటి యోగశక్తి వున్న విషయం తెలుసుకొని దేవహూతి ఆశ్చర్యపడింది. ఆ భవనంలో వుంటూ విమానంలో విహరిస్తూ భూమి అంతా తమదిగా వారు క్రీడించారు.

దేవహూతికి ఒకే కాన్పులో వరాన్ని అనుసరించి, తొమ్మిది మంది ఆడపిల్లలు పుట్టారు. వెనువెంటనే కర్దముడు సన్యాసం తీసుకొని అడవులకు వెళ్ళిపోతానన్నాడు. కాని భార్య అయిన దేవహూతి అందుకు ఒప్పుకోలేదు. ''మనోహరా! నాకు మీ వలన పుత్ర సంతానం కావాలి'' అని కోరింది. అందుకు కర్దముడు ఒప్పుకొనక తప్పలేదు. ఫలింతగా సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు దేవహూతి గర్భవాసాన ప్రవేశించాడు. అతడే కపిలుడు. మహాతపస్వి.

ప్రపంచానికి జ్ఞాన బోధ చేసి వెలుగు దారులు చూపిన మహనీయుడు. దర్శన శాస్త్రాలు రచించడం కపిలునితోనే ప్రారంభమైనది. కపిలుడు మొట్టమొదటిసారిగా సంఖ్య దర్శనం వ్రాసి, అజ్ఞానులైన మన అందరికీ అందించాడు. కర్దముడు తొమ్మిది మంది ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయగలిగాడు. మరీచి అనే మహర్షికి కళను, అత్రి మహర్షికి అనసూయను, అంగీరస మహర్షికి శ్రద్ధాదేవిని, గతి అనే కుమార్తెను క్రతువు అనే మునికి, క్రియను భృగు మహర్షికి ఖ్యాతిని, వశిష్ఠ మహర్షికి అరుంధతిని, శాలిధన్వునకు శాంతి అనే కన్యను యిచ్చి వివాహాలు జరిపించాడు.

కుమార్తెలు తొమ్మండుగురు తమ భర్తలతో జోడుకట్టి, వారి ఆశ్రమాలకు వెళ్ళి పోయారు. కర్దముడు దేవహూతిని విడిచిపెట్టి వానప్రస్థం వెళ్ళిపోయాడు. కుమారుడైన కపిలుడే ఆ తల్లికి తోడు మిగిలాడు. అతడు సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే. అతడు తల్లికి తత్వశాస్త్రం బోధించాడు. మాతృమూర్తికి గురువు కాగల అదృష్టం ఆ మహనీయునికే దక్కింది.

శత్రుశేషం పనికిరాదు

యిప్పుడు మిగిలి వున్న రాక్షసుడు హిరణ్యకశిపుడు. హిరణ్యాక్షుడు చనిపోయిన తర్వాత అతని తమ్ముడైన హిరణ్యకశిపుడు మహా విష్ణువు మీద పగ సాధించాలని ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఎలాగైనా శ్రీహరిని పరాభవించాలి. అది సులభతరమైన విషయం కాదు కదా! యింతకు ముందు అతనిని ఎదిరించిన వారు ఏ గతిని పొందారో రాక్షసునికి తెలుసు. అలాంటి దుర్గతి తనకు పట్టకుండా వుండాలంటే తగినంత శక్తిని ముందుగా సంపాదించుకోవాలని హిరణ్యకశిపుడు గ్రహించాడు.

శక్తి సాధనకు తపస్సు చేయడం ఒక్కటే మార్గం. తపస్సు చేయాలంటే ఏకాంతం కావాలి. అందుకోసం అతడు మంధర పర్వతంలోని ఒక గుహను ఎన్నుకొన్నాడు. గుహలోపలకు ప్రవేశించి తపస్సు మొదలెట్టాడు.

అసాధారణమైన తపస్సు

తన కోరికలు ఎంత గొప్పవో అంత భీకరమైన తపస్సు అతడు చేయాలి కదా! ఏకాగ్రతను కుదుర్చుకొన్నాడు. అతడు చేసిన లంబికా యోగం అనే దీక్ష సాధారణమైనది కాదు. దాని ప్రభావానికి భూమి కంపించింది. సముద్రాలు చెలియలి కట్టలు దాటి వచ్చాయి. ఆకాశంలోంచి తోకచుక్కలు రాలిపడ్డాయి. అతని చుట్టూ పుట్టలు పెరిగి పాములు బసలు కొట్టాయి. చర్మాన్ని చీరుకొని క్రిమి కీటకాలు అతని రక్తమాంసాలను ఆరగించాయి. శిఖలు పెరిగిపోయి ఊడల్లా వ్రేలాడినాయి. గోళ్ళు పెరిగి పెరిగి భూమిలోనికి చొరబడ్డాయి. అయినా అతడు అదేమి లెక్క చేయకుండా నూరు సంవత్సరాలపాటు తన తపస్సును కొనసాగించాడు. లోకాలు అతలాకుతలమైనాయి. బ్రహ్మదేవుడు అతని దీక్షకు మెచ్చి క్రిందికి దిగి వచ్చాడు.


''హిరణ్యకశిపా! యింత ఘోరమైన తపస్సు ఎందుకు చేసావు?!'' అని ప్రశ్నించాడు.

''వాణీపతీ! నేను ఒక అసాధారణమైన కోరికతోనే అసాధారణమైన తపస్సు చేసాను. నాకు మరణం రాకూడదు. భూమి మీద కాని, అగ్నిలో కాని, గాలిలో కాని, నీటిలో కాని,

ఆకాశంలో కాని, రాత్రి సమయంలో కాని, పగటి సమయంలో కాని నేను మరణించకూడదు. మనుష్యుల వల్ల, జంతువుల వల్ల, ఆయుధాల వల్ల, నన్నెవరూ చంపకూడదు'' అని చాలా విడ్డూరమైన వరాన్ని కోరాడు హిరణ్యకశిపుడు.

బ్రహ్మ ఆ వరాన్ని అతనికి యిచ్చాడు. తన లోకం వెళ్ళిపోయాడు.

వరబలంతో రాక్షసుడు లోకాల మీద విరుచుకు పడ్డాడు. దేవతలను, గంధర్వులను, కిన్నెరలను, యక్షులను, కింపురుషులను, నానా కష్టాలపాలు చేసాడు. ఎక్కడైనా విష్ణువు పేరు వినిపిస్తే, అది పలికిన వారిని పట్టి పీడించాడు.



యాగాలను ఆగం చేసాడు.

అతనిని ఎదిరించగల వారెవరు లేరు. యీ బాధలు భరించలేక దేవతలు, మునులు, మనుష్యులు, విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళి మొరపెట్టారు. విష్ణుమూర్తి ''సమయం వచ్చినప్పుడు నేను ఆ రాక్షసుని వధిస్తాను'' అని వాగ్దానం చేసాడు. అటువంటి శుభముహూర్తం కోసం అంతా ఎదురు తెన్నులు చూస్తున్నారు.

ఓం నమో: నారాయణాయః

అంతటి క్రూరుడైన రాక్షసునికి ఒక కుమారుడు వున్నాడు. పేరు ప్రహ్లాదుడు. విష్ణుభక్తుడు, హరినామం జపిస్తూ వుండేవాడు. తండ్రికి ఆ పేరు పడదు. కొడుకు ఆలోచనలు నారాయణుని మీద నుంచి మరలించాలని అతనిని గురువుల దగ్గరకు పంపించాడు. ఓం నమో: నారాయణాయః అని అష్టాక్షరి పలుకుతూ సాటి విద్యార్థులను విష్ణుభక్తి వైపు మరలించడం మొదలుపెట్టాడు. ప్రహ్లాదుడు చదువులలో వెనుక పడలేదు. గురువులు యీ విషయాన్ని తండ్రి అయిన హిరణ్యకశిపునికి చెప్పారు. తండ్రి కుమారిని తన దగ్గరకు పిలిపించుకొన్నాడు. మంచిగా చెప్పి మార్చాలని ప్రయత్నించాడు. ప్రహ్లాదుడు మారలేదు. తన పట్టుదల విడిచిపెట్టలేదు. హరినామం వదలలేదు.

తండ్రి మంచి మాటలు ఫలించలేదని కొడుకును భయపెట్టాడు. హింసించాడు. ఏనుగుల చేత త్రొక్కించాడు. ఆ సమయంలో ప్రహ్లాదుడు పిలువగా విష్ణుమూర్తి వైకుంఠం నుండి దిగివచ్చి రక్షించాడు. హిరణ్యకశిపుడు పట్టుదలను విడిచిపెట్టకుండా కొండల మీద నుంచి క్రిందికి త్రోయించాడు. మంటలలో పెట్టి కాల్పించాలని, ప్రయత్నించగా విష్ణుమూర్తి ఆజ్ఞ ప్రకారం అగ్ని దేవుడు మంచు ముద్దలా అయిపోయాడు.

హిరణ్యకశిపుడు పాముల చేత కరిపించాలని ప్రయత్నించాడు. ప్రహ్లాదుని విష్ణుగానం విని బుసగొట్టే నాగులు తలలూపించి తప్పుకున్నాయి. యీ సంఘటనల తర్వాత రాక్షసుని కోపం మరింత అయ్యింది.

బాలకుని పిలిచి ''ఓరి మూర్ఖుడా! నీవు చెప్పే ఆ శ్రీ విష్ణువు ఎక్కడున్నాడు. అతడు నా ముందుకు రాగలడా?! ప్రహ్లాదుడు యిలా బదులు చెప్పాడు.

''తండ్రీ! దేవదేవుడు లేని చోటు లేదు. యిక్కడ వున్నాడు. అక్కడ లేడు అని చెప్పేందుకు వీలు కాదు. కేశవుడు అన్ని చోట్ల నిండి వున్న సర్వాంతర్యామి. కావాలని కోరుకొన్న వారికి, ఎక్కడ వెదికి చూస్తే అక్కడే కనిపిస్తాడు. తండ్రీ! నీవు కోరిన పక్షంలో ఏ అణువులో అయినా నారాయణమూర్తిని చూపించగలను'' అందుకు హిరణ్యకశిపుడు వికటాట్టహాసం చేసాడు. తనయుని అమాయకత్వానికి బాధపడ్డాడు.

శ్రీపతి సింహగర్జన

''ఓరి అతడు అణువు అణువున వ్యాపించి యున్నాడా?! మరి నాకు కనిపించదేమి?! ఓహో! బలవంతులంటే భయమా నీ శ్రీహరికి?!''


''కాదు తండ్రీ! నీవు చూడగలవు''

''చూడగలనా! ఎక్కడ?! యీ స్తంభంలో వున్నాడా నీ శ్రీ హరి?!''

''వున్నాడు తండ్రీ! శ్రీహరి అందున్నాడు'' ''వుంటే బయటకు రమ్మను'' అంటూ హిరణ్యకశిపుడు చేతిలోని గదతో ఆ ఉక్కు స్తంభాన్ని బ్రద్దలు కొట్టాడు. అప్పుడు ప్రహ్లాదుడు ''ఓం నమోః నారాయణాయః దేవదేవ! అజ్ఞాని అయిన నా తండ్రికి దర్శనమివ్వు అని ప్రార్థించాడు.

పెళాపెళార్భాటాలు వినిపించాయి.

ఆకాశంలో మేఘాలు గర్జించాయి



సప్త సముద్రాలు హోరెత్తించాయి
సింహనాదం చెవులను బ్రద్దలు కొట్టింది.
ఉక్కుస్తంభం రెండుగా చీలింది.
అది అసుర సంధ్య
లోక బాంధువుడు అస్తమించిన తరుణ ముహూర్తం
చీకటులు క్రమ్ముకుంటున్న వేళ
రెండుగా అయిన ఉక్కుస్తంభం చీలికల మధ్య దివ్య మంగళ రూపం కనిపించింది.
అతడే నారసింహదేవుడు
దివ్యమైన తేజస్సు రూపుదాల్చినట్లున్నాడు.
శరీరం మానవ ఆకారం
తల సింహపు తల
భయంకరమైన జూలు

శ్రీ నారసింహుని శరీరం మీది రోమాలు ఆకాశంలో మబ్బుల చాటు మెరుపుల్లా వున్నాయి. వజ్రాయుధం లాంటి గోళ్ళు. యమదూతల వంటి కోరలు. కోపం రూపెత్తిన స్వామి రూపం చూచి హిరణ్యకశిపుడు నిర్ఘాంత పడిపోయాడు. తప్పించుకోవాలని ప్రయత్నించాడు. విశ్వమంతా, అణువు అణువున నిండి వున్న ఆ స్వామి నుంచి ఎలా తప్పుకోగలడు? ఉగ్ర నరసింహుడు రాక్షసుని పట్టుకొన్నాడు. ఆకాశంలోనూ, భూమి మీద చావురాని వరం కోరిన వాడు.

అందువలన ద్వారం దగ్గరకు లాక్కుపోయి గడపపై కూర్చున్నాడు నృసింహస్వామి.

హిరణ్యకశిపుని తొడలమీద వుంచుకొన్నాడు. రాక్షసుడు స్వామి తొడలమీద గిల గిలా తన్నుకొంటున్నాడు. వాడి గోళ్ళతో అతని కడుపు చీల్చి ప్రేగులను పైకి లాగాడు. వాటిని మెడలో దండలుగా ధరించాడు స్వామి. అసురుని ఉసురులు చల్లారాయి. అతడు కోరుకున్న విధంగానే ఒక విడ్డూరపు మరణం దక్కింది.

అది రాత్రి పగలు కాని సాయంత్ర సంధ్య. నారసింహుడు మనిషి కాదు. మృగము కాదు. రెండు తనలో యిముడ్చుకొన్న అపురూప అవతారం. అతడు ఆయుధాలతో మరణించరాదని

వరం పొందాడు. నరసింహ దేవుని గోళ్ళు అస్త్రాలు కావు. శస్త్రాలు కావు. ఆయుధాలు అసలు కానే కావు. ప్రహ్లాదుడు కోపంతో వున్న నరసింహ దేవునికి స్తోత్రాలు చదివి శాంత పరిచాడు. దేవతలు విరిజల్లు కురిపించారు.

ఆ తరువాత అందరినీ ఆశీర్వదించి స్వామి అంతర్ధానం అయ్యారు. తండ్రి తర్వాత ప్రహ్లాదుడే రాజ్యం చేసాడు. కాని తండ్రిలా కాదు. భక్తుడిగా ప్రజలకు అనురక్తుడుగా పాలించాడు.

ఈ కథ విన్న వారికి పనులలో అడ్డంకులు ఏవైనా వుంటే అవి తొలిగిపోతాయట.

గజేంద్ర మోక్షకథ

మొదటి మనువు స్వాయంభువుడు

రెండవ మనువు స్వరోచిషుడు

మూడవ మనువు ఉత్తముడు

నాల్గవ మనువు తామసుడు

అయిదవ మనువు రైవతుడు

ఆరవ మనువు చాక్షుషుడు

తామసుడు అనగా నాల్గవ మనువు కాలంలో విష్ణుమూర్తి హరిణీదేవి కడుపున పుట్టాడు. అదంతా పాల సముద్రంలోని ఒకదీవి. ఆ దీవిలో పర్వతాలున్నాయి. దానిని ఆశ్రయించుకొని చెట్లు, తీగలు, దట్టంగా పెరిగినాయి. చిక్కగా పెరిగిన అడవి కావటం నుంచి అక్కడ ఎన్నో జంతువులు నివాస ముంటున్నాయి. వరుణదేవునికి ఒక ఉద్యానవనం వుంది. దానిలో అందమైన పూలమొక్కలు ఫలవృక్షాలు అసంఖ్యాకంగా వున్నాయి. ఆ ఉద్యానవనంలోనే ఒక ఏనుగుల సమూహం వుంది. దానికి ఒక రాజు ఉన్నాడు. అతడు చాలా బలవంతుడు, పేరు గజేంద్రుడు. అతని నాయకత్వము తిరుగులేనిది. ఆరు లక్షల ఆడ ఏనుగులు అతనికి భార్యలుగా వుంటున్నాయి.

అంతటి వైభవం కలిగిన మగరాయుడు ఆ ఏనుగుల రాజు, కాలు కదిపితె, సహచరులు సేవలు అందిస్తుంటారు. పరివారంతో ఆ ఏనుగు రాజు వన విహారం చేయటం చూచేందుకు రెండు కళ్ళు చాలవు. ఆ మిడిసిపాటు, ఆ వైభోగం, వర్ణించేందుకు యింతా, అంతా కాదు.

గజరాజు వెడుతూ వుంటే ఒక పర్వతం కదిలినట్లు ఉంటుంది. ఒకనాడు అది తన స్త్రీ పరివారంతో అంటే ఆరులక్షల ఆడ ఏనుగులతో కలిసి ఒక చెరువులో జలకాలాడటం మొదలెట్టింది. నీటిని పీల్చటం జలయంత్రం లోంచి చిమ్మినట్లు తన ప్రియురాళ్ళమీదికి నీటి తుంపరలు వెదజల్లడం చేస్తోంది. తామర తూడులు ఆ చెరువులో ఎన్నెన్నీ వున్నాయో, వాటినన్నింటిని పెకలించి పోగులు పెట్టేశాయి.

విధి బలమైనది కదా!

ఆ వైభవం, ఆ సయ్యాటలు హఠాత్తుగా ఆగాయి. గజరాజు కాలును బలంగా పట్టుకొన్నట్లు అనిపించింది. మహాబలశాలి అయిన తన జోలికి రాగల గుండె దిటువు ఎవరికుంటుంది?!

అనుమానంగా కాలు కదిలించాలని ప్రయత్నించింది. అప్పుడు అర్థమైంది గజరాజుకి తన కాలును మొసలి పట్టుకొందని! కాలును బలవంతంగా బయటకు లాగాలని ప్రయత్నించింది. పెనుగులాడింది. శక్తి వున్నంత వరకు పోరాడింది. కాని ప్రయోజనం కన్పించలేదు. మొసలి రవంత అయినా పట్టు సడలించలేదు. క్రమంగా ఏనుగు బలం తగ్గిపోతుంది.

అది నీటి పట్టు కాబట్టి మొసలి బలం పెరిగింది. తన మగని అవస్థను చూచి, జాలిపడినాయి. కాని గజరాజుకే అలివికాని ఆ మొసలి పట్టు ఆడేనుగులు ఎలా విడిపించగలవు?! దిక్కు తోచక గజరాజు భార్యలు గట్టెక్కి వెళ్ళిపోయాయి. ఎంతకాలం పెనుగులాడినా ఏనుగు ఆ పట్టు నుంచి బయట పడలేదు. క్రమంగా దానిబలం తగ్గిపోయింది. శరీరం సన్నగిల్లింది.

అంత బలవంతుడు అయిన గజరాజు నిర్వీర్యమైపోయాడు. తనకిక శక్తి చాలదని విముక్తి లేదని అర్థమైన తర్వాత గజరాజుకు దిక్కు తోచలేదు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు. తొండం పైకెత్తి, కనులు ఆకాశంలో గుచ్చి, దైవాన్ని తోడు పిలిచి ప్రార్థించాడు.

''ఓయి! దేవదేవ! నేను ఎంతో బలశాలిని! నా బలం నన్ను కాపాడుతుందని ఎంతో కాలంగా నమ్ముతున్నాను. ఆ నమ్మకం యిప్పుడు వృథా అయింది. నా బలగం నన్ను రక్షిస్తారని ఆశపెట్టుకొన్నాను. యింతకాలం నాతో కలిసి జీవించిన ఆరు లక్షల అర్ధాంగులు తోకముడిచి గట్టెక్కి పారిపోయాయి.

కనుక యిక యిప్పుడు నాకు ఎవరు దిక్కులేరు. నేను పూర్తిగా నిన్నే నమ్ముకున్నాను. నన్ను కాపాడినా, కష్టాల పాలు చేసినా నీదే భారం. నీవే నా రక్షకుడవు! నీవు తప్ప మరే దిక్కు లేదు నాకు. అందువలన పూర్తి అహంకారాన్ని విడిచి పాదాక్రాంతుడనవుతున్నాను. నన్ను రక్షించు'' అని భగవంతుని శరణుకోరాడు. దయామూర్తి అయిన భగవంతుడు అతడి మొర ఆలకించాడు. శ్రీ మహా విష్ణువు వైకుంఠ నగరంలో తన కోటలో ఒక మారు మూల సౌధంలో ఆదమరిచి వున్నాడు. గజేంద్రుని ''శరణాపత్తి'' వినగానే ఆయన హృదయం ద్రవించి వున్న పాటున లేచి వచ్చి చక్రాయుధాన్ని ప్రయోగించాడు. అది కాంతులు చిమ్ముకుంటూ వచ్చి మొసలితలను నరికి వేసింది. భగవంతుని శరణుకోరిన గజేంద్రుని కాలు బయటపడింది.

గజేంద్ర మోక్షం జరిగింది!

వెంటనే ఏనుగు రాజు ఒడ్డుకు వచ్చి, విష్ణుమూర్తికి నమస్కరించి, ప్రార్థన చేసి, సరస్సులోని తామరపువ్వులు త్రుంచి స్వామికి అర్పించుకొన్నాడు. శ్రీ మహావిష్ణువు మొసలికి కూడా మోక్షం ప్రసాదించాడు.

గజరాజును ఆపదనుంచి కాపాడిన ఈ కథ చెప్పిన వారికి, విన్నవారికి, వ్రాసిన వారికి శత్రువుల భయం తొలిగిపోతుంది.

తులసి మాల

యింద్రుడు దేవలోకాన్ని పరిపాలించే నాయకుడు.


ఆయన ఒకనాడు తన వాహనం అయిన ఐరావతం మీద ఎక్కి లోకాలన్నీ తిరుగుతున్నాడు. దుర్వాస మహాముని కోపానికి పెట్టింది పేరు. ఆ సమయంలో దుర్వాసుడు వైకుంఠంలో శ్రీ మహా విష్ణువుని సందర్శించి తిరిగి వస్తూ దేవ గణాల నాయకుడైన శచీపతిని చూసాడు. యింద్రుని ముఖంలో గర్వం తొణికిసలాడుతోంది. అది పసిగట్టి ముని ఒక తులసి మాలను అతనికి బహూకరించాడు. అయితే ఇంద్రుడు నిర్లక్ష్యంగా దాన్ని తాను ఎక్కి వచ్చిన గజరాజుకు అందించాడు.

ఐరావతం తులసి మాలను క్రింద పడవేసి, కాళ్ళతో త్రొక్కింది. పవిత్రమైన తులసి మాల చెదిరిపోయింది. అది చూచి దుర్వాసుడు కోపగించుకున్నాడు. యింద్రునికి యింత అహంకారమా!! మూడు లోకాలు పాలించే గర్వమా యిది!! అని మండి పడ్డాడు. ''ఓయీ దేవేంద్రా! అధికార దర్పంతో నీ కళ్ళు మూసుకొన్నాయి. యీ తులసి మాల ఏంటను కున్నావు.

యిది విష్ణుమూర్తి వరప్రసాదం కదా! దానిని వుంచవలసిన చోటు శిరస్సు. అలాకాక ఆ పవిత్ర మాలను నేలమీద పడవేసి, ఏనుగు చేత త్రొక్కించావు. దీని ఫలితమేమిటో తెలుసా నీకు?! ఏ అహంకారంతో యీ పని చేసావో, ఆ అహంకారం నశించుగాక! ఏ అధికార దర్పంతో యీ పాపం చేసావో, ఆ రాజ్యాధికారం నిన్ను విడిచి పెట్టి పోవుగాక! నీ దేవరాజ్యం రాక్షసుల వశమై మీరంతా కష్టాలు పడుదురు గాక!'' అని శపించాడు. శాపం యివ్వడం పూర్తి అయిన తర్వాత దుర్వాసుడు తన దారిన వెళ్ళిపోయాడు.

శాపకారణంగా దేవతల శక్తి నశించడం మొదలు అయ్యింది. మొదటిసారి బలి చక్రవర్తి తన రాక్షస రాజ్యాన్ని పెంచటానికి దేవతల మీద యుద్ధం చేసి జయించాడు. ఇంద్రుని అధికారం అంతరించి, తేజస్సుని కోల్పోయాడు. దేవతలకే కాక, మునులకి కూడా బాధ కలిగింది. అసురులు అన్ని విధాల సుఖంగా వున్నారు. ఆనందం వారిదే అయ్యింది. పరిస్థితులు మారాయి. కనుక ఇంద్రుడు చేయగలిగినదేమియు లేక తన పరివారంతో వైకుంఠం వెళ్ళాడు. మహావిష్ణువు వారికి దర్శనమిచ్చి యిలా చెప్పాడు.

''సముద్రాన్ని మదిస్తే అమృతం వస్తుంది. ఆ అమృతాన్ని త్రాగితే అమరత్వం కలుగుతుంది. రాక్షసులను జయించటానికి యిదొక్కటే మార్గం'' యీ సలహా విని దేవతలు సాగరాన్ని చిలికి అమృతాన్ని త్రాగాలనే ఉబలాటంతో తిరిగి వచ్చారు.



పాల సముద్రం

యిపుడు దేవతల రాజ్యాలు లేవు. మానవ లోకంలో రాజుల రాజ్యాలు లేవు. మూడు లోకాలలో వున్నవి అన్నీ రాక్షస రాజ్యాలే! వారి అనుమతి లేకుండా చీమ చిటుక్కుమనేందుకు వీలుకాదు. దేవతలు అసురులతో అవసరమైన రాయభారం అంతా సాగించారు. అమృతం దక్కితే చాలునని, అమరత్వం సాధించ వచ్చునని రాక్షసులు దేవతలు యొక్క రాయభారాన్ని ఒప్పుకొన్నారు. సముద్రం చిలికేందుకు అంతా సిద్ధమైంది. చిలికే కవ్వంగా మంధర గిరి పర్వతాన్ని త్రవ్వి దేవతలు, రాక్షసులు తలల మీద పెట్టుకొని మోసుకు వచ్చారు.

మంధర గిరిని కవ్వంగా మలిచి, సముద్రంలోకి దింపారు.


పాములలో కెల్లా పొడవుగా వుంటే వాసుకిని కవ్వానికి చుట్టారు. దేవతలు పాము శిరస్సు వైపు వుంటామని అన్నారు. కాని అధికారం ఉంది కాబట్టి మేమే శిరస్సు వైపు వుండాలని రాక్షసులు అమాయకంగా పట్టుపట్టారు. విషాన్ని చిలికే నాగపడగ వారి వంతు అయ్యింది. ప్రయాసం లేని రెండవ భాగాన్ని దేవతలు పుచ్చుకొన్నారు. చిలకటం ప్రారంభించే ముందుగానే వాసుకి వెదజల్లిన విష బిందువులు సోకి కొందరు రాక్షసులు చనిపోయారు. అయినా పట్టుదల విడిచిపెట్టలేదు.

పాల సముద్రాన్ని చిలకటం ప్రారంభమైంది.

మహాకూర్మం

పర్వతంతో సముద్రాన్ని చిలుకుతున్నప్పుడు, ప్రళయంతో సమానమైన అలజడి రేగింది. ఆ శబ్దం దేవతలకు శుభంగానూ, రాక్షసులకు అశుభంగానూ
వినిపిస్తోంది. అంతేకాదు! అడుగున ఆధారం లేకపోవడంతో చిలికే కవ్వం నెమ్మదిగా సముద్రం అట్టడుగుకు జారిపోతున్నది. యీ సమస్యకు సమాధానం తెలియక దేవతలు విష్ణువును ప్రార్థించారు.

ఆయన (కూర్మం) తాబేలుగా అవతరించి పర్వతం క్రిందికి దూరి దానిని నిలబెట్టాడు. యిప్పుడు సముద్ర మథనం చక్కగా సాగింది. మొదటిసారి సముద్రంలోంచి అనేక విచిత్ర వస్తువులతోపాటు రత్నాలు, వెలుపలకు వచ్చినాయి.



ఆ తరువాత అతి భయంకరమైన హాలాహలం పుట్టింది. మహాదేవుడు దానిని తన కంఠంలో యిముడ్చుకొని, నీలకంఠుడు, గరళకంఠుడు అయినాడు.

హాలాహలానికి వెనుక ఐరావతం అనే ఏనుగు, ఉచ్చైశ్రవము అనే గుర్రము కోరిన కోరికలు తీర్చే కల్పవృక్షము, అడిగినదంతా యిచ్చే కామ ధేనువు పుట్టుకొచ్చాయి.

అవన్నీ యింద్రుడికే యిచ్చివేసారు. వాటి వెనుక శ్రీ మహాలక్ష్మి అవతరించింది. ఆమెను శ్రీ మహావిష్ణువు చేపట్టాడు. తరువాత చంద్రుడు, పుట్టాడు. అతనిని నవగ్రహాలలో ఒకడుగా ఆకాశంలో నిలబెట్టారు. వీటన్నింటి వలన అటు రాక్షసులకు కాని, యిటు దేవతలకు కాని తృప్తి కలుగలేదు.

అమృతాన్ని సాధించి తీరాలి కదా!

అతిలోక సుందరి

దేవతలు ఆలోచనాపరులు

దానవులు పట్టుదల కలవారు

ఎవరి రీతిలో వారు ప్రయత్నాలు చేస్తూ పాల సముద్రాన్ని శక్తి మేరకు చిలికారు. అందరూ ఎదురు చూచే అపురూపమైన అద్భుతభాండం, సముద్రంలోంచి వెలుపలకు వచ్చింది. ఒక చుక్క ఆరగిస్తే, మరింక వారికి చావుపుట్టుకల చక్రం ఆగిపోతుంది.

అంతటి మహనీయమైన అమృత కలశాన్ని పుట్టగానే అపహరించుకు పోవాలని రాక్షసులు ప్రయత్నించారు. దేవతలు అడ్డుకొన్నారు. అది ఎవరికి దక్కాలి?! అది సమిష్టిగా చేసిన కృషి ఫలితం!! పైగా అనుక్షణం కీచులాడుకొనే దేవదానవులు సమంగా పంచుకోవలసిన ఆస్తి!! దాయాదుల వైరం తీరనిది! దాన్ని సమంగా పంచటం ఎవరికి సాధ్య పడలేదు. అన్నింటికి ఆ వైకుంఠవాసుడే వున్నాడు. అందరూ ఆయనను దిగి రావలసిందిగా ప్రార్థించారు. శ్రీపతి, పడతిగా అవతరించాడు. ఏమి రూపమది! ఎంత జగన్మోహనమైన సౌందర్యమది! అందమంతా విందు చేసినట్లున్న అపురూప సుకుమారి ఆమె జగన్మోహిని!!!

ఆ రూపు రేఖలు చూచాక కన్నులు మిరుమిట్లు గొలిపినాయి! వారి కళ్ళల్లో మెరుపులు మెరిసాయి. సమ్మోహనం అయిన ఆ దేవి జగన్మోహిని మన వైకుంఠవాసుడే అని దేవతలు తెలుసుకున్నారు. కాని రాక్షసులు ఆ అందాన్ని అందుకోవాలని పరుగులు తీయటం ప్రారంభించారు. ఎవరికి అందిరాని సౌందర్యదేవత ఆమె! వీణ మీద వేదాలు పలికించుతున్న సుమధుర కంఠస్వరంతో యిలా అంది. ''అమృత కలశం అందుకోవాలన్న ఉబలాటమే మీ అందరిదీ! ఎందుకు అంత తొందర?! కలశాన్ని నాకు అందిస్తే అందరికి సమంగా



పంచుతాను. నా మీద విశ్వాసం లేదా?! మీకు లేదా?! మీకు లేదా?! అంటూ దేవతల వంక, దానవుల వంక మార్చి మార్చి మన్మథ బాణాల వంటి చూపులను విసిరింది జగన్మోహిని. రాక్షసులు మోహినీ రూపం తాలూకూ మోహంలో పూర్తిగా మునిగి పోయారు. వారేమీ బదులు యిచ్చారో వారికే గుర్తు తెలియలేదు.

దేవతలు స్వామి లీలను అర్థం చేసుకొన్నారు. కనుక వెంటనే అనుమతి యిచ్చేసారు. అపురూపమైన అమృతకలశాన్ని అందుకొంది జగన్మోహిని. పెదవుల మీద చిరునవ్వు!! కళ్ళలో కవ్వించే చూపులు!! వెన్నెల అంతా పిండి చేసి మలచినట్లున్న రూపంతో అమృతాన్ని పంచటం ప్రారంభించింది.

దేవతలకు అమృత బిందువులు అందిస్తోంది!

దానవులకు చిరునవ్వులు మాత్రమే చిందిస్తోంది!

ఈ కపటాన్ని ఒకే ఒక రాక్షసుడు మాత్రం కనిపెట్టాడు.

అతడు దొంగతనంగా దేవతలలో వున్న సూర్యునికి చంద్రునికి మధ్య చేరాడు. దేవతల వరుసలో అమృత బిందువులను వడ్డించే జగన్మోహిని అతని వంతుగా కూడా అమృతాన్ని వడ్డించింది.



అతడు త్రాగాడు.

గొంతు జారలేదు.

జరిగిన తప్పిదాన్ని గ్రహించింది జగన్మోహిని!

వెంటనే సుదర్శన చక్రాన్ని తలచుకొంది!

చక్రాయుధం రాహువు తలను నరికేసింది!

అమృతం సోకిన తల మాత్రం బ్రతికి వుంది!


మొండెం దబ్బుమని నేలమీద పడిపోయింది!

బ్రహ్మ అతనిని దయ తలచి ఒక గ్రహంగా జీవించమని వరమిచ్చాడు! అయినా తన రాక్షస బుద్ధి మాను కోకుండా అతడు ప్రక్కనున్న సూర్యుడ్ని, చంద్రుడ్ని మింగి వేస్తుంటాడు! యీ రోజుకు గ్రహణం అనే పేరుతో మనం చూచే దృశ్యాలు అవే!! యీ అమృత కలశం కథ వింటే కోరికలు తీరుతాయని విశ్వాసం కలిగిన వారు నమ్ముతుంటారు.

సూర్యవంశం

వైవస్వత మనువు ఏడవ వాడు. వివస్వంతుడు అనే మహర్షికి కుమారుడు.

వామనావ తారం ఈ మనువు కాలంలోనే జరిగింది. సూర్యుడు సౌర కుటుంబానికి రాజు! అతనికి సంధ్య, ఛాయ అనే భార్యలు యిద్దరు వునారు! మూడవ భార్య కూడా ఉనది! ఆమె పేరు బడబానల! సూర్యునికి, సంధ్యాదేవికి, యముడు కుమారుడుగా పుట్టాడు! యిదొక చిత్రమైన కథ! యముడు తనసోదరి అయిన యమితో పెండ్లిచేసుకొనాడు. ఆ దంపతులకు వైవస్వతుడు పుట్టాడు..



సూర్యునికి, ఛాయదేవి వలన సావర్ణి. వరసగా మనువులకు సావర్ణులు జన్మించారు. యీ కథ భవిష్యత్తులో జరగవలసి వుంది. మొత్తం మనువుల సంఖ్య పదునాలుగు, వీరందరూ మహనీయులు, ఆదర్శ పురుషులు.

ఆచార్య శుక్ర దేవుడు

రాక్షసులకు ఎంతటి పరాక్రమం వుందో, అంతటి తెలివి తేటలు లేవు. జగన్మోహిని మాయతో అమృత కలశం అంతా దేవతలకు దక్కింది!

దాంతో వారు తిరిగి పరాక్రమవంతులు అయినారు! రాక్షసుల మీద యుద్ధం చేసి ఓడించే శక్తి కూడా వచ్చింది.

రాక్షసులు పట్టుదల విడిచిపెట్టని వారు కనుక యుద్ధాలు విరామం లేకుండా జరుగుతూనే వునాయి. ఎక్కువ సంఖ్యలో వారు చనిపోతునారు.

యిదంతా రాక్షస గురువు అయిన శుక్రాచార్యుల వారికి బాధ కలిగిస్తోంది. ఆయన దగ్గర మృత సంజీవని, పేరు గల ఒక విద్య వుంది. దానితో చనిపోయిన వారిని బ్రతికించవచ్చు. ఈ విద్య శుక్రాచార్యునికిమహాదేవుడు బోధించాడు. బలి చక్రవర్తి వామనుడి వలన ప్రాణం పోగొట్టుకొనాడు. అయితే శుక్రాచార్యుడు తిరిగి అతనిని బ్రతికించాడు. బలి ఆయన ఆశ్రమంలోనే వుండి, మునులను, ఋషులను పూజించాడు. వారికి అతని మీద దయగలిగింది. (విశ్వ దిగ్యాగము) అనే యాగం బలిచక్రవర్తి చేత వారు చేయించారు. దానికి ఫలితంగా అతనికి ఒక దేవతారథం వచ్చింది. ఎవరూ జయించలేని ఆయుధాలు, కవచాలు, దొరికాయి. ప్రహ్లాదుని కొడుకు విరోచనుడు అతని కుమారుడే బలి. ప్రహ్లాదుడు తన మనుమడైన బలి చక్రవర్తికి ఎనడూ వాడిపోని, వాసన తరిగిపోని పూలమాలని యిచ్చాడు! బలి చక్రవర్తి అనేక శక్తులు సాధించాడు. రాక్షసులు అందరిలాగే దేవలోకం మీదికి వచ్చి యుద్ధం చేసాడు. యింద్రుడు ఓడిపోయాడు. ఓడిపోవడమే కాదు! అమరావతిని విడిచి పారిపోయాడు. మూడులోకాలలో తలదాచుకొనే చోటు లేక విలవిలలాడారు. అమరావతీ నగరం అంటే దేవతల రాజధాని అపురూపమైనది. అది రాక్షస రాజైన బలికి స్వాధీనమైనది. దేవతలకు కష్టాలు మొదలయ్యాయి!

అదితి

దేవతలను ఆదితేయులు అంటారు. కారణం వారు అధితి కుమారులు కావటమే. కశ్యప ప్రజాపతి భార్య యీ అదితి. తన సవతి అయిన దితి కుమారుడు బలిచక్రవర్తి వలన తన బిడ్డలైన దేవతలకు కష్టాలు కలిగినాయి. అది చూచి ఆమె హృదయం ఎంతగానో నొచ్చుకుంది. తల్లి ప్రేమ గాయపడింది. ఈ విషయంలో తనకు దారి చూపగల వారు భర్త ఒకరే అని ఆమెకు తెలుసు. ఆయున దరి చేరి అడిగింది.''స్వామి! నా బిడ్డల కష్టాలు తీర్చుకోవాలని ఆరాటపడింది. ఈ విషయంలో తనకు దారి చూపగల వాడు భర్త ఒక్కరే అని ఆమెకు తెలుసు. ఆయున దరి చేరి అడిగింది. ''స్వామి! నా బిడ్డల కష్టాలు తీర్చరా?!'' అందుకు రవంతసేపు ఆలోచించి కశ్యపుడు సమాధానం యిచ్చాడు!

''ప్రేయసీ! నీ బిడ్డల కష్టాలు, తీర్చగలవాడు దేవదేవుడు అయినా శ్రీ మహావిష్ణువు ఒక్కడే అతనిని ఆరాధించి అనుగ్రహం సంపాదించు!'' భర్త చెప్పిన హిత వచనాలు ఆమెకు నచ్చాయి. విష్ణుమూర్తి ఆరాధన చేయటం మొదలెట్టింది. ఎంతో కాలానికి విష్ణుమూర్తి ఆమె భక్తికి మెచ్చాడు. కశ్యపుని తేజోబిందువులతో విష్ణువు అదితి గర్భంలోకి ప్రవేశించాడు. ప్రసవ సమయం ఆసన్నమయ్యింది.

వటుడు

ప్రకృతి చల్లగా శోభాయమానంగా వుంది. శుభఘడియలు ప్రవేశించాయి. ఆ సమయంలో అదితి గర్భవాసాన శ్రీహరి ఉదయించాడు. ఎన్నో శుభ సూచనలు కన్పించాయి. అతనిది మరుగుజ్జు రూపం. తల్లిదండ్రుల ఒడుగు చేసారు. బలిచక్రవర్తి అప్పటికి మూడు లోకాలు జయించి తిరుగులేని మహాశక్తిగా అవతరించాడు. రాక్షసుడైనా, దానధర్మాలు చేయటంలో బలిచక్రవర్తికి సాటి ఎవరు లేరు.

ఒకసారి బలిచక్రవర్తి ప్రపంచాన్ని జయించిన దానికి గుర్తుగా అశ్వమేధయాగం చేస్తున్నాడు. ఎందరికో దాన ధర్మాలు చేస్తున్నాడు. అడిగినవారికి యిచ్చి పంపటమే కాని, కాదు, లేదు అనే మాటలు నోటి వెంటరావు.

అందుకే వామనుడు సంకోచించకుండా నేరుగా యాగశాలకు వచ్చాడు. అతని ముఖంలో దివ్య కాంతులు వున్నాయి.

బలి ఎదురు వచ్చి, బాలకుడిని యజ్ఞవేదిక దగ్గరకు తీసుకు వెళ్ళాడు. దానధర్మాలు చేయటం అలవాటు కాబట్టి నీకేమి కావాలి?! అని అడిగాడు. ''నాకు కేవలం మూడు అడుగుల స్థలం చాలు! దానం యివ్వగలవా?! అని ప్రశ్నించాడు వామనుడు.

''యింత చిన్న కోరిక ఏమిటి?'' అన్నాడు బలి!

''అది యిస్తే చాలు''! అన్నాడు వటుడు.

''యిచ్చిన మాటను తప్పను! బలివాగ్దానం చేసాడు!

వామన మూర్తికి మూడు అడుగుల నేల దానం చేస్తున్నట్లు ప్రకటించేసాడు!

భూమి - ఆకాశం

వామనుడు దానం పట్టాడు! తనకు కావలసిన, తీసుకోదలచిన మూడు అడుగుల నేల ఎక్కడుందో చూపమని అడిగాడు. నీ యిష్టం వచ్చిన చోటు ఆక్రమించుకోమన్నాడు'' బలి! యీ దానం వెనుక జరుగబోయే అనర్థాన్ని ముందుగా తెలుసుకొన్న ఆచార్య శుక్రదేవుడు అడ్డుకోవాలని ప్రయత్నించాడు. బలి చక్రవర్తి వినకపోతే వటుడికి తన స్థలాన్ని చూపించేందుకు సిద్ధ పడ్డాడు.

యింత వాడు అంతై, అంతంతై భూలోకమంతా నిండిపోయి ఆకాశమంతా ఎదిగిపోయి మూడవ అడుగు పెట్టే చోటే లేకుండా భూమి ఆకాశాలను రెండు అడుగులు నింపేసాడు.


''మూడవ పాదం ఎక్కడ పెట్టను?! అని ప్రశ్నించాడు. ''నా శిరస్సు మీద వుంచు'' అన్నాడు బలి. ఫలితంగానే బలిచక్రవర్తి పాతాళలోకం అణచివేయబడింది.

రసాతలం అతని నిలయం అయ్యింది.

బలి చక్రవర్తి నుంచి దానంగా పుచ్చుకున్న మూడు లోకాలను దేవతలకు అప్పగించాడు విష్ణుమూర్తి.

వామనావతరాం కథను విన్నవారికి మనసులోని కోరికలు అన్నీ తీరుతాయని పెద్దల మాట!

మరో సృష్టి



బ్రహ్మ దేవుడు నిద్రపోతున్నాడు. ఆయన ముఖంలోంచి మూడు వేదాలు పుట్టాయి.

అక్కడ పొంచి కూర్చొన్న ఒక రాక్షసుడు వేదాలను దొంగిలించాడు. అతని పేరు సోమకాసురుడు. ముఖము గుర్రాన్ని పోలివుండటం నించి హయగ్రీవుడు అని కూడ అంటారు. ఆకాలంలోనే విష్ణుమూర్తి భక్తుడైన ఒక రాజు వుండేవాడు. అతని పేరు సత్యవ్రతుడు. ఒక సంధ్యా సమయంలో ఆయన నదీతీరానికి బయలు దేరాడు. నదిలో స్నానం చేసాడు.

దేవునికి అర్ఘ్యమివ్వాలని నదిలోని నీరు చేతిలోనికి తీసుకుంటున్నప్పుడు ఒక చిన్నారి చేప పిల్ల నీటితో పాటుగా చేతిలోకి వచ్చింది. వచ్చి సత్యవ్రతునితో మాట్లాడటం మొదలుపెట్టింది. ''ఓయీ! రాజా! నేను ఎవరు అనుకున్నావు?! నీవు ఆరాధించే దైవాన్ని విష్ణుమూర్తిని, లోక కళ్యాణం కోసం యిలా యీ చేప పిల్ల అవతారం ఎత్తాను.

నన్ను తీసుకు పోయి జాగ్రత్తగా పెంచుకో, రానున్న కాలంలో ప్రళయం వచ్చినప్పుడు నేను, లోకాలను రక్షిస్తాను. అపుడు ఒక పడవ వస్తుంది. నేను ఆ నావ ద్వారా అతి ముఖ్యమైన కొందరు వ్యక్తులను రక్షిస్తాను. మీరు సప్తఋషులను, ధాన్య రాశులను దానిలో వుంచండి!

నావ యొక్క త్రాడును నా ముక్కు మీద కొమ్ముకు కట్టండి. ప్రళయం పూర్తి అయ్యేదాక దానిని సముద్రంలో త్రిప్పుతూ కాపాడతాను'' సత్యవ్రతుడు విష్ణుమూర్తి మాటలు విని, ఆ చేపపిల్లను తీసుకు వెళ్ళి పెద్ద చెరువులో వేసాడు. ఒక్కొక్క చెరువులో వేసినప్పుడు ఆ చెరువు పట్టనంత పెద్దదిగా అయిపోతూ విశ్వరూపంలోకి వచ్చింది.

మహావిష్ణువు చెప్పినట్లు ప్రళయం రానే వచ్చింది. ధాన్యాన్ని సేకరించి సత్యవ్రతుడు నావలో నింపాడు. సప్తఋషులను ఆహ్వానించి పడవలో ఎక్కమని కోరాడు.

ధ్యాన్యాలు, సప్తఋషులు పడవలలోకి చేరిన తర్వాత పెద్ద వర్షం వచ్చింది.

సృష్టి అంతా జలమయంగా అయిపోయింది.

శ్రీ మహా విష్ణువు చేప రూపంలో నావ దగ్గరకు వచ్చాడు. చేప కొమ్ముకు నావను కట్టేశాడు. ఆ నావను కాపాడుకొంటూ చాలా కాలం, చాలా దూరం తిరిగాడు శ్రీ మహావిష్ణువు. ప్రళయం అంతం అయింది. తిరిగి భూమి బయట పడింది.

కొత్త కల్పము ప్రారంభమైంది. పడవలో మిగిలి వున్న ధాన్యము, సప్త ఋషులు ఆధారంగా సృష్టి జరుగుతుంది.

సోమకాసురుడు దొంగిలించిన వేదాలు అతని దగ్గరే వున్నాయి. మత్స్య మూర్తి సృష్టిని రక్షించిన తరువాత ఆ రాక్షసుని వెంటపడ్డాడు. అతన్ని చంపివేశాడు. వేదాలను రక్షించాడు. వాటిని బ్రహ్మ్మవునికి అప్పగించాడు. ఈ మత్స్యావతారం చదివిన వ్రాసిన పోయిన వస్తువులు దొరుకుతాయట. ప్రపంచానికి శుభాలు జరుగుతాయి.

సుదర్శన చక్రం

విష్ణుభక్తులు ఎందరో ఉన్నారు. వారిలో అంబరీషుడు చాలా గొప్పవాడు. ఆయున చక్రవర్తి ప్రపంచాన్ని చక్కగా పాలించాడు. శ్రీ విష్ణువును ఎల్ల వేళలా పూజించాడు.

ఆయున భక్తికి మెచ్చి విష్ణువు తన సుదర్శన చక్రాన్ని ఆయునకు ఇచ్చాడు. సుదర్శన చక్రం శక్తివంతమైనది ఎంతో పవిత్రమైనది. అంబరీషునికి, ఆయున రాజ్యానికి అది రక్షణగా నిలిచింది. కార్తీక మాసంలో ఏకాదశినాడు అంబరీషుడు ఒక వ్రతం చేశాడు.

కోపానికి మారు పేరు అయిన దుర్వాసుడు ఆ సమయంలో అక్కడకు వచ్చాడు. ఏకాదశి వ్రతం పూర్తి అయిన మరునాడు ఆతిథ్యం ఇచ్చేందుకు అంబరీషుడు సిద్ధపడ్డాడు. దుర్వాస




మహాముని సంధ్యా వందనం చేసుకోవటానికి నదికి వెళ్ళాడు. చాలా కాలం గడిచిపోయింది. కాని అతడు తిరిగ రాలేదు.

అతిథి రాకుండా ఆతిథ్యం ఇచ్చేవారు భోజనం చేయకూడదు. ద్వాదశి ఘడియలు వెళ్ళిపోకుండా ఆహారం తీసుకోవాలని నియమం ఉంది. ఈ రెండు పరిస్థితుల మధ్య అంబరీషుడు యిరుకున పడ్డాడు. పురోహితులను పిలిచి సలహా అడిగేడు. వారు ఈ విధంగా చెప్పారు.

''రాజా, ద్వాదశి వెళ్ళి పోకుండా భోజనం చేయాలి ఏకాదశి ఉపవాసం చేసిన వారికి ఇది ఒక నియమం. అలాగని అతిథులు రాకుండా ఆహారం తీసుకోకూడదు. నీరు త్రాగి సరిపెట్టుకో''.

ధర్మవేత్తల మాటలు విని అంబరీషుడు కొద్దిగా నీరు పుచ్చుకొన్నాడు. ఆ కార్యక్రమం పూర్తి అయిన తరువాత దుర్వాస మహాముని నదీ తీరం నుంచి తిరిగి వచ్చాడు. వాస్తవం తెలిసికోకుండానే అతని మీద కోపగించాడు.

మహాముని కోపంలోంచి ఒక శక్తి పుట్టింది. దాని పేరు కృత్య. పెద్దగా అరిచింది. అంబరీషుని చంపాలని వెంటపడింది. కాని అంబరీషునికి రక్షణగా వున్న సుదర్శన చక్రం అడ్డుపడింది. కృత్యను కాల్చి బూడిద చేయగల మంటలను సృష్టించింది.



ఆ శక్తి వాటిలో పడి చనిపోయింది. అంతటితో ఆగకుండా చక్రం దుర్వాసుడి వెంటపడింది. తనని చంపాలని వస్తున్న సుదర్శన చక్రాన్ని చూచి దుర్వాసుడు భయపడి పారిపోవడం ప్రారంభించాడు. పారిపోయే వారిని అది విడిచి పెట్టదు. వెంటపడింది. ఋషి మేరు పర్వతం దాకా పరుగెత్తి ఒక గుహలో దాక్కున్నాడు. అక్కడ కూడా చక్రం ప్రవేశించింది.

మళ్ళీ వచ్చి సముద్రంలో మునిగితే అక్కడ వెంటపడింది. ఆ విధంగా వెన్నంటి సుదర్శన చక్రం నుంచి మునిని బ్రహ్మ లోకంలో వారు కాని కైలాసంలోని వారు కూడా రక్షించలేమని చెప్పేశారు.

యిక బ్రతికే దారి లేక ముని భయంతో వైకుంఠానికి పరిగెత్తి, విష్ణుమూర్తిని శరణు జొచ్చాడు. ఒకసారి విడిచి పెట్టిన తరువాత దానిని తాను కూడా ఆపలేనని శ్రీ మహావిష్ణువు చెప్పాడు.

యిక ఎక్కడా దారి కనిపించని ముని అంబరీషుని దగ్గరకు వచ్చి శరణు కోరారుడ. ప్రాణాలు కాపాడమని బ్రతిమాలు కొన్నాడు. ఎంతో మంచి వాడైన అంబరీషుడు అభయం ఇచ్చాడు. సుదర్శన చక్రాన్ని చల్లబడవలసిందిగా కోరాడు. సుదర్శనం అతని కోరిక మన్నించి వైకుంఠానికి వెళ్ళి పోయింది. దుర్వాసుడు తొందరపాటును రాజు మంచి తనాన్ని గుర్తించాడు. తిరిగి తపస్సుకు వెళ్ళిపోయాడు. విష్ణుభక్తిలో అంబరీషునితో సాటి వచ్చే రాజులు లేరు ఈ కథ చదివిన వారికి శత్రువుల భయం లేదు.


కార్తవీర్యార్జునుడు

మహిష్మతి అని ఒక నగరం ఉంది. అది హైహయ దేశానికి రాజధాని దానిని పాలించే ప్రభువు పేరు. కార్తవీర్యార్జునుడు.

ఎంతో బలశాలి. అతనికి వేయి చేతులున్నాయి. దత్తాత్రేయుని ఉపాసించి వరాలు పొందాడు. మహిష్మతి నగరానికి దగ్గరలోనే ఒక నది ఉంది.

అది రేవానది. కార్తవీర్యార్జునుడు ఒకరోజు తన భార్యలతో ఆ నదీ తీరానికి వెళ్ళాడు. వారితో కలసి జలక్రీడలు చేస్తున్నాడు.

తన ఉల్లాసానికి తెలుపుకోవటానికి వేయిచేతులు అడ్డుపెట్టి నదీ ప్రవాహాన్ని ఆపాడు. దిగువకు నీరు ప్రవహించటం ఆగిపోయి ఎగువకు ముంపు వచ్చింది. నదీ తీరాన యిసుకలో శివలింగాన్ని ఉంచి అదే సమయాన రావణుడు పూజ చేస్తున్నాడు.ఎగువకు ముంపు రావడంతో శివలింగం కొట్టుకు పోయింది.



దాంతో రావణునికి కోపం వచ్చింది. ఈ పని ఎవరు చేశాడని అతడు నాలుగు వైపులా చూశాడు. అంత దూరంలో భార్యలతో కలసి స్నానం చేస్తున్న కార్తవీర్యార్జునుడు కనిపించాడు. జరిగినదేమిటో రావణునికి అర్థం అయ్యింది. అతని మీదికి దండెత్తి వచ్చాడు.


''నీవు చేసిన పనివల్ల నా శివ పూజకు భంగం అయ్యింది. నీవు శిక్షార్హుడవు' అన్నాడు.

''నన్ను శిక్షించగలవారు భూమి మీద ఎవ్వరూ లేరు, నీవెంతా?'' అని కార్యవీర్యార్జునుడు ఎదురు తిరిగాడు. ఇద్దరికి యుద్ధం జరిగింది.

వారిలో హైహయ రాజే బలవంతుడు. అతని శక్తి ముందు రావణుడు నిలువ లేకపోయాడు. అంతేకాదు అతని చేతులలో బందీ కూడా అయ్యాడు. రావణుడు అవమానం పాలైయ్యాడు. ఎలాగో తప్పించుకొని తిరిగి లంకకు పారిపోయాడు. బలవంతుడైన అర్జునుడు అడవికి వేటకోసం వెళ్ళాడు. చాలసేపు జంతువులను వేటాడిన తరువాత అతనికి అలసట వచ్చింది. విశ్రాంతి కోసం దగ్గరలో ఒక ముని వాటిక కనిపిస్తే దానిలోకి ప్రవేశించాడు.

పరశురాముడు

అది జమదగ్ని ఆశ్రమం రాజుకు మహర్షి అన్ని మర్యాదలు యిచ్చి గౌరవించాడు. అతనితో పాటుగా వచ్చిన సైనికులు అందరికి చక్కని విందు ఏర్పాటు చేశాడు. చక్రవర్తి ఎంతో సంతోషం కలిగింది.



ఒక ముని ఆశ్రమంలో యింత కొద్ది సమయంలో అంతటి పెద్ద ఏర్పాటులు ఎలా చేయకలిగాడని అనుమానం కూడా వచ్చింది. వెంటనే తన వారిని పిలిచి ఈ విషయమై అడిగాడు. వారు జమదగ్ని మహర్షి దగ్గర కామధేనువు ఉన్నదని అది కోరిన కోర్కెలను తీర్చగల కల్పవల్లి అని చెప్పారు.



అర్జునుడు అలాంటి అద్భుతమైన కామధేనువు తన దగ్గర ఉండటం మంచిదని దాన్ని తనకు యివ్వమని అడిగాడు కాని ముని నిరాకరించాడు.

ముని మాటలను లెక్కచేయకుండా రాజు కామధేనువును బలవంతంగా తనతో పాటు తీసుకు పోయాడు. జమదగ్ని కుమారుడే పరశురాముడు. అతడు ఆశ్రమానికి వచ్చి జరిగిన సంగతి తెలుసుకొన్నాడు. కామధేనువును తీసుకొని వెళ్ళిపోయిన రాజు మీద కోపించాడు.

అతని చేతిలోని ఆయుధం గొడ్డలి. అతడు విష్ణుమూర్తి అంశతో పుట్టాడు. ఎంతో పరాక్రమ వంతుడు. విషయం తెలిసిన మరుక్షణమే యుద్ధం ప్రకటించాడు. వెంటనే మహిష్మతి నగరం మీద దాడికి బయలు దేరాడు. గండ్ర గొడ్డలితో అతని వేయి చేతులను నరికి వేశాడు. తను తుంచి విజయం సాధించాడు.

చక్రవర్తిని చంపిన తరువాత విజయ గర్వంతో ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. చక్రవర్తి కుమారుల తరువాత వారి ఆశ్రమంపై దాడి చేశారు. అప్పుడు కూడా పరుశురాముడు ఆశ్రమంలో లేడు.


జమదగ్ని తపస్సులో వున్నాడు. కనులు మూసికొని కూర్చున్న జమదగ్నిని వారు చంపివేసి వెళ్ళిపోయారు. భార్గవరాముడు తిరిగి వచ్చి తండ్రి మరణించి ఉండటం చూశాడు. ఈ పని ఎవరు చేశారో తెలుసు కొన్నాడు.



నిర్భయంగా రెండవసారి నగరం మీదికి దాడి చేసి కార్తవీర్యార్జునుని కొడుకు లందర్నీ చంపేశాడు.

అంతటితో అతని పగ చల్లారలేదు. రాజవంశాలపై కక్ష కట్టాడు. ఇరవై ఒక్కసార్లు భూమి అంతా తిరిగి రాజవంశాలను, దుష్టులను దయలేకుండా చంపేశాడు. రాజరక్తంతో కలసిన గండ్రగొడ్డలిని తొమ్మిది మడుగులలో కడిగాడు. అదే శమంతక పంచకం.

అతడు తపస్వి. అందువల్ల చనిపోయిన తండ్రి తలను తిరిరి శరీరానికి అతికించి బ్రతికించాడు. ఆ తరువాత మనశ్శాంతి కోసం తపస్సు చేశాడు పరుశురాముని దగ్గర వైష్ణవ చాపం అనే ధనస్సు ఉంది. తరువాతి కాలంలో దాన్ని శ్రీరామ చంద్రునికి ఇవ్వవలసివస్తే సంతోషంగా ఇచ్చివేశాడు.



అంతటితో అతని పగ చల్లారలేదు. రాజవంశాలపై కక్ష కట్టాడు. ఇరవై ఒక్కసార్లు భూమి అంతా తిరిగి రాజవంశాలను, దుష్టులను దయలేకుండా చంపేశాడు. పరుశురాముని దగ్గర వైష్ణవ చాపం అనే ధనస్సు ఉంది. తరువాతి కాలంలో దాన్ని శ్రీరామ చంద్రునికి ఇవ్వవలసివస్తే సంతోషంగా ఇచ్చివేశాడు.

దాశరథి

అయోధ్య నగరానికి రాజు దశరథ మహారాజు. అతనికి భార్యలు ముగ్గురు కౌసల్య, సుమిత్ర, కైక. కౌసల్యకు శ్రీరామచంద్రుడు జన్మించాడు. విశ్వామిత్రుని యాగాన్ని కాపాడి జనకుని కుమార్తె సీతను పెళ్ళి చేసుకొన్నాడు.

పరశురాముని దగ్గర నుండి విష్ణు ధనస్సు పొందాడు. సవతి తల్లి కోరికపై భార్య, సోదరుడు లక్ష్మణునితో కలసి అడవులకు వెళ్ళాడు. రాక్షసులను చంపి మునులను యాగాలను కాపాడాడు.

సముద్రానికి ఆంజనేయుడు ఇతర వానరులతో కలసి వారధి కట్టి రావణుని అతని పరివారాన్ని చంపేశాడు. (రామాయణ గాధను ఎమెస్కో బొమ్మల రామాయణంలో చదవండి)

తిరిగి అయోధ్యకు వచ్చి రామరాజ్యంగా పాలించాడు.



ద్వాపరయుగం

ఈ సమయంలో దుర్మార్గుల వల్ల ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవించారు. భూమికి భారం పెరిగిపోయింది. అలా భూ భారాన్ని పెంచిన వారిలో కంసుడు ముందున్నాడు. అతడు చేసిన పాపాలకు పరిమితి లేదు. అతనితో పాటుగా దుర్మార్గుడు పూర్తిగా చెలరేగి ప్రజలను కష్టాలపాలు చేసే సమయంలో శ్రీకృష్ణుడు పుట్టి వారిని చంపి భూమికి భారం తగ్గించాడు.

శ్రీకృష్ణుని అవతారం

సూరసేనుడు యాదవ రాజు. మధుర అతని ముఖ్య పట్టణం. వసుదేవుడు అతని కొడుకు. కోడలు దేవకీ దేవి.

దేవకీ పెదనాన్న కుమారుడే కంసుడు. వారు అన్నా చెల్లెళ్ళు దేవకి పెళ్ళి అయిన తరువాత వారిని రథం మీద మధురానగరానికి తీసుకు వస్తున్నాడు.

దారిలో కంసునికి ఆకాశవాణి పలుకులు వినిపించాయి.

''ఓరీ కంసా, ఎంతో ఆదరంగా చెల్లిని బావగారిని తీసుకుపోతున్నావు. కాని ఈ ప్రేమ ఎంతో కాలం నిలువదు. వారికి పుట్టే ఎనిమిదవ బిడ్డ నిన్ను చంపేస్తాడు.''

ఈ మాటలు విని కంసుడు మొదట ఆశ్చర్యపడిపోయాడు. వెంటనే భయం కలిగంది. ఆ భయం భయంకరమైన కోపంగా మారింది.


అతనికి ప్రాణ భయం పట్టుకొంది. వెంటనే చెల్లి అనే జాలి చూపకుండా దేవకీ దేవిని చంపేందుకు కత్తి ఎత్తేడు. వసుదేవుడు బావమరిది కాళ్ళు పట్టుకొన్నాడు.

''బావమరిది అధికారాలు అన్నీ, నీ చేతిలో వున్నాయి. క్రొత్తగా పెళ్ళి చేసికొని భర్తతో కాపురం చేయాలని కలలు కంటున్న ఒక ఆడపిల్లను చంపటం మంచి పని కాదు. మాకు కలిగే సంతానం ఒక్కొక్కరుగా వెంటనే నీకు అందిస్తాము. వారిని పుట్టగానే చంపితే నీకు, ప్రాణ భయం వుండదు కదా! ఇప్పుడు ఈ హత్య చేయవద్దు''అని బ్రతిమాలుకొన్నాడు. ఈ మాటలతో కంసునికి కాస్త మనశ్శాంతి కలిగింది. తన అంతటి పరాక్రమవంతుడు. ఒక ఆడపిల్లను అప్పుడే పెళ్ళి అయిన దానిని, తన స్వంత తండ్రి అయిన ఉగ్రసేనుడు మంచి మాటలు చెప్పాడని అతనిని కూడా చెరసాలలో పెట్టాడు.

దేవుడే అవతరించాడు

పెద్దవారు కూడా కాలంకలసివస్తే శక్తి వంతులు అవుతారు. కాని వారి దుర్మార్గాలు మితమీరినప్పుడు భగవంతుడు భూమిపై పుడతాడు. దానినే అవతారం అంటారు.

కంసుడు మొదలైన వారు పాపాలు ఎదురు లేకుండా చేసుకుపోతున్న సమయంలో విష్ణుమూర్తి కృష్ణుడుగా అవతరించాడు. ఆయన పవళించే పాన్పు అయిన ఆది శేషుడే బలరాముడుగా పుట్టాడు.



అంటే దేవకి ఎనిమిదవ గర్భం ధరించింది. ఇప్పుడే కంసుని చంపగల శక్తి పుట్టాలి. ఈసారి కంసుడు చెరసాల చుట్టూ గట్టి కాపలా ఏర్పాటు చేశాడు.

చాలా మంచి ముహూర్తంలో శిశువు పుట్టింది. ఎన్నో మంచి శకునాలు కన్పించాయి. విష్ణుమాయ ప్రారంభం అయ్యింది. అంతసేపు మెళుకువగా ఉన్న చెరసాల కాపలాదారులు నిద్రపోయారు. పెద్ద వాన కురిసింది. బాలుడు ఎంతో ముద్దుగా ఉన్నాడు.

దేవకీ వసుదేవులు ఎలాగైనా ఈ బిడ్డను కాపాడుకోవాలని ఆలోచించారు.

వారు అతనిని రేపల్లెలో యశోదాదేవి దగ్గర విడిచి పెట్టాలని నిర్ణయించుకొన్నారు. బుట్టలో పెట్టుకొని బాలుణ్ని బయటకు తీసుకు వచ్చాడు వసుదేవుడు. విష్ణుమాయ వల్ల ఎటువంటి అడ్డంకులు ఎదురు కాలేదు. యమునా నదీ పాయలుగా చీలి దారి యిచ్చింది.

ఆదిశేషువు శిశువుకు వర్ష బాధ లేకుండా పడగ పట్టాడు. వారు క్షేమంగా రేపల్లెకు చేరుకున్నారు.

మన పల్లె రేపల్లె

నందుడు చాలా గొప్ప గొల్లడు. అతని భార్య యశోద. ఆమె ప్పుడే ఒక శిశువును ప్రసవించింది. వసుదేవుడు నందునితో మాట్లాడి తెచ్చిన బిడ్డను వారికిచ్చి వారి బిడ్డతో తిరిగి ప్రయాణ మయ్యాడు. బయటకు వెళ్ళిన విధంగానే చెరసాలలోపలకు ఆడపిల్లతో చేరుకోగలిగాడు.



అతడు లోనికి పోగానే కాపలా దారులకు మెలుకువ వచ్చింది. పాప ఏడ్చింది. కంసుడు చెల్లి ప్రసవించిన వార్తను అందుకొన్నాడు. ఆకాశవాణి చెప్పిన ప్రకారం ఎనిమిదవ శిశువును చంపి తీరాలి. అందుకోసం అతడు కత్తి తీసుకొని చెరసాలలోకి వచ్చాడు. చెరసాలలో వున్నది ఆడపిల్ల. ఎనిమిదవ కాన్పు కనుక చంపి తీరాలి. కత్తిని ఎదురుపెట్టి బిడ్డను పైకి విసిరాడు. పైకి వెళ్ళిన శిశువు క్రిందికి తిరిగి వచ్చి కత్తికి ఎరకాలేదు. అస్సలు శిశువు క్రిందికి రాలేదు. విసిరిన చోటున ఎంతో తేజస్సుతో మహామాయ కన్పించింది.

కంసుని ఆశ్చర్యాన్ని, భయాన్ని కల్గిస్తూ ఆ మాయ ఇలా చెప్పింది.

''ఓరి కంసా! కంసమామా, నేను మహాశక్తిని కాలానికి మరో రూపాన్ని నిన్ను చంపగలవాడు రేపల్లెలో పెరుగుతున్నాడు. నీకు నిజంగానే ఆయువు మూడింది'' ఈ మాటలు విని కంసుడు అదిరిపడ్డాడు. శక్తి మాయమయ్యింది.

కంసుడు తన భయాన్ని దాచుకొని ఆ బాలుని కోసం వెతకటం ప్రారంభించాడు. సమర్థులు, శక్తివంతులు అయిన రాక్షసుల్ని రేపల్లెకు పంపించాడు. వారు చిన్నారి శిశువు కోసం మూలమూలల గాలిస్తున్నారు. కాని విష్ణుమాయను తెలిసికోవడం ఎవరి తరం అవుతుంది.

విషపు చనుబాలు

శ్రీకృష్ణుడు పెరిగి పెద్దవాడు అవుతున్నాడు! రేపల్లెలోని స్త్రీలు అందరికి అతడు ముద్దులు ఒలికించే మురిపాల కన్నయ్య అయ్యాడు. ఎవరో ఒకరు రావటం ముద్దు చేయటం బాగా అలవాటు అయిపోయింది. ఇదంతా యశోదాదేవికి ఆనందాన్ని కలిగిస్తోంది. నందుడు అయితే బిడ్డను చూచి లోలోపల చాలా పొంగిపోతున్నాడు. అలాగే ఒక రోజు ఒక యువతి వారి ఇంటికి వచ్చింది.


కృష్ణుడు అప్పటికి నేల మీద పాకటం కేరింతలు కొట్టవం వరకే చేయగలుగు తున్నాడు. ఎవరు పిలిచినా వెళ్ళి వారి చంక ఎక్కుతాడు. తాంత్రిక విద్యలలో నిపుణురాలు అయిన పూతన రాగానే ఆమెను చూచి బాలుడు కేరింతలు కొట్టాడు. తనని ఎత్తుకోమని చేతులు చాచాడు. పూతన అంతకు మునుపే రేపల్లె అంతా తిరిగి కనిపించిన బాలురకు చనుబాలు యిచ్చి తృప్తి పరచింది.

అలాగే తన బిడ్డను కూడా చనుబాలు ఇవ్వటానికి ఆమె వస్తే యశోదా దేవి అభ్యంతరం చెప్పలేదు. బిడ్డను చేతికి అందించింది. కాని పూతన కంసుడు పంపించిన రాక్షస కాంత! కృష్ణుని చూడగానే గ్రహించింది. దేవుడు భూమి మీద అవతరించాడు. రొమ్ములకు విషం రాచుకొని వచ్చింది పూతన చనుబాలు ఆశతో స్తనాన్ని నోటిలో పెట్టుకోగానే అతని నోటిలోకి విషం వెళ్ళిపోతుంది.

అతడు తక్షణమే మరణిస్తాడు.

పూతన ఆలోచించి నిర్ణయించుకున్న పథకం అది. కాని మన బాలగోవిందుడు సామాన్యమయిన వాడు కాదు కదా? పూతన ఒడిలో చేరి పాలు త్రాగటం ప్రారంభించాడు.

ఆమె ఊహించిన విధంగా అతడు వెంటనే చనిపోతాడు. విషపూరితమైన పాలు అతని మీద ఎలాంటి ప్రభావాన్ని చూపించలేదు. వాటిని జీర్ణించుకున్నాడు.



కొద్ది సేపు అయిన చనుబాలు త్రాగుతూ ఉంటే ఆమెకు భయంకరమైన బాధ కలిగింది. అతడు సాధారణ బాలుడు కాదు. మాయలకు లొంగి ప్రాణాలు కోల్పోయే అమాయకుడు కాదు.

పాలుతో పాటు విషాన్ని జీర్ణించుకోవటమే కాకుండా ఆమె స్తనంలోంచి శరీరంలోని రక్తమంతటిని పీల్చటం ప్రారంభించాడు. అది గమనించిన పూతన పారిపోవాలని ప్రయత్నించింది. కాని బాలుడు ఆ ప్రయత్నం కొనసాగనివ్వలేదు. పారిపోయేందుకు ఆమెకు అవకాశం యివ్వలేదు.

శరీరంలోని రక్తమంతా పీల్చేశాడు. అంతవరకు ఒక సాధారణమయిన తల్లిగా ఉన్న పూతన యదార్థమయిన రూపాన్ని బయటపెట్టింది. రాక్షసిగా మారిపోయింది. చూచేవారందరికి ఏ ప్రమాదం జరుగుతుందో అని భయంగా వుంది. కృష్ణ భగవానుడు ప్రమాదాలకే ప్రమాదం! అతడు పూతన రక్తం అంతా పీల్చి వేయగా ఆమె విరుచుకు పడిపోయింది. బాలుడు గుండెల మీదికి ఎక్కాడు. చేతులతో గ్రుద్దడం ప్రారంభించాడు. ఆమె గుండెలు రెండుగా చీలినాయి. తక్షణమే ప్రాణాలను విడిచిపెట్టింది.

బాల ముకుందుడు ఒక రాక్షసిని చంపి పారేశాడనే వార్త రేపల్లె అంతా ప్రాకింది. మొదలే అతడు అందరికి అపురూపం ఇంకనూ ఘనకార్యం కూడా చేశాడని తెలియడంతో మరింత ముద్దు కృష్ణుడు అయిపోయాడు.

ప్రజకాంతలు అందరూ వచ్చి అతన్ని పొగిడారు. ఎత్తుకుని ముద్దులు కురిపించారు. అతడు అసాధారణ బాలుడు అనీ చాలా జాగ్రత్తగా పెంచాలని యశోధను హెచ్చరించారు. యశోద హృదయం ప్రేమతో పొంగింది.

ఎంతో ప్రేమపాత్రుడు, అమాయకంగా అందరి వంక చూచి ఊకారాలు కొట్టి వారిని తనవారుగా చేసుకుంటున్న బాలుడు ఇంత ఘనకార్య ఎలా సాధించాడో ఆమెకు తెలియకూసద్ద గొప్పవాడు అని అంటూ వుంటే ఆ తల్లి హృదయం పొంగిపోయింది. అంతేకాదు వారు ''యశోదా! ప్రతి దినము వచ్చి ఈ బిడ్డను మేము ఎత్తుకుని ముద్దాడుతూ ఉంటాం . ఇలాంటి బిడ్డ నీకు మాత్రమే కాదు రేపల్లెలోని స్త్రీలందరికి బిడ్డడే'' అని చెప్పడంతో ఆమె మరింతగా సంతోషపడింది.

శ్రీ కృష్ణుడు ఎత్తు వారి చేతి బిడ్డ అయ్యాడు.

తృణావర్తుడు

అంతటితో శ్రీకృష్ణుని చంపేందుకు కంసుడు పంపించిన రాక్షసుల ప్రయత్నాలు నిలిచిపోలేదు. వారు అన్ని చోట్ల గాలిస్తూ బాలుడు కన్పిస్తే చంపివేయాలని చూస్తున్నారు. అలాంటి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నవారిలో చాలా బలవంతుడు అయిన మరొక రాక్షసుడు ఉన్నాడు.

అతని పేరు తృణాసురుడు. రేపల్లె అంతటికి ముద్దు లొలికే చిన్ని కృష్ణుని ఆటపాటలే కాలక్షేపంగా వున్నాయి. పల్లెలోని తల్లులంతా తమ బిడ్డల్ని బాలకృష్ణుడితో ఆటలాడుకోమని పంపుతున్నారు.

అలా ఒకరోజు యశోదాకృష్ణుడు పిల్లలతో కలసి ఆటలాడుకొంటున్నాడు. అన్నింటిలోను అతనిదే పై చేయి!

కొంటెతనంగా మోసగించి అయినా సరే తాను గెలిచి తీరాలన్నది అతని పట్టుదల! ఆటలలో లీనమైపోయి వున్నాడు. వీధిలో సుడిగాలి విరుచుకు పడింది. పిల్లలు భయంతో నాలుగు వీధులకు పరుగుతు తీసారు. చిన్ని కృష్ణుడు మాత్రం కొంచెం అయినా భయపడలేదు. ఆ పెనుగాలికి ఎదురు నిలిచాడు. జరుగనున్న వింత ఏమిటో దేవదేవునికి తెలుసు! సుడిగాలి కన్నయ్యను చుట్టు ముట్టేంది. గిరి గిర త్రిప్పి పైకి లేచింది. ఆకాశంలో ఆధారము లేకుండా కొట్టుకుపోతున్నాడు కృష్ణుడు. గాలి ఎలా త్రిప్పితే అలా తిరిగాడు. యిలా జరగడం మామూలుగా అయితే ఆశ్చర్యపడాలి!

కాని యిది రాక్షసమాయ! అని తెలుసుకొన్నాడు. సుడిగాలి కేంద్ర బిందువులో రాక్షసుడున్నాడు. కృష్ణుడు అతనిని అవలీలగానే పట్టుకొన్నాడు. పిడికిళ్ళతో అతని గుండె పగిలిపోయేలా దెబ్బకొట్టాడు. మొదట రాక్షసుడు ఎదురు తిరగాలని ప్రయత్నించాడు. కాని కృష్ణుడు అతనికి ఎలాంటి అవకాశం యివ్వలేదు. పిడికిళ్ళతో చావమోదాడు. కృష్ణుడు కొట్టే బలమైన దెబ్బలను భరించలేకపోయాడు తృణావర్తుడు. గుండె పగిలి నెత్తురు కక్కుకుంటూ నేలకు రాలిపోయాడు. కృష్ణుడు అతని చెవి పట్టుకొని వ్రేలాడుతూ అతనితో పాటుగా క్రిందికి వచ్చాడు. ఆ విధంగా ఆకాశంలోంచి సుడిగాలిలోంచి క్షేమంగా క్రిందికి దిగిన కృష్ణుడు అంతటితో అతనిని విడిచిపెట్టలేదు. ప్రాణాలను విడిచిపెట్టేదాక అతనిని రకరకాలుగా హింసించాడు. సుడిగాలి ఆకారాన్ని వదిలిపెట్టి సహజమైన తన రాక్షస రూపంలో రేపల్లె వీధిలో నిట్టనిలువుగా పడిపోయాడు! అతని ప్రాణాలు పోయాయి! కృష్ణుడు చిన్న బాలుడైన మరో ఘనకార్యం చేసాడని రేపల్లె పెద్దలందరూ సంతోషంగా చెప్పుకొన్నారు! గోపకాంతలు ముద్దుమురిపాలు మరింత అయినాయి! యిక యశోద ఆ బిడ్డను చూసుకొని ఎంతగానో మురిసిపోయింది! నా చిన్ని కృష్ణుడు మహా విష్ణువు అవతారమే! అని సాటి గోపకాంతలతో గర్వంగా చెప్పుకుంది.

చిలిపి కన్నయ్య

కృష్ణువు నల్లనివాడు. అతని కన్నులు పద్మపత్రాలవలె వుంటాయి. ముఖంలో దివ్యమైన ఆకర్షణ ఉంది. ఆ రేపల్లె అతని సొంత యిల్లు అయ్యింది. ఒకచోట అని లేదు. ఎక్కడ చూచినా తానే అయి తిరుగుతున్నాడు. గోపికలు వెన్న చిలుకుతూంటే చల్లగా చేరి దొంగిలించేవాడు. వారేదైనా కోపగిస్తే తల్లి ఎదపయ్యెద చాటున చేరి మురిపాలు సాగించేవాడు.

ప్రక్క యిండ్లకు వెళ్ళి కట్టివేసిన గోవుల్ని, దూడల్ని విడిచిపెట్టేవాడు. అవి యజమానుల నుండి తప్పించుకొని పారిపోతూవుంటే కేరింతలు కొట్టేవాడు. వెన్న ముద్దలను దొంగిలించి స్నేహితులందరికీ పంచి పెట్టేవాడు. రాత్రి సమయాలలో చల్లగా యిండ్లలో చేరివెన్న తిని వెళ్ళిపోతూ కొంచెం వెన్న తీసి ఆ యింటి కోడలి పెదవుల మీద వ్రాసేవాడు. వెన్న అంతా మాయమైపోవడం గమనించిన అత్తలు, కోడలి ముఖం చూచి జగడం పెట్టుకొనేవారు. ప్రతిరోజూ ఏదో ఒక క్రొత్త చిలిపి చేష్టలు చేస్తూవుండేవాడు. ప్రతి యింటిలో అతని గురించిన మాటలే జరగటం అలవాటైపోయింది.

చిన్ని కృష్ణుని చిలిపి చేష్టలు పెచ్చుమీరిపోగా, కోపసింగిన గోప వనితలు యశోదమ్మకు చాడీలు చెప్పడం మొదలెట్టారు.

చిన్ని నోటిలో భూగోళం

''యశోదమ్మ! మీ కృష్ణుడు మన్ను తిన్నాడమ్మా!'' గోప బాలకులు పరుగెత్తుకుంటూ వచ్చి అందించిన వార్త అది! చిన్న పిల్లవాడు మన్నుతున్నాడంటే తల్లి సహజంగా నమ్మింది! కాని బలరాముడు బుద్ధిమంతుడు! కృష్ణుడు ఎంత చిలిపి పనులు చేస్తాడో బలరాముడు అంత మంచి పనులు చేస్తాడు!

ఆబద్ధాలు చెప్పటం కృష్ణునికి అలవాటు! బలరాముడు నిజం తప్ప మరేమి చెప్పడు! ''చిన్నా! మన కన్నయ్య మన్ను తిన్నమాట నిజమేనా ?! '' అని అడిగిందామె. ''అవునమ్మా! కన్నయ్య మన్ను తిన్నాడు!'' అంటూ బలరాముడు సాక్ష్యం చెప్పాడు. వెంటనే యశోద పరుగులు తీసింది! తోటలో, ఒక పున్నాగ చెట్టు నీడలో కృష్ణుడు స్నేహితులతో ఆడుకుంటున్నాడు. తల్లి దగ్గరగా వెళ్ళి , ''మన్ను తినటం తప్పు నాన్న'' అంది.



''నేను మన్ను తినలేదమ్మా!'' అని బదులిచ్చాడు కృష్ణుడు ''అన్నయ్య అబద్ధం చెప్పడు. ఏది నోరు చూపించూ?!'' అని అమాయకంగా అడిగింది ఆ పిచ్చి తల్లి యశోద!

అతడు పరమాత్ముడు! పురుషోత్తముడు! సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు యొక్క సంపూర్ణ అవతారం! బ్రహ్మాండ భాండాలను కడుపులో యిముడ్చుకొని ఆ దేవదేవుని నోటిలో ఆ పిచ్చి తల్లి చూడగలిగినదేమి?


తను కన్నవాడే! అపురూపంగా పెంచుకొన్నవాడే! అయినా అతని దైవత్వం ఆ తల్లి చూడదు! చిన్ని కృష్ణుడు చిట్టి నోరు తెరిచాడు! ఆ తల్లి కంటి చూపులకు బ్రహ్మాండ గోళాలు దర్శనమిస్తున్నాయి. కాసంత మట్టి ఏమిటి?! భూదేవి ఆ మహాదేవుని పాదాలను బట్టి సేవలు చేస్తోంది!

పాలపుంతలు నవగ్రహాలు, నవకోటి సూర్యుడు ఆ చిన్ని నోటిలో దర్శనమైతే యిచ్చాయి. కాని, 'ప్రేమ' అనే రెండు అక్షరాలు తప్ప మరేమి తెలియని ఆ తల్లి ఎలా చూడగలదు! కోటి సూర్యుల్ని కడుపులో దాచుకున్నవాడే తన ఒడిలో పెరుగుతున్న వాడని ఎలా అర్థం చేసుకోగలదు?! యశోద విరుచుకొని పడిపోయింది! బలరామకృష్ణువు సేవలు చేసారు!

''అమ్మా! నేను తప్పు చేసానా?!'' అని అమాయకంగా ప్రశ్నించాడు చిన్ని కన్నయ్య, ''లేదురా నాన్న! తప్పు నీది కాదు! నీవెవరో తెలియని నాది. ఒడి చేరిన బిడ్డవను కొన్నానే కాని, వైకుంఠవాసుడివని గుర్తించలేకపోయాను!'' అంటూ బిడ్డలిద్దరిని చేరదీసి గుండెలకు హత్తుకున్నది.

మొలనూలు : శాప విమోచనం

కృష్ణుని అల్లరి పెచ్చు మీరింది! గోపకాతలు చాడీలు చెప్పటం ఎక్కువైపోయింది. ''నాకేమి తోచదు. మరేంచేయను?!'' అని బదులిచ్చాడు కృష్ణుడు! ఏం చేయాలో నేను చెప్తాను. యిలారా!'' అని చేరపిలిచింది. కృష్ణుడు దగ్గరగా వచ్చాడు. అతని మొలనూలు తీసి రోలుకి చుట్టింది యశోద! చిలిపి కృష్ణుడు కదలకుండా ఎలా కూర్చోగలడు?! నెమ్మదిగా ప్రయత్నం మొదలెట్టాడు. ముందుకు పోయి స్నేహితులను కలియాలంటే మొలనూలు విప్పాలి. లేదా రోలును కదిలించాలి. తల్లి చేసిన కట్టు తప్పించడం అతనికిష్టం లేదు! రెండవ ప్రయత్నం ప్రారంభించాడు.



నెమ్మదిగా రోలును కదిలించి పెరటిలోనే ముందుకు పాకుతున్నాడు. పెరటిలో పెద్ద వృక్షాలున్నాయి. వెటిలో కవలలులా రెండు మద్ది చెట్లున్నాయి. చెట్ల సందుల నుంచి బాలుడైతే ముందుకు వెళ్ళిపోయాడు కానీ, రోలు మాత్రం అతనితో రాలేదు. మద్ది చెట్టును పట్టుకొని ఆగిపోయింది.

చిన్ని కృష్ణుడు వెనుదిరిగి చూచి ఒక చిరునవ్వు నవ్వాడు. సమస్త లోకాలను రక్షించే ఆ దేవదేవుని బలమెంత?! రెండు మద్ది చెట్లకుండే శక్తి ఏపాటిది? కన్నయ్య చిన్నపట్టు పట్టాడు! ఎంతో కాదు! కొంచెం బలాన్ని చూపించాడు! మద్ది చెట్లు రెండు పెళ పెళమని విరుచుకు పడ్డాయి! చెట్లలో నుంచి రెండు కాంతి రూపాలు బయటికి వచ్చాయి!



''పరమాత్మా! మేము కుబేరుని పుత్రులం! యక్ష సంతతి మాది! మా పేర్లు నలకుబేరుడు, మణిగ్రీవుడు.



శాపకారణం వలన చెట్లుగా పడి వున్నాము. లోకాలను పాలించే దేవుడవు! నీవు వస్తావని శాప విమోచనం చేస్తావని నూరు సంవత్సరాలుగా కంటి వాకిట చూపులు దీపాలు వెలిగించి ఎదురు తెన్నులు చూస్తున్నాము.

ఈ నాటికి మా తపస్సు ఫలించిందయ్యా! మాకు సెలవు యివ్వు!'' అని చేతులు జోడించారు.

చిన్ని కృష్ణుడు చిరునవ్వుల సిరులు ఒలికించి వారిని ఆశీర్వదించాడు. చిన్ని కృష్ణుడు ఏమి చేస్తున్నాడని తొంగిచూచిన యశోద నివ్వెరపోయింది! నందుడు వచ్చాడు! ఒడిలో వున్నవాడు గుడిలో వున్న దేవుడే అని వారు తెలుసుకున్నారు! ఎన్ని జన్మల నోముల పంట యీ పసివాడు?! యశోద యిల్లు యిల్లు తిరిగి మా కృష్ణుడు దేవుడేనమ్మ అని చెప్పుకొంది.

రేపల్లెలోని గోపభామలు ఆమె మాటలు విని ఫక్కున నవ్వారు. ''యీ విషయం నీకు యిప్పుడు తెలిసిందా పిచ్చి యశోదా! మాకు ఎప్పుడో తెలుసు. రేపల్లెలో వెలసిన దేవుడే!'' చిన్నారి కృష్ణుడి మీద తల్లి దండింపులు తగ్గాయి. అతడు చేసేది అల్లరి కాదు! లోక రక్షణ! దుష్ట శిక్షణ!

నందగోపాలుడు

ఎంత అందమైన చోటు అది! పేరు బృందావనం కదా ! యమునా తీరం! శీతల వాయు సమీరం! వెన్నెల వెండి వెలుగులు యిసుక తిన్నెల మీద జిలుగులు రచయించే చోటు! సెలయేటి నీటి ఊటల మీద ఎన్నెన్ని అలలు! అవే బాలకృష్ణుని పై మోహాన్ని పెంచుకుంటున్న గోపకాంతల కళ్ళ వాకిళ్ళ వెనుకనుంచి తరలి వచ్చే చోటు! అపురూపం ఆ యమునా తీరం! అందాల లోకం ఆ బృందావనం! అక్కడ నాయకుడు పరమాత్ముడే!

మన చిన్ని కృష్ణుడు ఆలమందలు దూరంగా పచ్చిక బయళ్ళలో మేస్తున్నాయి. నామాలు, శిఖలు, గోచీలు పెట్టుకొన్న గోపబాలురు కృష్ణుని అంతరంగిక మిత్రులు.

''కన్నయ్యా! నువ్వు చెట్టు నీడన కూర్చో చద్దిముద్దలు తింటూ పిల్లన గ్రోవి వూదుకుంటూ హాయిగా వుండు. నీ ఆలమందల్ని మేము చూస్తాము'' అంటూ అతనిపై వాత్సల్యం వర్షిస్తారు. స్వచ్ఛమైన వెన్నెల కిరణం రాలిపడితే ఆ మనసులు మచ్చపడతాయి. అంతటి నిర్మలమయిన ప్రేమ వారిది. ఒక రోజు గోపబాలికలు పచ్చిక బయళ్ళలో ఆలమందలు కాస్తూ, నందకుమారుని వేణుగానం వింటున్నారు. ఒక వంక అతనిని చంపాలన్న రాక్షసుల కుట్ర సాగుతూనే వుంది. ఒక రాక్షసుడు ఆలమందలలో ఆవుదూడగా కలిసిపోయాడు. ఆలమందలు అంబా అని అరిచాయి. ఏ ప్రాణి ఎందుకు అరిచిందో, ఎలా తనను పిలిచిందో ఏ కష్టాలు తీర్చమని తనను తలచిందో దేవునికి తెలుసు. వేణుగానం ఆగిపోయింది.

పొన్న చెట్టుల నీడనుంచి, వెన్న దొంగ వెలుపలకు వచ్చాడు. ఆకారం మార్చుకొని ఆలమందల మధ్య తిరుగుతున్న ఆ రాక్షసుని గుట్టు కనిపెట్టాడు. సమయం కోసం పొంచి వున్నాడు. అసురుడు, దాగున్నానని అనుకొన్నాడు! కాని ఆ దేవుడు విశ్వచక్షువు.

చూడని చోటు ఎక్కడుందని దాగగలడు? కృష్ణుడు రాక్షసుని సమీపించాడు. కాళ్ళు రెండు పుచ్చుకొని గిరగిర త్రిప్పి విసిరాడు! అతని ప్రాణాలు ఆకాశంలోనే అంతరించాయి. శవంగా మారి నేలమీద పడ్డాడు. గోపబాలకులు యీ కథను తెచ్చి యశోదానందులకు, గోపకాంతలకు అందించారు. ఒక దేవుని దేవుడు అని నమ్మడానికి ఎన్ని కథలు కావాలి?

బకాసురుడు

అదే బృందావనం! ఆ గోపబాలుడే! ఆ వెన్నెల వెలుగు జిలుగులే! అదే యమునా తీరం! విధాత రచియించిన సుందర తర చిత్రమది! కృష్ణుడు గోపబాలురతో ఆడుకొంటున్నాడు. ఆ సమయంలో ఒక కొంగ వచ్చి వారి మధ్య వాలింది! దానికి చాలా పొడవైన ముక్కు వుంది! రెక్కలతో సుడిగాలి సృష్టించగల శక్తి వుంది! కాళ్ళకు కత్తుల వంటి గోళ్ళు వున్నాయి. అనేక రూపాలలో బాలకృష్ణుని చంపాలని ప్రయత్నించిన రాక్షసులు తామే చనిపోయారు.

ఈ కొంగ కూడా అలా ఆకారం మార్చుకొని వచ్చిన రాక్షసుడే! అది నేరుగా వచ్చి కృష్ణునిపై దాడి చేసింది! పెద్ద నోరు తెరచి మింగి వేయాలని ప్రయత్నించింది. అయితే కృష్ణుడు దాని గొంతులో అడ్డం పడ్డాడు. మింగటానికి బయటకు కక్కటానికి వీలు కాలేదు. అది ప్రాణ భయంతో గింజుకోవడం మొదలుపెట్టింది. విలవిల తన్నుకొంది. ఊపిరి అందక బాధ పడింది. దాని యమయాతన చూచి గోపాలుడే జాలిపడ్డాడు. తానే వెలుపలకు వచ్చి కొంగ ముక్కు పట్టుకొని, నిలువునా చీల్చేసాడు. నెత్తురు మడుగు కట్టింది. బకాసురుడు గోపాలుని చేతిలో మోక్షం పొందాడు. కంసుడు పంపిన రాక్షసులు ఒక్కొక్కరుగా అంతమై పోతున్నారు.



దారి కాచిన కొండ చిలువ

బకాసురుని మరణం అతని తమ్మునికి బాధ కలిగించింది. గుండె కోత పడింది. వాడి పేరు అఘాసురుడు. యింక యిది మార్గం కాదని యీసారి యీ రాక్షసుడు కొండ చిలువ రూపం ఎత్తాడు.

గోపాలుడు ఆలమందల్ని కాచుకునేందుకు వచ్చేదారి కాసాడు. ముందుగా వచ్చిన వీరిని, వచ్చినట్లు మ్రింగి వేయటం మొదలెట్టాడు. కృష్ణుడు కూడా వారితో పాటు అమాయకునిలా వచ్చాడు. అతనిని కూడా కొండ చిలువ రూపంలో వున్న అఘాసురుడు మ్రింగివేసాడు.

అయితే యీ నల్ల పిల్లవాడు మళ్లీ దానికి గొంతులో అడ్డం పడ్డాడు. కృష్ణుడు దాని గర్భంలోకి ప్రవేశించి పొట్టను చీల్చేసాడు.

కంసుని మిత్రుడైన అఘాసురుడు కూడా చనిపోయాడు!

చీలిన పొట్టలోనుంచి గోపబాలకులు అందరూ బయటికి వచ్చారు!

వారందరికి అతడు ఎన్నోసార్లు ప్రాణదానం చేసాడు! యిన్ని ఘనకార్యాలు సాధించినప్పటికీ అతని వయస్సు ఐదు సంవత్సరాలు మాత్రమే.

కాళింది - మడుగు

యధా ప్రకారంగా కృష్ణుడు బృందావనంలో వున్నాడు. దగ్గరలోనే ఒక చెరువు వుంది. ఒక రాక్షసుడు పాము రూపంలో తన భార్యలతో అక్కడ కాపురం వుంటున్నాడు. అతని నోటి నుంచి వచ్చే విషం వలన మడుగులోని నీరు పనికి రాకుండా పోయింది. ఆ నీటిని త్రాగి మనుషులు కొందరు మరణించారు. పశువులు ఎన్నో చనిపోయాయి.


ఆ ప్రాంతాలలో కాళింది మడుగు దగ్గరకు వెళ్లాలంటే అందరికీ భయం పట్టుకుంది.

కృష్ణుడు స్నేహితులతో ఆటలాడుకుంటూ ఆ మడుగు ప్రాంతాలకు వెళ్ళాడు. ఆడి ఆడి వారు అలసిపోయారు. గోపకుమారులందరికీ దాహమైంది. మంచినీరు కావలసి వచ్చింది. ఒక్కొక్కరుగా మడుగులోనికి దిగి ఆ నీటిని త్రాగారు. త్రాగిన వారు త్రాగినట్లుగా చనిపోతున్నారు. కొంతసేపటికి యిలా జరుగుతోందని నందగోపాలుడు తెలుసుకొన్నాడు. వెంటనే తన మిత్రుల కోసం మడుగులోకి అడుగుపెట్టాడు.

రాక్షసుడైన కాళీయుడు విషం క్రక్కుతూ ఉరికి వచ్చాడు. భయంకరమైన ఏడు పడగలు విప్పి ఫూత్కారం చేసాడు. కృష్ణుడు ఎగిరి కాళీయుని పడగల మీదికి ఎక్కాడు. పడగల మీద శ్రీ కృష్ణుడు తాండవం చేసాడు. అతని అడుగు పడిన తరువాత కాళీయుని నోటి నుంచి యిప్పుడు విషం రావటం ఆగిపోయింది. దానికి బదులుగా నెత్తురు ధారలుగా పడుతోంది. కాళీయుని శిరస్సు నుగ్గు నుగ్గు అయ్యింది. ప్రాణ భయంతో ఆర్తనాదం చేసాడు. కాళీయుని భార్యలు భర్త దుస్థితి విని భార్యలంతా పరుగుపరుగున వచ్చారు.

పడగల మీద తాండవం చేసే తాండవకృష్ణుడు వీరికి తేజోరూపంతో దేవుని వలె కనిపించాడు. వారు రెండు చేతులెత్తి నమస్కరించారు.

''దేవా! మా భర్త ప్రాణాలను కాపాడు! అని ప్రార్థించారు. ''మనుషులు తిరిగే యీ చోటును మీ వంటి విషనాగులు వుండరాదు. వెంటనే మీ భర్తను తీసుకొని ఈ చోటు విడిచి వెళ్లిపోతామంటే, మీకు ప్రాణభిక్ష పెడతాను'' అని కృష్ణుడు వరమిచ్చాడు.



అతని ఆజ్ఞననుసరించి కాళీయుని కుటుంబం, ఆ చోటు విడిచి వెళ్ళిపోయింది. అది మొదలు ఆ చెరువులో నీరు త్రాగేందుకు ఎవరు భయపడలేదు. త్రాగినా ఎవరు చనిపోలేదు. యింతటి గొప్పపనిని సాధించిన చిన్ని కృష్ణుడ్ని అందరూ పొగడ్తలతో ముంచెత్తారు.

యశోదానందులు తమ కుమారుడు సాధించిన యీ విజయాన్ని విని ఎంతో ఆనందించారు.

ఊరగాయ పసందు

యమునా తీరాన, బృందావనం సమీపాన ఎందరో మునులున్నారు. మునికాంతలున్నారు. మునికన్యలు కూడా వున్నారు. వీరు నిశ్చలంగా తమ జీవితాలను సాగిస్తున్నారు. అది అంతా అడవి ప్రాంతం. కృష్ణుడు అన్ని చోట్ల తిరుగుతుంటారు. ఒక రోజు మిత్రులతో కలసి మునివాటికకు వచ్చాడు. చాలా సేపు అడవిలో హాయిగా ఆటపాటలు సాగించారు. తరువాత వారికి ఆకలి అనిపించింది. దప్పిక కూడా ఎక్కువగా అయ్యింది.

కృష్ణుడు డీలాపడిపోయిన గోపకుమారులను చూచి, వారు అలసిపోయారని తెలుసుకున్నాడు.

''ఈ దగ్గరలో ఒక మునివాటిక వుంది. అక్కడకు వెళ్ళి మునికాంతలను బ్రతిమాలి తినేందుకు ఏదైనా యిమ్మని అడగండి'' అని వారిని మునివాటికకు పంపించాడు. గోపబాలకులు శ్రీకృష్ణుని సూచన మేరకు మునివాటిక దగ్గరకు వెళ్ళారు.

మునికాంతలను తినేందుకు ఏదైనా పెట్టమని బ్రతిమాలారు. ఒక ముని వీరి మాటలను విని త్రిప్పి కొట్టాడు. ఏదైనా పెట్టేందుకు నిరాకరించి వెనుకకు పంపించాడు. విచారం నిండిన ముఖాలతో గోపబాలురు తిరిగి వచ్చారు. అయితే శ్రీ కృష్ణుడు నిరుత్సాహ పడలేదు.

''మీరు మళ్ళీ వెళ్ళండి. యీసారి ముని కన్యలను ఏదైనా పెట్టమని అడగండి. వారు పెట్టేందుకు ముందుకు రాకపోతే అక్కడ కృష్ణుడున్నాడు అతనికి ఆకలిగా వుంది. అని చెప్పండి!''

గోపకుమారులు మళ్ళీ మునివాటికకు వెళ్ళారు. మునికన్యలు హాయిగా ఆడుకుంటున్నారు. వారు గోపాలురు రాక చూచి కారణం అడిగారు. అక్కడ కృష్ణుడు వున్నాడు. అతనికి ఆకలిగా వుంది. మీరు ఏదైనా యివ్వండి?!'' అని గోపాలురు ప్రశ్నించారు. యీ మాటలు విన్ని మునికన్యలు పులకించిపోయారు.

ఆ కృష్ణుని కథలు ఎన్నో విన్నాము. రేపల్లెలో గోప భామలు అతని చుట్టూ చేరి రాసలీలలు ఆడుకుంటారట! అతడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమేనట! అంతటి వాడు మా చేతి వంటలు అడిగి పెట్టించుకొని తింటాన్నంటే అంతకన్నా మాకు కావలసిందేముంది? అని పొంగిపోయారు. మునికన్యలు అతనిని తలచుకుంటూ ఎన్నో పిండివంటలు చేసారు.

పాయసం కాచారు. మంచి మంచి దోరమాగిన పండ్లు కూడా అందించారు. ''గోప బాలకులారా! శ్రీకృష్ణునికి యీ మునికన్యల మాట ఒకటి అందించండి. కృష్ణా! నీవు మాకు ఎప్పుడు కనిపిస్తావు? మాటలతో పాటు వారి మాటలు కూడా తీసుకొని గోపాలురు తిరిగి వచ్చారు.

ముని కన్యల మనసులోని మాధుర్యం, పిండివంటలలో రుచి చూస్తూ విందు ఆరగించారు.

వీరి వేడుకోలు విన్న కృష్ణుడు ఆ సమయం వచ్చినప్పుడు కనిపించడం నా వంతు అందాకా ఎదురు చూడటం మునికన్యల వంతు అని అనుకొన్నాడు. క్రమంగా కృష్ణుడు పెరిగి పెద్దవాడవుతున్నాడు.

గోవర్ధన గిరిధారి

యదు వంశం ఎంతో గొప్పది వారు రాజ్యాలు ఏలారు. పరాక్రమంతో యుద్ధాలు చేసారు. క్షత్రియులతో తలపడి వారిని ఓడించారు. అయినా యాదవుల ముఖ్య వృత్తి వ్యవసాయము. ఉపవృత్తి పశుపోషణ. సక్రమంగా వర్షాలు పడితే పంటలు బాగా పండుతాయి. వర్షాలను కురిపించేవాడు యింద్రుడు. ప్రతి సంవత్సరము యాదవులు ఒక చోట చేరి ఇంద్రాయాగం చేస్తారు. దాని వలన ఇంద్రుడు కరుణించి సక్రమంగా వానలు కురిపించి, పంటలు పండిస్తారని వారి నమ్మకం. ఈసారి కూడా యింద్ర యాగం చేయాలని యాదవులు తలపెట్టారు.

ఆ విషయం ముందుగా కృష్ణునికి చెప్పారు. అయితే కృష్ణుడు యింద్ర యాగం చేయడానికి ఒప్పుకొనలేదు. అతడు యాదవులతో యిలా అన్నాడు. ''యాదవులంతా పాడిపంటల మీద బ్రతుకుతున్నారు. భూములు పంటలు పండిస్తాయి. ఆవులు పాలు కురిపిస్తాయి. వాటితో బ్రతుకుతున్న మనం వాటినే పూజించాలి. ఇంద్రుడు వర్షం కురిపించడం మన మీద దయతో కాదు. అది ప్రకృతి ధర్మం. కనుక ఈ సారి మనం ఇంద్ర యాగం చేయటం లేదు. గో పూజలు చేస్తున్నాము. భూమి పూజలు చేస్తున్నాం''.

యీ మాటలు యాదవులందరికీ నచ్చాయి. అతడు చెప్పిన ప్రకారం గోపూజలు భూమి పూజలు మొదలెట్టారు. ప్రకృతిని ఆరాధించారు. ఇంద్రుడు మూడు లోకాల నాయకుడు. కొంటె కృష్ణుని తుంటరి సలహా విని, యాదవులు చేసిన యీ పని అతనికి ఎంతో బాధ కలిగించింది.

ప్రకృతి సహజమైన వర్షానికి బదులు అతడు రాళ్ళ వానను కురిపించాడు రేపల్లె మాత్రమే కాదు. యాదవ కుల మంతట కలకలం చెలరేగింది. వీరు దిక్కులేకుండా పోవటానికి ఇంద్రుడు అనేక ప్రకృతి విపరీతాలు కల్పించాడు. బృందావనం భీభత్సం అయ్యింది! గోపాలురు భయపడ్డారు.

వీరికి తెలిసిన దేవుడు కృష్ణుడే! వెళ్ళి అతనిని ఆశ్రయించారు. కృష్ణుడు వారిని కాపాడటానికి, ఒక దారి చూపించాడు. ''మీరంతా భయపడకండి! మిత్రులారా! యిక్కడకు సమీపంలో గోవర్ధన పర్వతం అని ఒకటుంది కదా! దానిని నేను పైకి ఎత్తి మీకు రక్షణ కలిగిస్తాను! ఎప్పుడైతే కృష్ణుడు యీ మాటలు చెప్పాడో గోపబాలకులంతా ఆలమందల్ని తోలుకుని బిలబిలమంటూ గోవర్ధన గిరి దగ్గరకు పరుగులు తీసారు!



కృష్ణుడు పర్వతాన్ని పైకెత్తి చిటికెన వేలు మీద నిలబెట్టాడు గోపబాలురు, వారి ఆవులు, అందరూ దాని క్రింద తలదాచుకున్నారు. ఆ విధంగా ప్రకృతి విలయం ఏడు రోజులు సాగింది! కృష్ణుడు కొంచమైనా అలసిపోలేదు.

ఇంద్రుడు తాను యిక ఉపేంద్రుని చేయగలిగినదేమీ లేదని తలనువంచాడు! ప్రకృతి విలయం ఆగిపోయింది! గోపాల బాలకులు అంతా వెలుపలకు వచ్చిన గోవర్ధన గిరిని క్రిందికి దించాడు శ్రీకృష్ణుడు.

ఇంద్రుడు సిగ్గుపడి ఉపేంద్రుని దగ్గరకు వచ్చాడు. అతడు తెల్లని ఏనుడు అయిన ఐరావతం మీద వచ్చాడు. స్వర్గలోకం నుంచే పూలు తెచ్చాడు. ఆ మాలలు ఐరావతం తొండంతో పుచ్చుకొని, కృష్ణుని మెడలో అలంకరించింది.

శ్రీకృష్ణుడే పరమాత్మ అని ప్రకటించి ఇంద్రుడు వెళ్ళిపోయాడు! రేపల్లెలో చిరునవ్వులు మళ్ళీ కనిపించాయి.

మోహన వంశీ

కృష్ణుని చేతిలో ప్రాణం లేని వెదురు పుల్ల, ఒక వేణువుగా మ్రోగింది. అతడు ఆలపించిన వేణుగానం తిరుగులేని సమ్మోహన శక్తి! ఎవరినయినా పట్టిలాగుతుంది. ఆ వేణుగానం వింటే ఆవులు ఎక్కువగా పాలిస్తాయి. ఆడపిల్లలు మక్కువగా అతని చుట్టూ చేరుకొంటారు.

ప్రకృతి క్రొత్త చివుళ్ళు తొడుగుతుంది! ఆకాశంలో తేలిపోయే మబ్బులు ఆగి అతని పాట వింటాయి! ఎగిరి పోతున్న పక్షులు తిరిగి వచ్చి కొమ్మల మీద వాలి కూర్చొని ఆ గానం నేర్చుకొంటాయి. పాములు తలలాడిస్తాయి. అరవిచ్చిన మొగ్గలు పాటకోసం రేకులు విచ్చి ఎదురు చూస్తాయి.

ప్రాణం లేదు అనుకొన్న చెట్లు, పుట్టలు వేణుగానం విన్నప్పుడు పులకిస్తాయి. స్నేహితులందరూ అతనీ పాట విని హాయి హాయి అనుకొంటారు.


బృందావనం అందానికి ఒక నందనవనం అయితే దానికి ప్రాణం యీ వేణునాదం. అది పరమాత్మ పెదవుల మీద పులకించిన వేదం యింక గోప భామల సంగతి! వేణుగానం వినగానే వారు యిల్లు వదలి పారిపోయి వచ్చేస్తారు!

బిడ్డకు చనుబాలు త్రాగించే తల్లి, అలా వదలి వచ్చేస్తుంది. పడక మీద భర్తను చేరిన గోపకాంత వేణువు పలకగానే పారిపోయి వచ్చేస్తుంది.!

గోప వనితలందరూ గానలోలుని చుట్టుముట్టి పొగడ్తలతో ముంచెత్తుతారు! అతనితో కలిసి ఆడుకొంటారు! పాడుకొంటారు! కృష్ణుని పాట ముందు జీవితాలను అర్పించు కుంటారు! అతడు పురుషుడు! వారంతా ప్రకృతి! వేణువు వారి మధ్య ప్రేమ వారధి! ఎంతకాలం అలా కరిగిపోతుందో గానం ఆగిపోయాక మరో లోకం నుంచి తిరిగి వచ్చిన వారిగా తమ పనులలోకి వెళ్ళిపోతారు!

రేపల్లె అంతా కృష్ణమయం! అదే వారి రాసలీల!

ఆలోచనలు ఆకృతిని పొందే అద్భుత లోకం!



అక్రూరుడు

శ్రీ కృష్ణుని చంపాలనుకొన్న కంసుడు మధురానగరంలో వున్నాడు. అతడు కృష్ణుని కథలన్నీ వింటున్నాడు. గుండెలు మండుతున్నాయి. కంసునికి యిందరు రాక్షసులు చనిపోయాక కొంత భయం కూడా కలిగింది. బలరామకృష్ణులు శక్తివంతులు అయినందుకు పగరగిలింది.

వారిని చంపటం యిక తన అనుచరుల వల్ల అయ్యేపనికాదని అతను నిర్ణయించుకొన్నాడు. వారిని చంపేందుకు తనే స్వయంగా పూనుకోవాలి. అందుకోసం ఒక ఎత్తుగడ వేసాడు.

మధురానగరంలో ధనుర్యాగం జరుగుతోందని ప్రకటించాడు.

వీరవిద్యలు ప్రదర్శించే వారికి అదొక మంచి అవకాశం! యీ విషయం అన్ని చోట్ల చాటించారు.

శక్తి వున్న వారు అందరూ పోటీలలో పాల్గొనవచ్చును. కంసుడు అన్ని దేశాలకు వార్తలు పంపుతూ తన కోరిక తీర్చుకునేందుకు బృందావనానికి కూడా కబురు పంపించాడు. అక్రూరుడు రాయబారి.

బలరామునికి, కృష్ణునికి యీ వార్త ప్రత్యేకంగా చెప్పమని కంసుడు సూచించాడు. యీ వార్తను వారికి ప్రత్యేకంగా చెప్పాలి అని అక్రూరుడు కూడా అనుకొన్నాడు.

కంసుడు ద్వేషంతోనూ, అక్రూరుడు భక్తితోనూ ఒకే అభిప్రాయానికి వచ్చారు.

రాయబారి బృందావనానికి బయలుదేరాడు. వార్త అందరికి అందించి, బలరామకృష్ణుల్ని ప్రత్యేకంగా కలుసుకున్నారు. వారికి మనసారా నమస్కరించాడు.

''మధురానగరంలో ధనుర్యాగం జరుగుతోంది. దేశదేశాల వీరులందరూ పాల్గొంటున్నారు. మీరు కూడా రావలసిన సమయం యిదే'' అని చెప్పాడు.

అతని సూచన ఏమిటో వారికి అర్థమయింది.

తప్పకుండా మధురానగరం వచ్చి ధనుర్యాగంలో పాల్గొంటామని వాగ్దానం చేసారు.

అక్రూరుడు యీ వార్త తీసుకొని సంతోషంగా వెళ్ళిపోయాడు.

మధురానగరం

నగరమంతా కళకళలాడుతోంది. దేశ విదేశాల వీరులు ఎందరో వచ్చారు.

వీర విద్యలలో పోటీలు పెట్టడం రాజులకు అలవాటు.

అయితే యీ సాంప్రదాయాన్ని బలరామకృష్ణులను చంపేందుకు ఒక ఎత్తుగడగా ఒక అవకాశంగా కంసుడు ఆలోచించాడు. నగరంలోకి ప్రవేశించాడు. నగరంలో ప్రవేశించిన యాదవ సోదరులు వీధులన్నీ తిరిగి చూచారు.

''రాజదుస్తులు ధరించాలని వుంది. మాకు యివ్వవా!'' అని బలరామకృష్ణులు అడిగారు.

వీరిని చూచి ఒక చాకలి, ''ఎగతాళిగా నవ్వాడు ఆలమందలు కాచుకుంటూ ఆడపిల్లలతో ఆడుకొంటూ అల్లరి చిల్లరిగా తిరిగే మీకు రాజదుస్తులు ఎందుకు. అర్హత లేని వానికోసం ఆశించకండి'' అని అన్నాడు. ఈ మాటలు రాజవీధిలో నిలబడి వింటున్న నలుగురు నవ్వారు.

కృష్ణుడు కోపంతో బుసకొట్టాడు. చాచి ఒక దెబ్బ కొట్టగానే వాడు నేలమీద పడిపోయాడు. ప్రాణాలు వదిలేసాడు.

చనిపోయిన తరువాత అతని అసలు రూపం బయటపడింది. వాడొక రాక్షసుడు. కంసుడు పంపగా యదుసోదరులతో తగవు పెట్టుకొని వారిని మట్టుపెట్టాలని వచ్చాడు. అతడు చనిపోయిన తరువాత తమకు కావలసిన పట్టు దట్టీలు, రాజదుస్తులు తీసుకొని బలరామకృష్ణులు వాటిని ధరించారు. ఆ విధంగా వారి కోరిక తీరింది.

శాప విముక్తి

అన్నదమ్ములు నగరం చూస్తూ మరొక వీధిలోకి వచ్చారు. అక్కడ చాలా అంగళ్ళు ఉన్నాయి. వాటిలో పువ్వుల దండలు అమ్ముతున్నారు. బలరామకృష్ణులు ఒక అమ్మాయిని చూసారు. ఆమె పేరు కుబ్జ. రకరకాల పువ్వులు అడిగిన వారికి అమ్ముతుంది.

దండలు కట్టడంలో ఆమె చాలా నేర్పు కలిగిన యువతి. అయితే ఆమె ఎంతో అంద వికారంగా వుంది. అలంకారాలు చేయటంలో ఆమె బహునేర్పరి. వీపున ఏదో బరువు వుంచినట్లు వంగి నడుస్తుంది. ఆ యువతికి గూనితనం వుంది. బలరామకృష్ణులు ఒక మాలకట్టి ఇమ్మని అడిగారు. వారెవరో కుబ్జ తెలుసుకుంది.



తన నికృష్ట జీవితంలో వారు కన్పించడమనేది ఒక వరం. వెంటనే వారికి పూలు, దండలు ఇచ్చింది. సుగంధ ద్రవ్యాలను బట్టలకు పులిమింది. ఎంతో ప్రేమ చూపించి ఆదరించింది.

కృష్ణుడు అందవికారమైన ఆ శరీరంలో ఎంత అందమైన మనసు వుందో గుర్తించాడు. దగ్గరకు రమ్మని చేరపిలిచాడు. కుబ్జ కృష్ణుని పాదాల దగ్గరకు చేరుకుంది.

చేతితో అతడామెను తాకి వీపు సవరించాడు. పరమాత్ముని అనుగ్రహం ఆమెకు ఫలించింది. అంద వికారమైన శరీరం, ఎంతో అందంగా మారింది.

భగవానునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ సాష్టాంగపడిపోయిందామె. శ్రీకృష్ణుని చేతి స్పర్శ తనకు అందించిన కొత్త జీవితాన్ని అనుభవించేందుకు ఎన్నో కానుకలిచ్చి వెళ్ళిపోయిందామె.

నగరంలో ఏ మూలకు వెళ్ళినా ఇలాగే ఏదో ఒక విచిత్రం జరుగుతుంది.

బలరామకృష్ణులు కారణ జన్ములు అయి వుంటారనే ప్రచారం మధురానగరంలో నాలుగు మూలల పాకింది.

అందరూ వారినే చిత్రంగా చూస్తున్నారు.

ఏనుగుతో పోరాటం

మూరు మూలలు విడిచిపెట్టి అన్నదమ్ములు రాజవీధికి చేరుకున్నారు. రాజసౌధానికి కూడా దగ్గరలోనే వున్నారు. ధనుర్యాగం పోటీలు జరిగే చోటు అక్కడకు మరెంతో దూరంలో లేదు.

కోటలోకి ప్రవేశించాలని బలరామకృష్ణులు ప్రయత్నం చేస్తున్నారు.

ఆ సమయంలో ఒక ఏనుగు వారి మీదకు వచ్చింది దాని పేరు కవలయాపీడం.

కవలయా పీడం

ఇంద్రుని ఐరావతంలాగా చాలా ఎత్తుగా బలంగా వుంది. అన్నదమ్ములను తొండంతో ఎత్తి కొట్టాలని అది ప్రయత్నించింది.

వాస్తవానికి మనుష్య బలం దాని ముందు ఎందుకూ కొరగాదు. నేర్పుచూపి తప్పుకొన్నారు.

ఇద్దరూ దాని కుంభ స్థలంలోనికి చేరుతున్నారు. దాని కుంభస్థలాన్ని పిడికిళ్ళతో బాది బ్రద్దలు కొట్టారు. అది భయంకరంగా అరచి కొండలా నేలమీదికి వాలిపోయింది.

ప్రజలు ఆ దృశ్యాన్ని చూచి హాహాకారాలు చేశారు. ఇది కూడా కంసమామ కల్పించిన మాయ!

నగరంలోకి వచ్చాక అతడు అడుగు అడుగున వారికి ఆపదలు కల్పించాడు. వాటిన్నింటిని సోదరులను జాగ్రత్తగా తప్పించుకున్నారు.

బలరామ కృష్ణులు ఏనుగు దంతాలను కోరారు. చెరొకటు భుజాన పెట్టుకున్నారు.

పల్లెసీమల నుంచి వచ్చిన యాదవ యువకులతో కలిసి అతి సాధారణమైన యువకుల లాగానే వారు కోట ఆవరణలోకి చేరుకున్నారు.

చాణూర ముష్టికులు


ధనుర్యాగం తాలూకు వీరవిద్యల ప్రదర్శన జరుగుతోంది. అప్పుడే ఇద్దరు మల్లులు బరిలోకి ప్రవేశించారు. తొడ చరచి నిలబడ్డారు.

రామకృష్ణులను చంపించేందుకు వారిని ప్రత్యేకంగా తీర్చిదిద్దాడు కంసుడు! వారి శరీరాలు కొండల మీద బండరాళ్ళ వలె వున్నాయి.

వారి పేర్లు చాణూరముష్టికులు. మాతో పోటీ చేయగల వారు ఎవరూ లేరా? అని వారు ప్రశ్నించారు.

ఈ ప్రశ్న వింటూనే బలరామకృష్ణులు రంగంలోకి దిగిపోయారు. మల్లయుద్ధంలో ఎన్నో మెళకువలు వుంటాయి.

అవన్నీ చాణూర ముష్టికులు కృష్ణుడో నేర్చుకొన్నాడు. చిన్న బాలురు వారిని ఎదిరించడం చూచే వారికి ఎంతో వింతగా వుంది.



కొండల మీద పిడుగులు పడినట్లు బలరామకృష్ణులు వారిపై విజృంభించారు. పిడికిళ్ళు బిగించి బలమైన దెబ్బలు కొట్టి వారిని బాధించారు. క్రమంగా బలరామకృష్ణుల బలం పెరిగింది. చాణూర ముష్టికుల బలం తగ్గిపోయింది.

చివరకు కొండల వంటి శరీరం కలిగిన ఆ ఇద్దరు నేల మీదికి పడిపోయారు. ఎందరో మల్లులని జయించిన బలవంతులు అలా చనిపోవడం కంసుడ్ని ఎంతగానో బాధించింది.

ప్రజలు సంతోషంతో చప్పట్లు కొట్టారు.

రాక్షస వధ

వారు గెలిచారని విని సంతోషించవలసిన మేనమామ కంసుడు చాలా దుఃఖించాడు.

అతని దుఃఖం కోపంగా మారింది. కాని బలహీనుడి కోపం ఏమి చేయగలదు.

అన్నదమ్ములిద్దరు అజేయులుగానే కన్పిస్తున్నారు. వారిని ఏమి చేయలేని స్థితిలో పగ తీరక వారి తల్లిదండ్రులను హింసించాలని అనుకొన్నాడు కంసుడు.

చెరసాలలో మగ్గుతున్న వసుదేవుడ్ని దేవకీ దేవిని తండ్రి అయిన ఉగ్రసేనుడు మొదలయిన వారందర్ని చిత్రహింసలు పెట్టమని చెప్పాడు.

అతనికి అంత్యకాలం సమీపించింది. విచక్షణా జ్ఞానము నశించింది.

కారాగారంలో బాధలు పడుతున్న వారు ఎవరో కాదు. అతని చెల్లి, బావగారు కన్న తండ్రి మొదలయినవారు.

ఈ విషయం తెలిసి బలరామ కృష్ణులు మండిపడ్డారు. ఇక రాక్షసుని తక్షణమే చంపివేయాలని తీర్మానించుకొన్నారు. కృష్ణుడు నేరుగా అతని మందింలోకి వెళ్ళి యుద్ధానికి పిలిచాడు.

కంసుని మేనల్లుని చంపేందుకు చాలా ప్రయత్నించాడు కాని అతని చేతిలో ప్రాణాలు పోగొట్టుకొనక తప్పలేదు.

ఈ వార్త విని దేవతలు ఆనందించారు. రాక్షస పరిపాలన అంతమయినందున రాజ్యమంతా పండుగ చేసుకొన్నారు.

గురుభక్తి

ముందు బలరామకృష్ణులు చదువులు నేర్చుకోవాలి. అందుకోసం ఒక గురువు కావాలి.

సాందీపుడు చాలా గొప్ప గురువు. అతనిది ఉజ్జయిని నగరం. చాలా మంది శిష్యులను విద్యావంతులను చేసాడు. కుచేలుడు వారి సహపాఠి. చదువులు నేర్చుకునేందుకు అన్నదమ్ములిద్దరూ అక్కడ చేరారు. చదువులలో ఉండే రహస్యాలను తెలుసుకున్నారు. రాజనీతి, వేదాంతము తెలిసింది. అన్ని విద్యలు వారికి వచ్చాయి.

చదువులు పూర్తి చేశారు. గురువు గొప్పవాడు. శిష్యులు కూడా గొప్పవారు అయినారు.

తిరిగి వెళ్ళే ముందుగ గురుదేవా! మీకు గురు దక్షిణ ఏమి కావాలి అని వారు ప్రశ్నించారు. సాందీపుడు ఒక అసాధ్యమయిన కోరిక కోరాడు.



''నాయనలారా! నా కొడుకు సాగర గర్భంలో మునిగి చనిపోయాడు. తిరిగి వాడిని తెచ్చి నాకు అప్పగించగలరా!''

అవునంటూ అన్నదమ్ములు బయలుదేరారు. గురువు కుమారుని కోసం సముద్రమంతా వెతికారు. వాడు యమలోకంలో ఉన్నాడని తెలుసుకున్నారు. బలరామకృష్ణులు నేరుగా యమలోకం వెళ్ళారు.

యమధర్మరాజుని గురుపుత్రుడు విడుదల కావాలని వారు కోరారు. గురుదక్షిణ యిచ్చి తీరాలని పట్టుకొన్నారు. యముడు ఎంతో సాదరంగా బాలుడ్ని వారికి అప్పగించాడు. సగౌరవంగా సాగనంపాడు.


భూలోకానికి తిరిగి వచ్చి గురువుకు పిల్లవాడ్ని అప్పగించారు. ఆ దంపతులు వారిని మనసారా ఆశీర్వదించారు. విద్యతోపాటు మరొక విజయాన్ని వెంట తెచ్చుకొని వారు మధురానగరం చేరుకున్నారు.

బలరామకృష్ణుల రాక మధురానగర ప్రజలకు పండుగ అయింది.

బలరాముడి పరాక్రమము

మధురానగరానికి ఇరుగు పొరుగు రాజ్యాలలో మగధ కూడా ఒకటి. దానిని జరాసంధుడు అని ఒక రాజు పరిపాలించుతున్నాడు.

జరాసంధుడు కంసునికి మామ, కృష్ణుని మీద పగబట్టాడు. అల్లుడిని చంపిన కోపం తీర్చుకోవాలని మధుర మీదికి దండెత్తాడు. అతనిని పెద్ద సైన్యం ఉంది.



మొత్తం సైన్యాన్ని బలరాముడు ఒక్కడే ఎదుర్కొన్నాడు. నాగలి ఆయుధంగా ధరించి విరోధులను చంపేసాడు. రోకలి తీసుకొని శత్రువులను తలలు బ్రద్దలు కొట్టాడు. మగధ సైన్యాలు పారిపోయాయి.

బలరాముడు అంతటితో ఆగలేదు. జరాసంధుని మీద విరుచుకు పడ్డాడు.

అతని జెండా విరుగ గొట్టాడు.

గుర్రాలను సారధిని చంపేసాడు.

ఆయుధాలను నుగ్గు నుగ్గు చేసాడు.

ఇంకా కసితీరక తన మామకు మామ అయిన జరాసంధుడ్ని పట్టి బంధించాడు.

అతని చంపి వేయాలని చూచే సమయంలో శ్రీ కృష్ణుడు వచ్చి అడ్డుకొన్నాడు.

అతని మరణం ఇప్పుడు కాదు. అని చెప్పాడు. అంతటితో బలరాముని కోపం దిగి పోయింది.

అవమాన భారంతో జరాసంధుడు తిరుగు ముఖం పట్టాడు. బలరాముని అసాధారణ బలం గురించి రైవతుడు విన్నాడు. అతనికి బలరామునికి బంధుత్వం కలుపుకోవాలని అనిపించినది. తన కుమార్తె రేవతిని ఇచ్చి పెండ్లి చేసాడు.

రుక్మిణీ ప్రేమకథ

అది విదర్భ దేశం. దానికి రాజు భీష్మకుడు. అతనికి అయిదుగురు కొడుకులు ఉన్నారు. ఒక కుమార్తె ఉంది.

రుక్మి, రుక్మరథ, రుక్మబాహు, రుక్మకేళి, రుక్మముఖి అనువారు కొడుకులు.

రుక్మిణి వారి ఇంటి ఆడపడుచు. అందాల హరివిల్లు! సుగుణాలు అన్నీ కలిసి ఆమెకు వన్నె తీసుకు వచ్చాయి.

రుక్మిణి శ్రీకృష్ణుని కథలన్నీ జనులు చెప్పుకుంటూ ఉండగా విని అతనిని ఆరాధించింది. అంతటి బలశాలి. శక్తి శాలి తనకు భర్త కావాలని కోరుకుంది. అతడే తగిన వరుడని నిర్ణయించుకుంది.

యుక్తవయసు వచ్చిన తరువాత రుక్మిణికి సంబంధాలు చూడటం మొదలెట్టాడు.

శిశుపాలుడు అనే రాజు ఆమె అన్నలకు మంచి మిత్రుడు. కాని అతని మీద ఆమెకు మనసు లేదు. అగ్నిద్యోతనుడు వారి పురోహితుడు.

అన్నలు చేసే ప్రయత్నాలు ముమ్మరం అయినాయి. ఆమె పురోహితుని పిలిచి కృష్ణుని దగ్గరకు రాయబారం పంపించింది.

అగ్నిద్యోతనుడు కృష్ణునికి రుక్మిణి గుణగణాలను వర్ణించి చెప్పాడు. ఆమె నిన్ను కాక మరెవరిని మనసులో తలచదు. కనుక తీసుకుపోయి వివాహం చేసుకో'' అని హితవు చెప్పాడు.

శ్రీకృష్ణుడు అందుకు అంగీకరించాడు. రుక్మిణి వారి యింట ఆచారం ప్రకారం పెళ్ళికి ముందు నగరం పొలిమేరల మీద ఉన్న గౌరీదేవి ఆలయానికి పూజచేయటానికి వెళ్ళింది.

రాయబారంలో నిర్ణయించుకున్న ప్రకారం శ్రీకృష్ణుడు అక్కడకు వచ్చాడు. తీసుకుపోయి రాక్షస పద్ధతిలో పెళ్ళి చేసుకోవాలి.

ఆమెకు చేయి అందించి రథం మీదికి తీసుకున్నాడు. రుక్మిణి రథం ఎక్కి కోరుకున్న వరుడితో పెళ్ళి జరిపించుకోవడానికి బయలుదేరింది. ఈ వార్త నగరంలో అందరికి తెలిసింది. ఆమె అన్న రుక్మి మండిపడ్డాడు.

శ్రీ కృష్ణుని చంపేస్తానని శపథం చేసి శిశుపాలుడు వెంటరాగా యుద్ధానికి వచ్చాడు.

రథం నడిపే బాధ్యతను రుక్మిణికి అప్పగించి వాసుదేవుడు వారితో యుద్ధం చేశాడు.

వారిని ఓడించటమే కాకుండా రుక్మిణి కోరిక మేరకు ప్రాణభిక్ష పెట్టి అవమానించి పంపేశాడు. ద్వారకా నగరం చేరుకున్నారు.

రుక్మిణీ, శ్రీకృష్ణుల వివాహం జరిగింది.

అన్నలను కన్నవారిని కాదని వచ్చిన రుక్మిణి దేవిని శ్రీకృష్ణుడు అగ్ర భార్యగా స్వీకరించాడు.

వారికి పవిత్ర దాంపత్యంలో ఒక కుమారుడు కలిగాడు. అతని పేరు ప్రద్యుమ్నుడు.

రుక్మిణీదేవి ప్రేమ కథ లోకాలకు ఆదర్శవంతమయినది! మనసుపడిన మగవాడి కోసం స్త్రీలు ఎంత త్యాగానికయినా, సాహసానికయినా పూనుకుంటారని ఆమె లోకానికి చాటింది. అయితే శ్రీకృష్ణుని కళ్యాణ కథ ఆమెతో ఆగలేదు.

చవితి చందమామ కథ

సత్యభామ నెరజాణ. ఆమెకు ఎంత అందం ఉందో అంత తెలివి కూడా వుంది. తండ్రి పేరు సత్రాజిత్తు. అతనిది బ్రహ్మదేశం. చాలా శక్తి కలవాడు.

ఎన్నో సంవత్సరాలు సూర్యదేవుని ఆరాధించాడు. సూర్యుడు ప్రత్యక్షమై అతనికి ఒక మణిని యిచ్చాడు. దాని పేరు శమంతకమణి.


అది ప్రతిరోజూ నూరు బారువుల బంగారాన్ని యజమానునికి అందిస్తుంది. అతడు దాని సాయంతో అమిత సంపన్నుడు అయిపోయాడు.

సాటి రాజులలో ఎదురు లేనివాడు అనిపించుకున్నాడు. అతనికి ఒక సోదరుడున్నాడు. పేరు ప్రసేనజిత్తు! అరణ్య మార్గాన వేటకు వెడుతూ ప్రసేన జిత్తు అది మెడలో ధరించి వెంట తీసుకుపోయాడు. వేట కార్యక్రమంలో ఉండగా ఒక సింహం అతనిని చంపింది.

ఆ ప్రాంతాలలో తిరుగుతున్న చిరంజీవి రామాయణ కాలం నాటి జాంబవంతుడు చూచాడు! మణిని తనతో తీసుకుపోయాడు.

అతని కుమార్తె అయిన జాంబవతికి ఆ మణిని బహుమానంగా ఇచ్చాడు.

గతంలో శ్రీకృష్ణుడు ఆ మణి గొప్పతనం విని దానిని అడిగాడు. ప్రసేనజిత్తు ఇవ్వలేదు. తమ్ముడు చనిపోయాడన్న దుఃఖంతో మునిగి సత్రాజిత్తు సరిగా ఆలోచించలేదు.



శ్రీకృష్ణుడు మణిని ఆశించాడు కాబట్టి అతడే దురాశతో తమ్ముడిని చంపి మణిని దొంగిలిచాడని భావించాడు. వాసుదేవుడిపై నిందపడింది. అంతడు నింద మాపుకోవాలి. అంటే మణిని తిరిగి తెచ్చి వారికి అప్పగించాలి. ప్రసేనజిత్తు వెళ్ళిన మార్గంలోనే కృష్ణుడు వెదుకుతూ బయలు దేరాడు.

శమంతకమణి కొరకు వెతుకుతున్న శ్రీకృష్ణుని మీద జాంబవంతుడు దాడి చేశాడు. వాసుదేవుడు గెలిచాడు. జాంబవంతుడు అతడే శ్రీ మహావిష్ణువు అని గుర్తించాడు. తన కుమార్తె అయిన జాంబవతిని అతనికి యిచ్చి పెళ్ళి చేసాడు. మణి ఆమె దగ్గరే వుంది. దానిని భద్రంగా తిరిగి తీసుకు వచ్చి సత్రాజిత్తుకు అప్పగించాడు. శ్రీకృష్ణుడు నిందమాపుకున్నాడు. రాజు ఎంతగానో సంతోషించాడు. తన కుమార్తె అయిన సత్యభామను శ్రీకృష్ణునికి ఇచ్చి పెళ్ళి చేసాడు. శ్యమంతకమణిని కూడా వారికి యిచ్చాడు.

భాద్రపద చవితినాడు చంద్రుని చూడటం వల్లనే తనకు ఈ ఆపదన వచ్చిందని శ్రీకృష్ణుడు వివరించాడు! నూతన దంపతులను అందరూ ఆశీర్వదించి గౌరవంగా ద్వారకా నగరం పంపించారు. సత్యభామ తన భర్త తాను చెప్పినట్లు వినేలా చేసుకుంది.

దివ్వెల దీపావళి

ప్రాక్జ్యోతిపురం అంటే భరత ఖండంలో అందరికి దడపుతుతోంది. అందుకు కారణం దాన్ని పాలించే ప్రభువు. ఆ అసురుని పేరు నరకుడు.

నరకాసురునికి ఎవరితోనూ మంచిలేదు. పాండవులు విరోధం కృష్ణుడు బలరాముడు యాదవులంతా విరోధం. సత్రాజిత్తు విరోధం. అందరికీ శత్రువే. బయట వారికే కాకుండా రాజ్యంలో ప్రజలకు కూడా కంటకుడుగానే వున్నాడు.

ఎందర్నో దయలేకుండా చంపేసాడు. పెక్కు రాజ్యాల మీద దాడులు చేసి వారి కన్యలను తీసుకురావడం అతనికి అలవాటు. ఆ విధంగా అతడు వివిధ దేశాల నుండి తెచ్చి బంధించిన సంఖ్యాబలం పెరిగి మొత్తం పదహారువేలు అయ్యింది. వారు చెరసాలలో మ్రగ్గుతూ ఉన్న ఎంత ఆశతో జీవిస్తున్నారు. ఎప్పటికైనా శ్రీకృష్ణుడు వస్తాడు నరకాసురిని చంపుతాడు.

ఈ చెర విడిపించుతాడని వీరందరికి ఆశ.

దేశం నాలుగు దిక్కులు నుంచి వార్తలు వచ్చాయి. నరకాసురుని ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి.

అతనిని వెంటనే చంపి వేయమని విన్నపాలు వచ్చాయి. వాటన్నింటిని విచారించిన తరువాత అతనిని చంపి తీరవలసిన సమయం వచ్చిందని వాసుదేవుడు నిర్ణయించాడు. అతని మీద దండయాత్రకు బయలుదేరాడు. వెంట సత్యభామ కూడా ఉంది.

ప్రాక్ జ్యోతిష నగరాన్ని ముట్టడించి యుద్ధం ప్రకటించాడు. నరకాసురుడు మహా ఉత్సాహంతో యుద్ధానికి వచ్చాడు. ఒకరిని మించిన వారొకరు చాలా భయంకరమైన యుద్ధం జరిగింది.

నరకుడు అపరిమిత బలశాలి. ఆయుధాలతో శ్రీకృష్ణుడు మూర్ఛపడిపోయేలా చేశాడు.

వెంటనే సత్యభామ విల్లు అందుకుంది. భర్తకు తెలివి వచ్చేంత వరకు యుద్ధం చేసి నరకుడు ముందుకు రాకుండా చూచుకుంది. కొద్ది సేపటి అనంతరం వాసుదేవుడు కన్నులు తెరచి చూచాడు.

కాసేపు అలాగే సత్య పరాక్రమాన్ని తిలకించాడు. ఆమె యుద్ధం చేసే తీరు ఎంతో ముచ్చట వేసింది. వెంటనే నరకునిపై కన్నెర్ర చేశాడు. చక్రాయుధం అతని మీద ప్రయోగించాడు. నరకాసురుని తల తెగి క్రిందపడింది.

లోకాలు దీపాలు వెలిగించుకుని పండుగ చేసుకున్నాయి. పదహారువేల మంది రాజకన్యలను శ్రీకృష్ణుడు చెరవిడిపించాడు. వారందరూ వాసుదేవుని పెళ్ళి చేసుకోవాలని పట్టుబట్టారు. కృష్ణుడు కాదనలేదు. వారి కోరిక తీర్చాడు. పదహారు వేల మంది భార్యలతో తిరిగి వచ్చాడు.

ప్రేమకు ఫలితం

శ్రీకృష్ణుడు కుమారుడు అనిరుద్ధుడు చాలా అందమయిన వాడు. అతనిని ఉష ప్రేమించింది.


కలలో కనిపించాడని ఆ అందాన్ని మరచిపోలేక పెళ్ళి చేసుకోవాలనుకుంది. కాని ఆమె తండ్రి పరమ క్రూరుడు అయిన రాక్షసుడు పేరు బాణాసురుడు.

అతడు ఎవరో కాదు. ప్రహ్లాదునికి మునుమడైన బలిచక్రవర్తి పెద్ద కుమారుడు. చాలా బలవంతుడు, దుర్గుణవంతుడు యుద్ధ విద్యలలో ఆరితేరిన వాడు. ఉష రాక్షస రాజు కూతురు. అందువల్ల ఆమె ఎంతో శక్తివంతురాలు. నిద్రపోతున్న సమయంలో అనిరుద్ధుణ్ణి దొంగిలించి తీసుకురమ్మని చెలికత్తెను పంపించింది. చెలికత్తె అవలీలగా అతన్ని మాయ చేసి

తీసుకుపోయింది. అనిరుద్ధుడు ఉషను చూచి మోహంలో పడ్డాడు. వారి ప్రేమకు ఫలితంగా ఉష గర్భం ధరించింది. అప్పటికి ఆ వార్త బాణాసురునికి తెలిసింది. మండిపడ్డాడు. అనిరుద్ధుడు తన అంతస్తుకి తగని వాడని భావం అతనిని బంధించాడు. ఉష ప్రేమకు ఫలింతంగా కన్నీరు పెట్టుకుంది.

బాణాసురుడు

సరైన సమయంలో బ్రహ్మర్షి నారదుడు శ్రీకృష్ణుడు దగ్గరకు వచ్చాడు. గౌరవాలు, కుశల ప్రశ్నలు అయిన తరువాత అసలు విషయం చెప్పాడు. ''వాసుదేవా! నీ కుమారుడు అనిరుద్ధుడు



ఏమైనాడని వెతుకుతున్నారు కదా! అతడు ఉన్నచోటు విధివశాన నాకు తెలియవచ్చింది స్వామి.

బాణాసురుని కుమార్తె నీ కుమారుని ప్రేమించి దొంగిలించి తీసుకుపోయింది. వారి ప్రేమ బాణాసురునికి కన్నెర్ర అయ్యింది. శ్రీకృష్ణుని వంటి అధమునితో నాకు వియ్యం ఏమిటి అని మండిపడ్డాడు.

నీ కుమారుడ్ని నాగపాశంతో కట్టివేశాడు. అతనిని రక్షించుకో.

నేను చాలా దూరం వెడుతూ దారిలో ఈ విషయం చెప్పి పోదామని వచ్చాను. మరి నాకు సెలవా? నారాయణ! నారాయణ! '' అంటూ దేవర్షి వెళ్ళిపోయినారు.

వెనువెంటనే శ్రీకృష్ణుడు యదు సైన్యాన్ని తీసుకొని బాణాసురుని మీద యుద్ధానికి వెళ్ళాడు. అతడు పరమ శివభక్తుడు. శివుడు యుద్ధంలో బాణాసురునికి సాయం చేయటానికి కైలాసం దిగి వచ్చాడు. వాసుదేవుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగించి రాక్షసుని వేయి చేతుల్ని నరికేశాడు. అతని శక్తి అంతా పోయింది. అతనిని చంపాలని శ్రీకృష్ణుడు అనుకొన్నాడు. కాని శివుడు అడ్డుపడ్డాడు.

''ఉపేంద్రా! ఇతడు నా భక్తుడు! ప్రాణాలతో విడిచిపెట్టు'' అందుకు ''తథాస్తు'' అన్నాడు కృష్ణుడు.

బాణాసురుడు శక్తి అంతా పోయిన తరువాత మనసు మార్చుకొన్నాడు! తన కుమార్తె అయిన ఉషాదేవిని శ్రీకృష్ణుని కుమారుడైన అనిరుద్ధుడికి పెండ్లి చేసాడు. విరోధులు వియ్యం పెట్టుకొన్నారు.

లోకాలు సంతోషించాయి.

వాసుదేవుని లీల

శ్రీకృష్ణుడు ఇప్పుడు చిలిపి బాలుడు కాదు. రాసలీలలు నడిపే యువకుడు కాదు. ప్రౌఢ వయస్సు వచ్చింది. రాజకీయాలు నడపడంలో దిట్ట అయ్యాడు. హస్తినాపురంలో అయినా, మధురలో అయినా, ద్వారకలో అయినా రాజకీయం అంతా అతనిదే. రాజనీతి ఆయన సొత్తు. ఆలోచనలు ఎత్తుగడలు ఆయన స్వంతాలు. చెడ్డవారిని చంపివేయడం కాదు మంచి వారుగా మార్చాడు. పౌండ్రక వాసుదేవునికి అహంకారాన్ని అణచివేశాడు. ఒకసారి నారదునికి కొంచెం గర్వం కలిగింది.

దాన్ని పోగొట్టడానికి తన లీలతో నారద సంస్కారం చేయించి గొప్పగా నీతిని బోధించాడు. ఆయన చేపట్టిన పనులు అన్నీ విజయం పొందాయి.

ధర్మరాజు చేత రాజసూయ యాగం చేయించడం అన్నిటిలోకి అతి ముఖ్యమయిన రాజకీయం.

భీముడిని వెంటపెట్టుకు పోయి జరాసంధుని చంపించాడు గొప్ప రాజు అయిన శిశుపాలుడు నిండు సభలో శ్రీకృష్ణుని అవమానించాలని ప్రయత్నించాడు.

అత్తకి యిచ్చిన వరం ప్రకారం నూరు తప్పులు దాటనిచ్చాడు శిశుపాలుడుని చంపేశారు. అతనికి తోడు నిలిచిన దంతవక్త్రుడిని కూడ అదే పద్ధతిలో చంపాడు.

హిరణ్యాక్ష, హిరణ్య కశిపులు, రావణ కుంభకర్ణులు. ఈ శిశుపాల దంతవక్త్రులను చంపడంతో జయవిజయులు విరోధంతో మూడు జన్మలు పోరాడి తిరిగి వైకుంఠం చేరుకున్నారు.

చిన్ననాటి స్నేహితుడు

శ్రీకృష్ణుడు తన ప్రియభార్యలు యిచ్చిన విందులు ఆరగించాడు. వారు తాంబూలం అందిస్తూ ఉంటే సేవిస్తూ ఊయన మీద వైభోగంగా ఊగుతున్నాడు.



''మీ కోసం ఎవరో వచ్చారు''

''ప్రవేశపెట్టు''

కొద్ది సేపటి తరువాత చిరుగుపాతలు ధరించిన ఒక నిరుపేద బ్రాహ్మణుడు అతని ఎదుటకు వచ్చాడు! శ్రీకృష్ణుడు మొత్తం భారత వర్షం - రాజకీయాలనే శాసించగల మహానుభావుడుగా వెలుగుతున్న సమయం అది!

కృష్ణ వైభవం కన్నులకు మిరుమిట్లు గొలుపుతున్న కాలం! అలాంటి సమయంలో ఒక చిరుగుపాతల నిరుపేద ముందుకు రాగానే శ్రీకృష్ణుడు తటాలున లేచి ఎదురు వెళ్ళి గాఢంగా కౌగిలించుకున్నాడు.

''మిత్రమా! కుశలమా!'' అని మనసారా ప్రశ్నించాడు! చేయి పట్టి తీసుకు వచ్చి ఊయల మీద తన ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు!

''కృష్ణా! నేనింకా నీకు గుర్తున్నానా?'' దీనాతి దీనమయిన కంఠ స్వరంతో అడిగాడు ఆ బడుగుజీవి. ''నా వారిని నేను మరచిపోను కదా!'' అన్నాడు కృష్ణుడు. ఉజ్జయినిలో సాందీపని దగ్గర శ్రీకృష్ణునికి అతడు సహపాఠి! ఇద్దరూ కలిసి చదువుకున్నారు. కలిసి సమిధల కోసం అడవిలో తిరిగారు. ఆకలి ఆవేదన అనురాగం అన్నీ కలిపి పంచుకున్నారు. విడిపోయాక కుచేలుడు పెద్ద కుటుంబీకుడు దీనుడు అయ్యాడు. కృష్ణుడు అవతార పురుషుడు అయ్యాడు. ఆ అంతరాన్ని మరచి వారు చిన్నతనం ముచ్చట్లు చెప్పుకున్నారు. అతడిని సాదరంగా సాగనంపాడు కృష్ణుడు! (మూలంలో అటుకులు లేవు) కుచేలుడు చాలా కాలం తరువాత మిత్రుడు కలిసి మాట్లాడిన మధురమైన మైకంలో ఇంటికి చేరాడు.

అప్పటికే అతని స్థితి మారిపోయింది!

శ్రీకృష్ణుని దయతో ధనవంతుడు అయ్యాడు!

చెలిమి అంటే ఎలాంటిదో చెప్పాడు వాసుదేవుడు!

ముసలం పుట్టింది

కురుక్షేత్ర యుద్ధం పూర్తియ్యింది. శ్రీకృష్ణుడు భూమి భారాన్ని తగ్గించాడు. అతని వల్ల ధర్మం గెలిచింది. అధర్మం ఓడిపోయింది. తన కర్తవ్యం పూర్తయ్యింది కాబట్టి పాండవులను విడిచి కృష్ణ పరమాత్మ ద్వారకా నగరం వెళ్ళిపోయాడు. బలరామకృష్ణుల కాలంలో యదువంశం వారి వైభవం చుక్కలను తాకింది. వారు ధనవంతులు అయ్యారు. బలవంతులయ్యారు. ప్రపంచంలోని తిరుగులేని శక్తి వంతులయ్యారు. అది వారిలో గర్వాన్ని కలిగించింది. తప్పు దారిని నడిచేవారు తన వారైనా వాసుదేవుడు వారిని క్షమించడు గర్వం కలిగిన తన వారికి తగిన సమయం వచ్చినప్పుడు బుద్ధి చెప్పాలని అనుకున్నాడు. ఆ సమయం వచ్చింది. వామదేవుడు, విశ్వామిత్రుడు, దుర్వాసుడు మరెందరో మహానుభావులు ద్వారకా నగరానికి వచ్చారు.

యాదవుల వైభవం చూచి ఆనందించారు.

రాజు వారికి మర్యాదలన్నీ చేయించాడు.

చక్కని పూల తోటలో విడిది ఏర్పాటు అయ్యింది.


మునులందరు విడిదిలో కూర్చోని మంచి కథలు చెప్పుకొన్నారు. అయితే బలంతో గర్వించిన యాదవులు కొందరు వీరిని అవమానించాలని ఒక పథకం వేసారు. సాంబుడు అనే యువకుడు వున్నాడు. అతని చేత ఆడవేషం వేయించారు. పైగా గర్భవతి అయినటట్లుగా అలంకారం చేయించారు. ఈ వెకిలి వేషంతో పెద్దలనే గౌరవం లేకుండా వాడు మునుల మధ్యకు వచ్చాడు.

''మీకు అన్నీ తెలుసు కదా! నేను ఎప్పుడు ప్రసవిస్తానో చెప్పండి!'' అన్నాడు సాంబుడు.

వెనుక యాదవులు కిచకిచలాడుతున్నారు. దుర్వాసుడు కోపానికి రూపం. అతడు విషయాన్ని అర్థం చేసుకున్నాడు.

యాదవులకు గర్వం కలిగిందని, వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని, కృష్ణపరమాత్మ కూడా యీ ఆలోచనతోనే వున్నాడని దుర్వాసునికి తెలిసింది.

''యాదవులారా! గర్వం అన్ని విధాల నష్టదాయకం! మునులతో పరాచకం ఆడుకొంటారా! యీ సాంబుని గర్భమే నిజమౌతుంది! యితనికి ముసలం పుడుతుంది. అది మీ యదు వంశ నాశనానికి కారణం అవుతుంది!'' అని దుర్వాసుడు శపించాడు.



పరిహాసం కోసం వచ్చిన యాదవులు భయపడ్డారు. చేయగలిగింది ఏమీ లేదు. కనుక తలలు వంచారు. శాపం వల్ల సాంబుని గర్భం నిజమే అయ్యింది. కాని గర్భంలో ముసలం బయటికి ఎలా రావాలి?! వారు కత్తులతో అతని పొట్టను చీల్చారు. ముసలం బయటపడింది.

అది వంశాన్ని నాశనం చేస్తుందని భయం.

వెంటనే అందరూ కలిసి దాన్ని సముద్ర తీరానికి తీసుకుపోయారు. రాతి చట్టుల మీద అరగతీయటం ప్రారంభించారు. ఆ రజను సముద్రపు నీళ్ళలో కలిపేసారు.

ఒక చిన్న ముక్క మిగిలింది.

అది తమనేమి చేయలేదని సముద్రంలో పారేశారు. దాన్ని ఒక తిమింగలం మ్రింగింది. వెళ్ళి జాలరి వలలో పడింది. పుట్టిన ముసలం తిరిగి జనం మధ్యకు వచ్చింది. తగవుల రూపంలో వచ్చింది. ఒక బోయవాడు ముసలాన్ని తన బాణానికి ములుకుగా అమర్చుకొన్నాడు.

ముసలం పుట్టటానికి కారణం ఎవరు?! అనే విషయం మీద చర్చలు మొదలు అయినాయి. అవి తగవులుగా మారాయి. ఆ తగవులు యాదవులు తలల్ని తరిగేసుకునేంత వరకు వచ్చింది! కల్లోలం ప్రారంభమయింది.


అవి యదుకులంలో బాగా ప్రాకి గ్రామాల మధ్య నగరాల మధ్య, ప్రజల మధ్య చాలా విరోధాలు తెచ్చి పెట్టాయి. ఒకరి మీద ఒకరు కత్తులు దూసుకున్నారు. తలలు త్రుంచుకున్నారు. తెలివి గలిగిన పెద్దలు ఏమీ చేయలేక చూస్తూ వుండిపోయారు.

కృష్ణుడు యాదవులను తన దగ్గరకు పిలిపించుకొని యిలా చెప్పాడు!

''బంధువులారా! కాలం అన్నిటి కన్నా గొప్పది! మన వైభవాలు అంతరించిపోయే రోజు ఒకటుంది. చెడ్డకాలం సమీపించింది. మనమంతా ఒకటిగా ఐకమత్యాన్ని, స్నేహాన్ని సంపదను, మంచిరోజులను తలచుకుంటూ యిక్కడే వుండి క్రుంగిపోవడం మంచిది కాదు. సముద్రం అవతల ప్రభాస క్షేత్రం అని ఒక చోటుంది. స్థలం మారితే మనం గుణం మారుతుందేమో అక్కడకు వెళ్ళి ప్రయత్నించండి. ఎక్కడైనా మనిషి క్షేమంగా వుండాలంటే శాంతంగా జీవించాలి'' యీ మాటలు విని యాదవులు సముద్రాన్ని దాటి ప్రభాస క్షేత్రం వెళ్ళారు.

పుట్టిన ముసలం పోదుకదా! అక్కడ కూడా తగవులే. వారి తలలకు ఎక్కాయి. కోపం వలన ఆలోచన నశిస్తున్నది.

బుద్ధిహీనులై మళ్ళీ కొట్టుకోవడం, చంపుకోవటం మొదలెట్టారు.



శ్రీ కృష్ణ పరమాత్మ తనవారి కోసం అందించిన అమృత బిందువుల వంటి మాటలు వారు మర్చిపోయారు. అంతఃకలహాలు వలన యదుకులం అంతరించిపోవడం మొదలైంది.

ప్రభావ క్షేత్రంలో ''మైరేయం'' అనే ఒక మత్తుపానీయం దొరుకుతుంది. దాన్ని యీ యాదవులు చిత్తుగా సేవించారు.

మొదలే తగవులు మధ్య కొట్టు మిట్టాడుతున్న వారు ఈ మత్తు పానీయంతో అంతా మర్చి పోయారు. మంచిని వదిలేసారు. సాంబుని ముసలాన్ని అరగతీసిన రజను, సముద్రంలో కలిసి ప్రభాస తీరానికి కొట్టుకు వచ్చింది. దాని వలన యినుప తుంగ పోచలు పుట్టాయి. వాటిని ఆయుధాలుగా చేసుకొని జనసంఖ్య బాగా తగ్గిపోయేవరకు ఒకరినొకరు చంపుకున్నారు.

జరుగుతున్నదంతా శ్రీకృష్ణ పరమాత్మకు తెలుసు. మునిశాపం పూరికే పోదని కూడా తెలుసు.

బలరాముడు తాను ప్రేమించిన యాదవులు యిలా అయిపోవడం చూచి క్రుంగి పోయాడు. కలికాలం వచ్చినప్పుడు ఎంత గొప్పవారైనా తలను వంచాలి.

విధి యిచ్చిన తీర్పును తల మీద వుంచుకోవాలి. బలరాముడు బాగా ఆలోచించి తాను చేయగలిగిన దేమిటో నిర్ణయించుకున్నాడు.

కొండమీది నుంచి దొర్లే రాయిని ఎవరు ఆపగలరు? ఆ అన్నదమ్ములు యముని మెప్పించి చనిపోయిన వారిని తీసుకురాగలిగారు.

అదే కాని కాలం వచ్చిన యీ సమయంలో యిద్దరు గొల్లపిల్లలు కొట్టుకుంటే వద్దని వారించలేని స్థితిలో వున్నారు. యిక మిగిలివున్న దారి ఒక్కటే.

బలరాముడు ఒక ఏకాంత ప్రదేశానికి చేరుకున్నాడు. చెట్టు నీడలో పద్మాసనం వేసుకొని కూర్చొన్నాడు. వంశం పూర్తిగా అంతరించిపోవటం నేను చూడకూడదు అనుకున్నాడు. యోగాన్ని పూరించి, ఆత్మను పరమాత్మలో కలిపేసాడు. ఆదిశేషువు అవతారం పూర్తి అయింది.

బలరాముడు చనిపోయిన వార్త శ్రీకృష్ణుడు తెలుసుకొన్నాడు. అతడు అనంతకాలంలో విశ్రమించిన యోగపురుషుడు ఒక ఏకాంత ప్రదేశానికి వెళ్ళి ఒక రావి చెట్టు క్రింద పడుకొన్నాడు.

అరికాళ్ళు ఎర్రగా తామరాకు దవ్వల్లా వున్నాయి. శరీరంలో దివ్యమైన నీలమణుల కాంతి వుంది. ఆయన వక్షస్థలం మీద కౌస్తుభం ధగ ధగలాడుతుంది. ముసలం ములుకును బాణం ములుకుగా చూసుకున్న బోయవాడు, అటువైపుగా వచ్చాడు. పరమాత్ముని పాదాలను పొంచి పొంచి చూసాడు. పొదల లోంచి ఆ పాదాలు అతనికి లేడి కూన పెదవులుగా కన్పించాయి. విల్లుకు ముసలాన్ని ఎక్కుపెట్టి విడిచిపెట్టాడు. గురి తప్పలేదు. ఆ బాణం పరమాత్ముని కాలి బ్రొటనవేలును చేధించింది! అంటే! అక్కడ నీల మేఘాన్ని మరపించే అందమైన శరీరం లేదు.



ప్రాణం లేని శరీరం శరీరమే కాదు కదా. కృష్ణరూపం, శ్రీ మహావిష్ణువు రూపం పోయింది. కృష్ణ శబ్దం, విష్ణుశబ్దం అయిపోయింది. పొదలలో వెదురు కర్రలలో అడవి గాలి దూరి వేణుగానం లాగా విన్పిస్తున్నాయి. చెట్లు పుట్టలు కొండలు, సముద్రాలు, ప్రకృతి, భూదేవి, కన్నీరు కార్చాయి. కృష్ణుడు పడుకొన్న చోటు నాలుగు భుజాలతో శ్రీవత్సము,కౌస్తుభము, గుండెల మీద లక్ష్మీ దేవిని ధరించిన విష్ణురూపం ప్రత్యక్షమయ్యింది! శంఖుచక్ర గద, పద్మాలను ధరించిన ఆ మంగళమూర్తిని వేటగాడు చూచాడు. వచ్చి స్వామి పాదాలను పట్టుకొన్నాడు.

''ఎంత పాపం చేశాను స్వామి?!'' అని విలపించాడు. నీవు నీ బాణము, కేవలము నిమిత్తమాత్రం. కాలం తన పనితాను చేయక మానదు! నాకు కృష్ణ శరీరం నుంచి విముక్తిని నీవు యిచ్చావు! నీకు జీవన్ముక్తుని యిస్తున్నాను బాధపడకు'' అని స్వామి అంతర్ధానమైపోయాడు. కృష్ణావతారం పరిసమాప్తమయ్యింది.

కాలమే కలిరూపం

పరీక్షిత్తు చనిపోయిన తరువాత జనమేజయుడు సర్పయాగం చేసాడు.

యీ లోకం నాలుగు యుగాలలో మాత్రమే వుంటుంది. అవి కృతాయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలియుగం, కృతయుగానికి నాలుగు పాదాలున్నాయి. అవి సత్యం, దయ, తపస్సు, దానం. మనుష్యులుంతా మంచివారుగా వుంటారు. త్రేతాయుగంలో యీ లక్షణాలన్ని కొంచెం దిగువ స్థాయిలో వుంటాయి. ధర్మం మాత్రం అడుగంటిపోదు. గాని అధర్మాని గురించిన ఆలోచనలు మొదలవుతాయి.

ద్వాపర యుగంలో అంటేే శ్రీకృష్ణుని కాలం లోకంలో చెడ్డ ఆలోచనలు మొదలవుతాయి. అహింస మాత్రమే కాదు. హింస కూడా వుంటుంది. త్యాగమే కాదు. స్వార్థం కూడా పెరుగుతుంది. సుఖాలను వెన్నంటి దుఃఖాలు కూడా నీడలా వస్తాయి.

యిక నాల్గవది యిప్పుడు మనం చూస్తున్న కలియుగం. ధర్మం పూర్తిగా దూరమౌతుంది. అసత్యానికి వున్న విలువ సత్యానికి వుండదు. హింస అహింస కన్నా ఎక్కువగా నడుస్తుంది. తగవులు ఎక్కువ అవుతాయి. అధర్మం, అసంతృప్తి ప్రజలలో తాండవిస్తాయి. కలియుగం యిలాగే నడిచి నడిచి మరికొంత దూరం పోయాక యుగాంతం అవుతుంది. తిరిగి ఎప్పుడో, ఎక్కడో యుగచక్రం మొదలవుతుంది. కాలం నడిపించే కథ యీ సృష్టి.

కాలనేమికి కర్మసాక్షి ఒకడున్నాడు.

వాడే శ్రీమన్నారాయణుడు.

అతడు సమస్త విశ్వమంతా ఎంత వున్నదో, అంత శిశువుగా వుంటాడు.

ఆ శిశువు సృష్టికి బీజం.

భాగవతం కలియుగాన్ని ప్రత్యేకంగా వర్ణించింది.

దురాచారాలు పెరుగుతాయి.

ధనాశ పెరుగుతుంది.

కలియుగంలో ఆకలి తీర్చే అన్నాన్ని అమ్ముకుంటారు. అని భాగవతంలో వ్రాసి వుంది.

ఉపాధ్యాయులు విద్యను అమ్ముకుంటారు. బ్రాహ్మణులు వేదాన్ని దుర్వినియోగం చేస్తారు. తల్లి, బిడ్డలు తగవులాడుకొంటారు. పిల్లల్ని కబళించే తల్లులు పుట్టుకొస్తారు. వ్యర్థమైన కామవాంఛలే కాని, ప్రేమకు అర్థం ఎవరూ ఆలోచించరు. అసూయలు పెరుగుతాయి. ఒకరి కొకరు ఉపకారం చేసుకోవాలన్న ఆలోచన విడిచి పెట్టేస్తారు. అపకారం చేసుకుంటారు.

సమాజం ఎవరూ భరించలేని ఒక వికృత రూపానికి వస్తుంది.

అపుడు మళ్ళీ మహావిష్ణువు కల్కి రూపంలో అవతరిస్తాడు.

భాగవతంలో కల్కి ఎక్కడ పుడతాడో కూడా వ్రాసాడు.

విష్ణుయేసుడు అనే పేరు గల బ్రాహ్మణుడు సింహళ దేశంలో శంభళ అనే గ్రామంలో వుంటాడు.

అతని గర్భవాసాన కల్కి పుడతాడు.

అతడు దేవతల దగ్గర నుంచి ఒక గుర్రాన్ని తెచ్చుకొంటాడు.

దాని మీద ఎక్కి భూమి అంతా తిరిగి ధర్మాన్ని నిలబెట్టడానికి ప్రయత్నం చేస్తాడు. దొంగల్ని, దొంగపాలకుల్ని చంపేస్తాడు.

శీలాన్ని అమ్ముకొనే దురదృష్టవంతులను,వున్నతిలోకి నడిపిస్తాడు.

అందరూ నిజం చెప్పేలా శాసనం చేస్తాడు!

అతడు వచ్చిన తరువాత ప్రజలు దయను గురించి ధర్మాన్ని గురించి గుర్తుచేసుకుంటారు. తన తరువాత ఎవరు రాజులు కావాలో కడా కల్కి నిర్ణయిస్తాడు. భాగవతంలో కథలలో కొందరు చిరంజీవులున్నారు. వారు ఎన్ని యుగాలైనా మరణించరు.

సమయం వచ్చినప్పుడు అవసరం అనుకున్నప్పుడు వారంతా తిరిగి సమాజ జీవితంలోకి వస్తారు. ప్రజలను రక్షిస్తారు. కాలం ఆగదు! ఋతువులు నడుస్తుంటాయి.


మనుష్యులు క్రమంగా తేజస్సును పొంది, దివ్యపురుషులు అవుతారు! మళ్ళీ మంచిరోజులు వస్తాయి!

అన్ని ప్రశ్నలకు సమాధానం పరమాత్ముడే!

ప్రకృతి కాలం లోంచి పుడుతుంది!

కాలం శ్రీమన్నారాయణుని సంకల్పంలో పుట్టి పెరిగి అక్కడే లభిస్తుంది.

కనుక మనలోపల, బయట ఆయన తప్ప ఏమీ లేదు?! జగమంతా నారాయణునితో నిండి వుంది?!



ఓం శాంతి! ఓం శాంతి!



ఎమెస్కో